PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 274 | విజయవాడ, బుధవారం 7 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 7 May 2025 | Rs

క్వార్ట్జైట్ మైనింగ్ లీజు రద్దు చేయాలి

- రాష్ట్ర మైనింగ్ సెక్రటరీకి మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ

3



ఉత్కంఠపోరులో గుజరాత్ టైటాన్స్ గెలుపు

- ఛేదనలో పలుమార్లు వర్షం అడ్డంకి
- మూడు వికెట్ల తేడాతో ఓడిన ముంబయి

8



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రత్యామ్నాయం చూపకపోతే

మరో పోరాటం

- బాధితులకు పునరావాసం కల్పించాలి
- ఇళ్లు కూల్చమని డిప్యూటీ స్పీకర్‌కు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రభుత్వం ఇచ్చిందా
- ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని పేదలపై యుద్ధం ఆపాలి
- భీమవరం బహిరంగ సభలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- భీమవరం

ఉండి నియోజకవర్గంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రత్యామ్నాయం చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వని పక్షంలో మరో పోరాటానికి సిద్ధమవుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. అన్యాయంగా పేదల ఇళ్లను కూలుస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు కనీసం స్పందించలేదని, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుకు ఇళ్లు కూల్చాలని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని పేదలపై యుద్ధాన్ని ఆపాలని కోరారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటిస్థలమిచ్చి ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పాత బస్టాండ్ సెంటర్లో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలు నిలువ నీడలేక చెట్టుకొకరు, పుట్టకొకరు అయిపోవడం బాధాకరమన్నారు. పేదల న్యాయమైన పోరాటానికి పార్టీలకతీతంగా అంతా బాసటగా నిలవాలని కోరారు. ప్రభుత్వ స్థలాలు, కాలువ గట్లు వెంబడి ఉన్న పేదల ఇళ్లను కూల్చేశారని, దీనికి న్యాయబద్ధత, చట్టబద్ధత ఎవరిచ్చారని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే పేదలకు నిలువనీడ లేకుండా చేయడమా అని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబు పి-4 పేరుతో పేదరిక నిర్మూలన అంటుంటే, ఉండి ఎంఎల్ఎ మాత్రం పేదలనే నిర్మూలిస్తానని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఉగ్రవాద దాడులపై ప్రజలందరూ ఐక్యంగా యుద్ధం చేస్తుంటే, ఉండి నియోజకవర్గంలో మాత్రం పేదలపై బుల్డోజర్లతో యుద్ధం చేయడం అన్యాయమని అన్నారు. గౌరవ స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పేదల ఇళ్లు కూలుస్తామని బహిరంగంగా ప్రకటిస్తుంటే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడిని ఆపకపోతే సహించేదిలేదని సుప్రీంకోర్టు ఇటీవల మూడుసార్లు మిగతా 7లో

రాజధాని పనులకు ఆమోదం


ముఖ్యమంత్రి అధ్యక్షతన సిఆర్‌డిఎ సమావేశం

71 సంస్థలకు 1,050 ఎకరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పనులకు సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ మేరకు అమరావతి పరిధిలో జరుగుతున్న వివిధ పనులకు అనుమతులిచ్చింది. మొత్తం రూ.1,732 కోట్ల విలువైన పనుల టెండర్లకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం ఉదయం వెలగపూడి సచివాలయంలో సిఆర్‌డిఎ అథారిటీ 47వ సమావేశం జరిగింది. దీనిలో రూ.1,732 కోట్ల విలువైన పలు పనులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సిఎస్ విజయానంద్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు, ఎడిసి ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి సంబంధించిన అంశాలను మంత్రి నారాయణ మీడియాకు వివరించారు.

అథారిటీ సమావేశంలో 21 అంశాలపై చర్చించారు. వీటిల్లో ప్రస్తుతం పిలిచిన టెండర్లకు సంబంధించి అనుమతులు, అలాగే వేర్వేరు సంస్థలకు భూ కేటాయింపుల అంశంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2014-19లో అనుమతించి



అనంతరం ప్రారంభించిన గెజిటెడ్ అధికారుల నివాసాల పూర్తి చేసేందుకు రూ.514.41 కోట్లతో పిలిచిన టెండర్లను ఆమోదించారు. వాటిల్లోనే అదనపు సదుపాయాలకు రూ.193.74 కోట్లు, ఎన్‌జిఒల కోసం నిర్మిస్తున్న తొమ్మిది టవర్లకు రూ.506.67 కోట్లు, మరో 12 టవర్ల నిర్మాణం, సదుపాయాల కోసం రూ.517.10 కోట్లు విలువైన పనులకు అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. మొత్తంగా గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలకు సంబంధించి నాలుగు ప్యాకేజీల్లో రూ.1,732.31 కోట్ల విలువైన పనులకు అనుమతి తెలిపారు. 190 ఎంఎల్‌డి సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటును రూ.560.57 కోట్లతో నిర్మించనున్నారు. దీనికి కూడా అథారిటీ ఆమోదం తెలిపింది. దీన్ని నిర్వహణ ఐదేళ్ల పాటు కాంట్రాక్టు కంపెనీ నిర్వహించనుంది. రాజధాని గ్రామాల మొత్తానికి నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేసేందుకు 15 ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించాలని నిర్ణయించారు. వీటి కోసం రూ.494.84 కోట్లు కేటాయించారు. దీనికి కూడా ఆమోదం తెలిపారు. ముఖ్యంగా సీడ్ యాక్సెస్ రోడ్డు (ఇ-13)తోపాటు ఇ-15 రోడ్డును జాతీయ రహదారికి అనుసంధానం చేయనున్నారు. వీటిల్లో సీడ్ యాక్సెస్‌రోడ్డును 3.5 కిలోమీటర్లు దూరం విస్తరించాల్సి ఉంది. ఇందులోనూ 1.5 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ (ఫ్లైఓవర్) నిర్మించనున్నారు. తాడేపల్లి వర్కుషాప్ నుండి సీతానగరం రైల్వే బ్రిడ్జి అవతల వరకూ దీన్ని నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. మొత్తంగా రూ.70 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇ-15 రహదారిని ప్రస్తుతం ఉన్నచోట నుండి 4.10 కిలోమీటర్ల దూరం విస్తరించాల్సి ఉంది. దీనికి రూ.384.78 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ పనులన్నిటిపై చర్చించిన అథారిటీ అన్నిటికీ ఆమోదం తెలిపింది. అనుమతి లభించిన వాటిల్లో ఇప్పటికే చాలాచోట్ల పనులు ప్రారంభం అయ్యాయని మంత్రి మీడియాకు తెలిపారు.

లా యూనివర్సిటీకి 58 ఎకరాలు

అథారిటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు భూ కేటాయింపులపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కూడా మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో లా యూనివర్సిటీకి 58 ఎకరాలు, క్వాంటమ్ వ్యాలీకి 50 ఎకరాలు కేటాయిస్తూ అథారిటీ తీసుకున్న నిర్ణయం ప్రకారం మంత్రివర్గ ఉప సంఘం అనుమతి ఇచ్చింది. దీంతోపాటు బసవతారకం కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు గతంలో 15 ఎకరాలు కేటాయించగా, ప్రస్తుతం అదనంగా మరో ఆరు ఎకరాలు కేటాయించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగానికి 0.78 ఎకరాలు, రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.0.78 ఎకరాలు, కోస్టల్ బ్యాంకు హెడ్ ఆఫీసుకు 0.40 ఎకరాలు, ఐఆర్‌సిటిసి హోటళ్లకు ఎకరా భూమిని కేటాయిస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో మొత్తం ఏడు సంస్థలకు భూములు కేటాయించారు. 2014-19లో 131 సంస్థలకు భూ కేటాయింపులు జరపగా, వాటిల్లో చాలా వరకూ వెనక్కు తగ్గాయి. ప్రస్తుతం ఆయా సంస్థలతో చర్చించారు. ముందుకు వచ్చిన వాటికి భూ కేటాయింపులు జరపాలని నిర్ణయించారు.

అందరూ అంగన్‌వాడీ వర్కర్లే

- మినీ వర్కర్లను ప్రమోట్ చేసిన తెలంగాణ సర్కారు
- పోరాట ఫలితంగానే జిఒ : సిఐటియు

7

ట్రంప్ సుంకాలతో సామాన్యులు విలవిల

- అమెరికా ప్రజలపై ఏడాదికి రూ.3.3 లక్షల అదనపు భారం
- పలు గ్రూపుల విశ్లేషణలు

7

నేడు పౌర రక్షణ మాక్ డ్రిల్స్

- వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించిన కేంద్ర హోం శాఖ కార్యదర్శి

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్లు

2

ప్రశాంతంగా ఎపి ఇసెట్

- 97.27 శాతం హాజరు

ప్రజాశక్తి- అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, అనంతపురం జెఎన్‌టియు సంయుక్తంగా నిర్వహించిన ఎపి ఇసెట్-2025 పరీక్ష మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు మన రాష్ట్రం, తెలంగాణ రాష్ట్రం నుంచి 35,187 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 34,228 (97.27 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. మన రాష్ట్ర నుంచి 33,861 మంది దరఖాస్తు చేసుకోగా, 32,956 (97.33) శాతం) మంది పరీక్ష రాశారు. తెలంగాణలో 1326 మందికిగాను 1272 (95.93 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. అనంతపురం సమీపంలోని ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఎపి ఇసెట్ చైర్మన్, జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు, కన్వీనర్ బి.దుర్గాప్రసాద్ తదితరులు తనిఖీ చేశారు. ఎపి ఇసెట్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని సెట్ చైర్మన్ తెలిపారు.

గాలి జనార్ధన్‌రెడ్డికి ఏడేళ్లు జైలు

- ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సిబిఐ కోర్టు తీర్పు
- సబితా ఇంద్రారెడ్డి, కృపానందం నిర్దోషులుగా ప్రకటన

ప్రజాశక్తి- హైదరాబాద్

ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సిబిఐ కోర్టు మంగళవారం తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్లపాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్ధన్‌రెడ్డి, బివి శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్ధన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్లపాటు జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్ (ఒఎంసి)కి రూ.2 లక్షల జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రి సబితా



ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతోపాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంనూ సిబిఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

ఈ కేసులో విడి రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. భూగర్భగనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు ఆయనకు జైలు శిక్ష పడింది.

ఒఎంసి కేసులో కొన్ని ముఖ్యాంశాలు.. 7

బేబీ కిట్ల పథకం పునరుద్ధరణ

- రూ.1,410తో 11 వస్తువులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గతంలో ప్రజాధరణ పొందిన బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆరోగ్య మంత్రిత్వశాఖ చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆమోదించారు. 2014-19 మధ్యకాలంలో అమలైన ఈ పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసింది. గతంలో ఈ పథకానికి జాతీయ ఆరోగ్యమిషన్ కింద కొంత మేరకు కేంద్ర సాయం అందించేవారు. ఈ సాయాన్ని కేంద్రం నిలిపేసింది. ఈ నేపథ్యంలో ఈ పథకానికి రాష్ట్ర బడ్జెట్ నిధుల నుండే ఖర్చు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి చేసిన ప్రతిపాదన ను సిఎం ఆమోదించారు. ఈ బేబీ కిట్లో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన 11 వస్తువులు ఉండనున్నాయి. వీటి విలువ రూ.1,410గా అంచనా వేశారు. ఈ కిట్లో దోమతెర, బేబీబెడ్, వాటర్‌ప్రూఫ్ కాట్‌షీట్, డ్రెస్, వాషబుల్ నేప్కిన్స్, టవల్, పౌడర్, షాంపూ, ఆయిల్, సబ్బు, సోప్‌బాక్సు, రాటిల్ టాయ్ ఉంటాయి.

కొత్త రేషన్ కార్డులకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

- జూన్ నుంచి స్మార్ట్ కార్డుల తరహా రేషన్‌కార్డులు
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల జారీకి దరఖాస్తుల స్వీకరణతో పాటు కార్డుల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి మొత్తం ఆరు రకాల సేవల నమోదుకు ఈ నెల 7 నుంచి అవకాశం కల్పిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నూతన రైస్ కార్డుల జారీ, కార్డుల విభజన, చిరునామా మార్పు, సభ్యులను చేర్చడం, ఉన్నవారిని తొలగించడం, కార్డులను సరెండర్ చేయడం వంటి సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం నివాసం ఉండే ప్రాంతంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించబడిందని, వారం రోజుల అనంతరం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా ఇ-సేవలను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ నెలలో స్మార్ట్ కార్డుల రూపంలో



నూతన రైస్ కార్డుల జారీకి సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల వివరించారు. ఇకెవైసి ప్రక్రియ వల్ల నూతన రైస్ కార్డుల జారీ ఆలస్యమైందని, ఇప్పటి వరకు 94.4 శాతం మేర ఇకెవైసి పూర్తయిన నేపథ్యంలో నూతన రైస్‌కార్డుల జారీకి అవకాశం కల్పించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,46,21,223 రైస్‌కార్డులు ఉన్నాయని, ఈ కార్డుల ద్వారా సుమారు 4,24,59,028 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. 5 సంవత్సరాల లోపు, 80 ఏళ్లు పైబడిన వారికి ఇకెవైసి చేయాల్సిన అవసరం లేదనే వెసులుబాటు కల్పించడంతో 6,45,765 మందికి ఇకెవైసి చేయలేదన్నారు. ఇప్పటికే 3,94,08,070 మంది తమ రైస్‌కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం నమోదు చేసుకున్నారన్నారు. జూన్‌లో మిగతా 7లో

ఉక్రెయిన్ డ్రోన్ దాడులు

తిప్పికొట్టిన రష్యా

మాస్కో : ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ల దాడిని రష్యా సమర్థవంతంగా తిప్పికొట్టిందని మాస్కో నగర మేయర్ సెర్గి సొబియానిన్ మంగళవారం ప్రకటించారు. దాదాపుగా వందకు పైగా డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించినట్లు భావిస్తున్నారు. వాటిలో ఒకటి మాస్కో దక్షిణ ప్రాంతంలో నివాస భవంతిని తాకినట్లు ఆ దాడులకు సంబంధించిన ఫోటోల ద్వారా తెలుస్తోంది. మంగళవారం తెల్లవారు జామున 1.16 గంటలకు ఐదు డ్రోన్లను అడ్డగించినట్లు సొబియానిన్ తెలిపారు. 2గంటల్లోగా మాస్కో వైపు డ్రోన్లను మరో నాలుగింటిని కూల్చివేసినట్లు తెలిపారు. ఈ దాడుల వల్ల ఎలాంటి నష్టం జరగలేదని మేయర్ చెప్పారు. దాడులు జరిగిన ప్రాంతాల్లో అత్యవసర సేవలందిస్తున్నామని, అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2.17 గంటలకు మరో పది డ్రోన్లు వివిధ దిశల నుండి మాస్కో వైపు దూసుకువచ్చాయని, వాటన్నింటినీ కూడా రష్యా వైమానిక రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా నాశనం చేసిందని చెప్పారు. దీంతో మొత్తంగా 19 డ్రోన్లను అడ్డుకున్నట్లైందన్నారు. ఈ దాడుల సందర్భంగా ఒక డ్రోన్ నివాస భవంతిలోని పై అంతస్తును ఢీ కొట్టినట్లు ఫోటోల ద్వారా



తెలుస్తోంది. దాడుల కారణంగా మాస్కోలోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. మే 9వ తేదీన విక్టరీ డే సందర్భంగా నిర్వహించే పరేడ్‌ను లక్ష్యంగా చేసుకోవాలని భావిస్తున్నట్లు ఉక్రెయిన్ నేతలు హెచ్చరికలు చేశారు. ఇదిలావుండగా, పరేడ్ సందర్భంగా 72 గంటల పాటు కాల్పుల విరమణ అమలు చేయాలని రష్యా నేత పుతిన్ చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ నో చెప్పింది. ఈ నేపథ్యంలో తమ కాల్పుల విరమణ ప్రతిపాదనకు ఇంకా కాలం చెల్లిపోలేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కొవ్ మంగళవారం వ్యాఖ్యానించారు. గత వారం పుతిన్ ఏకపక్ష కాల్పుల విరమణను ప్రకటిస్తూ, 7వ తేది అర్ధరాత్రి నుండి 10వ తేది అర్ధరాత్రి వరకు అన్ని దాడుల కార్యకలాపాలు నిలిపివేస్తామని ప్రకటించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు

న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న సమయాల్లో క్షతగాత్రులైనవారికి ఇక నుంచి రూ.1.5 లక్షల వరకు వైద్య చికిత్సలు ఉచితంగా అందనున్నాయి. ఈ మేరకు కేంద్ర రహదారుల రవాణా మంత్రిత్వ శాఖ సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు గత జనవరిలో తీర్పు వెలువరించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం-2025'గా పేరు పెట్టారు. మోటారు వాహనం కారణంగా ఏ రహదారిలో ప్రమాదానికి గురైనా ఈ పథకం వర్తిస్తుంది. ప్రమాదం జరిగిన నాటి నుంచి ఏడు రోజులదాకా ఉచిత సేవలందుతాయి. క్షతగాత్రులకు తక్షణమే ఆసుపత్రిలో చికిత్స అందించాల్సివుంటుంది. ఒక వేళ అక్కడ సేవలందుబాటులో లేకపోతే సదరు ఆసుపత్రి వారే రవాణా ఏర్పాట్లు చేసే వేరే ఆసుపత్రికి తరలించాలి. బాధితుడు డిశ్చార్జి అయిన తర్వాత వైద్య సేవల బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్‌లో సదరు ఆసుపత్రి వారే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

రైతన్నలపై పంజాబ్ సర్కార్ కర్కశం

- బిజెపి బాటలో భగవంత్‌మాన్
- ఆందోళనను అడ్డుకునేందుకు అర్ధరాత్రి వేళ అరెస్టులు

చండీగఢ్ : అన్నదాతలను అనునిత్యం వంచనలకు గురిచేస్తూ వినాశకర విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బాటలోనే పంజాబ్‌లోని ఆమాద్మీ పార్టీ కూడా పయనిస్తోంది. కనీస మద్దతు ధరకు చట్టం, శంభు సరిహద్దు వద్ద ఆందోళనలపై ఉక్కుపాదం మోపిన సమయంలో జరిగిన నష్టానికి పరిహారం, అలాగే రైతు సంఘాల నేతలతో తక్షణమే చర్చలు తదితర అంశాలను డిమాండ్‌ను చేస్తూ శ్రమజీవులు మరోమారు ఆందోళనకు సన్నద్ధమవుతున్న తరుణంలో పంజాబ్ ప్రభుత్వం వారిపై కర్కశాన్ని ప్రదర్శించింది. శంభూ సరిహద్దుకు దారితీసే ప్రతి చోటా పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరింపజేశారు. ఎక్కడికక్కడే రైతులను అడ్డుకొని నిర్బంధించారు. పంజాబ్‌లో ప్రభుత్వ తీరుపైనా అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పలు చోట్ల ఆందోళనలు చేపట్టారు. గోధుమలు, ధాన్యం తదితర పంటల నిల్వ చేసేందుకు కూడా కనీస మౌలిక సదుపాయాలు



పంజాబ్‌లోని రూప్‌నగర్ జిల్లా పుఖ్రాలి పోలీసు స్టేషన్ వద్ద ప్రముఖ రైతు సంఘం నాయకులు కుల్వీందర్ సింగ్ పంజ్రోలి (కుర్తా వేసుకున్న వ్యక్తి)

రాష్ట్రంలో లేవంటూ, ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రైతులు వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం రైలు రోకోలు చేపట్టి నిరసనలు తెలియజేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా పిలుపునిచ్చాయి. దీంతో సోమవారం సాయంత్రం నుంచే పంజాబ్‌లోని భగవంత్ మాన్ ప్రభుత్వం అణిచివేత చర్యలకు పూనుకుంది. రైతు సంఘాల నాయకులను ఎక్కడికక్కడే అరెస్టు చేసింది. అర్ధరాత్రి పూట అరెస్టులు చేసి పోలీసు స్టేషన్‌లకు తరలించింది. ప్రముఖ రైతు సంఘం నాయకులు, నిరవధిక నిరాహార దీక్షతో దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన జగజీత్ సింగ్ దల్లేవాల్‌ను సైతం ఆప్ సర్కార్ గృహ నిర్బంధం చేసింది. మరోవైపు ప్రభుత్వం అడ్డంకులను ఛేదించుకుంటూ శంభూ సరిహద్దు వద్ద ధర్నాలో పాల్గొనడానికి పాదయాత్రగా వెళ్తున్న అన్నదాతలపైనా మాన్ సర్కార్ కన్నెర్ర చేసింది. పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరింపజేసి రైతులను అడ్డగించడంతో అనేక ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మోగా, జాగ్రావ్ వద్ద భారీ సంఖ్యలో రైతులు చేరుకుని శంభూకు పాదయాత్రగా బయలుదేరారు. పాదయాత్రకు అనుమతి లేదని చెబుతూ పోలీసులు వారి చెదరగొట్టారు. మార్చి 19న శంభూ వద్ద ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసుల దాడులకు వ్యతిరేకంగానూ, ఆ సమయంలో కనిపించకుండా పోయిన వస్తువులకు పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో రైతులు ఈ ఆందోళనకు దిగారు. రైతులపై ఆప్ సర్కార్ అణచివేత చర్యలను పలు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అన్నదాతలను అర్ధరాత్రి వేళ అరెస్టు చేసి ఆప్ సర్కార్ ప్రజాస్వామ్యంపై దాడి చేసిందని దల్లేవాల్ విమర్శించారు. కష్టజీవులను ఎంత తీవ్రస్థాయిలో అణిచివేయాలని చూస్తే అంతే స్థాయిలో ప్రతిఘటించి పాలకులకు పాఠాలు నేర్పుతారని ఆయన హెచ్చరించారు.

దుర్గగుడి ఇఒగా శీనా నాయక్ నియామకం

ప్రజాశక్తి - వన్‌టౌన్ (ఎన్‌టిఆర్ జిల్లా)


దుర్గగుడి ఇఒ నాయక్

విజయవాడలోని శ్రీ కనకదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా వికె శీనా నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఎపి మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మెంబర్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనను మాతృ శాఖ రెవెన్యూకు బదిలీ చేసి దుర్గగుడి ఇఒగా బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుండి ఇప్పటి వరకు దుర్గగుడికి ఇఒగా పూర్తి అదనపు బాధ్యతలను దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ నిర్వహిస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో నాయక్ తక్షణమే ఆ బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్రీసిటీలో ఎల్‌జి యూనిట్‌కు 8న మంత్రి లోకేష్ భూమి పూజ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి శ్రీసిటీలో ఎల్‌జి యూనిట్‌కు ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ భూమి పూజ చేయనున్నారు. రూ.5,001 కోట్లతో స్థాపించే యూనిట్ ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. రూ.839 కోట్లతో మరో 5 అనుబంధ యూనిట్లు ఏర్పడనున్నట్లు లోకేష్ కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి.

మంత్రి నిమ్మలకు సిఎం జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సిఎం సమక్షంలోనే మంత్రితో పుట్టినరోజు కేక్ కట్ కేయించారు. దీనిపై నిమ్మల మాట్లాడుతూ.. తన పుట్టినరోజును ముఖ్యమంత్రి సమక్షంలో జరుపుకోవడం సంతృప్తి, సంతోషాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో క్రమశిక్షణతో పనిచేస్తానని తెలిపారు.

మహానాడు భూమి పూజ వాయిదా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సుగవాసి పాలకొండ్రాయుడు మృతితో కడపలో ఈ నెల 7న మహానాడు ఏర్పాట్లకు సంబంధించి జరగాల్సిన భూమి పూజ వాయిదా పడిందని టిడిపి కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భూమి పూజకు సంబంధించి తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- యువకుడు మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు (పల్నాడు జిల్లా)

ప్రేమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఓ ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం చేసింది. ఇందులో యువకుడు మృతి చెందగా.. యువతికి గాయాలయ్యాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం చౌడవరంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ చౌడవరానికి చెందిన కొర్నెపాటి తేజ్ స్థానిక ఓ ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. యడ్లపాడు సమీపంలోని స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే కీర్తనతో పరిచయం ఏర్పడి వారిద్దరూ ప్రేమించుకుంటున్నారు. సోమవారం రాత్రి తండ్రితో కలిసి భోజనం చేసిన తేజ్ మరో ఇద్దరి స్నేహితులతో కలిసి కారులో బయటకు వెళ్లారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో తేజ్, కీర్తన కలిసి వెంకటేశ్వర బాలకుటీర్ వెనుక ఉన్న క్వారీ కొండ ఎక్కారు. ఇద్దరూ కలిసి 50 అడుగుల ఎత్తులో ఉన్న కొండపై నుండి కింద ఉన్న క్వారీ గుంతలో దూకారు. కొద్దిసేపటికి కీర్తన బయటకు రాగా.. తేజ్ మాత్రం కనిపించలేదు. యువతి సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో తేజ్ మృతదేహాన్ని బయటకు తీశారు. దీనిపై యువతి మాట్లాడుతూ తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఆత్మహత్య పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాస్‌పోర్టు రెన్యువల్‌కు ఉత్తర్వులివ్వండి

మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-అమరావతి

తన పాస్‌పోర్టును పునరుద్ధరించేలా అధికారులకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే విడదల రజిని దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు మంగళవారం విచారించింది. ఆమె న్యాయవాది కోనపల్లి నర్సిరెడ్డి వాదిస్తూ, క్రిమినల్ కేసుల కారణంగా పిటిషనర్ పాస్‌పోర్టును పాస్‌పోర్టు ఆఫీసర్లు రెన్యువల్ చేయడం లేదన్నారు. అధికారుల చర్యలు చట్టవిరుద్ధమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జోక్యం చేసుకుంటూ, సమగ్ర వివరాలను కోర్టుకు నివేదిస్తామని, గడువు ఇవ్వాలని కోరారు. దీంతో విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ప్రకటించారు.

దేవాదాయశాఖలో 137 ఉద్యోగాల భర్తీ

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



దేవాదాయశాఖలో ఖాళీగా ఉన్న 5 విభాగాల్లోని 137 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో భర్తీ చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం దేవాదాయశాఖపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి సిఎం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్లు-6, అసిస్టెంట్ కమిషనర్లు-5, గ్రేడ్-1 ఇఒలు 6, గ్రేడ్-3 ఇఒలు 104, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 16 పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ నియామక ప్రక్రియ త్వరగా పూర్తి చేసి ఆలయాలు సమర్ధవంతంగా నిర్వహించేలా చూడాలన్నారు. వాటతో పాటు ఖాళీగా ఉన్న 200 వైదిక సిబ్బంది ఖాళీలను కూడా అర్హులైన వారితో భర్తీ చేయాలని సిఎం సూచించారు. రాష్ట్రంలో 23 ప్రధాన ఆలయాలు ఉండగా, వీటిలో శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, కనకదుర్గమ్మ, అన్నవరం, ద్వారకా తిరుమల, సింహాచలం ఆలయాల్లో మాత్రమే నిత్యాన్నదానం పథకం అమలవుతోందని, మిగిలిన 16 ఆలయాల్లోనూ అన్నదాన పథకం అమలు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. నాణ్యతా పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు.

23 ఆలయాల మాస్టర్ ప్లాన్‌లు రూపొందించాలి : సిఎం

రాష్ట్రంలోని అన్ని ఆలయాలను దశలవారీ అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, మొదటి దశలో 23 ఆలయాలకు సంబంధించి మాస్టర్ ప్లాన్‌లు రూపొందించాలని అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఆలయాల భూములు ఆక్రమణకు గురవ్వకుండా, ఆస్తులను పరిరక్షించేలా, వాణిజ్య సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు కమిటీ వేసి సమగ్ర విధానాన్ని తీసుకురావాలన్నారు. దీంతో వచ్చే ఆదాయాన్ని తిరిగి ఆలయాల అభివృద్ధికి వినియోగించాలని, ఈ క్రమంలో దేవాదాయ భూములు హోటళ్లకు లీజుకు ఇచ్చేటప్పుడు అక్కడ శాఖాహారం మాత్రమే అందించాలని సిఎం పేర్కొన్నారు.

నోటిఫైడ్ ఆలయాల ద్వారా ఏటా రూ.1,300 కోట్లు ఆదాయం

రాష్ట్రంలో మొత్తం నోటిఫైడ్ ఆలయాలకు ఏడాదికి రూ.1,300 కోట్లకు పైగా ఆదాయం వస్తోందని, అందులో రూ.850 కోట్లు టాప్ 7 ఆలయాల నుంచి సమకూరుతోందని సిఎం చంద్రబాబు వెల్లడించారు. రూ.5 లక్షల కన్నా ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయాల నుంచి 9 శాతం మొత్తాన్ని కామన్ గుడ్ ఫండ్ (సిజిఎఫ్) కింద జమచేస్తున్నారన్నారు. 2024-25లో సిజిఎఫ్‌కు రూ.149 కోట్లు రాగా, రాష్ట్రంలో వివిధ ఆలయాల్లో రూ.1,11 కోట్లతో 48 పనులు జరుగుతున్నాయన్నారు. మొత్తం నోటిఫైడ్ ఆలయాలు 25,028 కాగా, వీటిలో ప్రస్తుతం రూ.50 లక్షల పైన ఆదాయం వచ్చే 6ఎ కేటగిరి ఆలయాలు 169, రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్న 6బి కేటగిరి ఆలయాలు-321, రూ.15 లక్షల కన్నా ఆదాయం తక్కువ వచ్చే 6సి కేటగిరి ఆలయాలు 24,538 ఉన్నాయని సిఎం తెలిపారు.

రక్తపు బొట్టు.. మనిషి ప్రాణానికి మెట్టు

కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - ములగాడ (విశాఖపట్నం)


రక్తదాతలను అభినందిస్తున్న సిహెచ్.నర్సింగరావు

రక్తపు బొట్టు మనిషి ప్రాణానికి మెట్టు అని కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (శ్రీహరిపురం) సహకారంతో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గత రెండు దశాబ్దాలుగా ఏటా మేడే సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని విశాఖలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆవరణలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదీ కార్యక్రమాన్ని తలపెట్టగా విశేష స్పందన దక్కింది. 177 మంది కోరమండల్ ఉద్యోగులు, యాజమాన్య ప్రతినిధులు, కాంట్రాక్టు ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారందరికీ యూనియన్ అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.బాషా, కార్యవర్గ సభ్యులు రామరాజు, సుధాకర్, సందీప్, దినకర్ అభినందనలు తెలిపారు. కోరమాండల్ వైజాగ్ యూనిట్ హెడ్ జ్ఞాన సుందరం మాట్లాడుతూ కార్యక్రమాన్ని మెచ్చుకున్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఉద్యోగులను కోరారు. వైజాగ్ యూనిట్ హెచ్‌ఆర్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం మల్కాపురంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింగరావు మాట్లాడారు.

మట్టి మిద్దె కూలి భవన నిర్మాణ కార్మికులు మృతి

ప్రజాశక్తి-ఆళ్లగడ్డ

మట్టి మిద్దె కూలి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు దుర్మరణం చెందిన ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం ఆర్ పాంపల్లె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... ఆర్ పాంపల్లె గ్రామానికి చెందిన గంప తిరుపాల్ పాత ఇంటికి మరమ్మతులు చేసేందుకు ఏడుగురు కార్మికులు పనికి వెళ్లారు. పాత మిద్దె కావడంతో మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో మట్టి కింద ఉన్న కార్మికులపై దంతెలు, మెత్తుపలకలు పడడంతో నలుగురు అందులో ఇరుక్కుని పోయారు.

గ్రామస్తులు వెంటనే అక్కడికి చేరుకుని మట్టిలో ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. వారిలో ఎస్.లింగందిన్నె గ్రామానికి చెందిన బండి యోనా (45), ఆర్ .పాంపల్లె గ్రామానికి చెందిన పొగాకు నారాయణ (40) మట్టి కింద పూర్తిగా కూరుకొని పోయి ఊపిరాడక మృతి చెందారు.

వారి మృతదేహాలను ఉయ్యాలవాడ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో గాయపడిన కుమార్, బాబులకు అదే ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందించారు. మిగిలిన ముగ్గురు కార్మికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇద్దరు మృతి చెందడంతో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్లతో ఈ నెల 20న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, కర్షక సంఘాలు పిలుపునిచ్చాయి. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల రాష్ట్ర స్థాయి సంయుక్త సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రైతు నాయకులు రాకేష్ టికాయత్‌పై జరిగిన దాడిని ఖండించారు. సి2ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని కోరారు. రైతు రుణాలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్‌కోడ్‌లు అమలుతో కార్మికవర్గ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని, వెట్టిచాకిరీ, బానిస విధానానికి కార్మిక లోకం బలైపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికవర్గం చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశ వ్యాప్త సమ్మె కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు కెవివి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇండో అమెరికన్ ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్లు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం 200 రోజులకు, రోజువారీ కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. సెకీ, యాక్సిస్ విద్యుత్తు ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల వృత్తిదారుల హక్కులు కాపాడాలన్నారు. రైతు నాయకులు చుండూరు రంగారావు మాట్లాడుతూ.. ధాన్యం, పొగాకు, శనగ, మినుముల పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కేటాయించి, కొనుగోలు చేయాలన్నారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి పోలారి మాట్లాడుతూ.. కార్మికులు తమ పోరాటాల ద్వారా సాధించిన హక్కులు, చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. కార్మికవర్గం తమ శక్తిని ఈ సమ్మె ద్వారా చాటాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దడాల సుబ్బారావు, రైతు సంఘాల నాయకులు ఎం సూర్యనారాయణ, డి హరినాథ్, ఎం వెంకటరెడ్డి, యు వీరరాజు, పోతురాజు, మేకల ప్రసాద్, పగడాల ఆంజనేయులు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ముఠా, జట్టు, హమాలీ, కళాసీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్‌ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ మే 20న సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చింది. ఈ మేరకు మంగళగిరిలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ నిషాంత్ కుమార్‌ను, యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు ఎన్‌వి సుబ్బారెడ్డి తదితర నాయకులు కలిసి సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హమాలీల సమస్యలపై పలు డిమాండ్లను సమ్మె నోటీసులో పేర్కొన్నారు. వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎన్ ప్రసాదరావు, రాష్ట్ర నాయకులు సిహెచ్ విష్ణు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు తదితర అంశాలతో ఈ నెల 20న సమ్మెలో పాల్గొంటున్నట్లు ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయ అధికారులకు సమ్మె నోటీసును అందించారు. అదే విధంగా ఎపి పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఈ నెల 20న సమ్మెలో పాల్గొంటున్నట్లు నోటీసును ప్రభుత్వానికి ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయ అధికారులకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు సమ్మె నోటీసు అందజేశారు. ఎపి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ కూడా ఈ నెల 20న సమ్మెలో పాల్గొంటున్నట్లు పిఆర్‌అండ్‌ఆర్‌డి కార్యాలయ అధికారులకు సమ్మె నోటీసులిచ్చింది.

విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పలు విద్యుత్ సంస్థల్లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెలక్షన్ కమిటీ సూచనల ఆధారంగా డైరెక్టర్లను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎపి ఇపిడిసిఎల్‌లో ఆపరేషన్ డైరెక్టర్‌గా టి వెంకట సూర్యప్రకాష్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా టి వనజ, ఎపి ఎస్‌పిడిసిఎల్‌లో టెక్నికల్ డైరెక్టర్‌గా కాకర్ల గురవయ్య, ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా పి అయుబ్ ఖాన్, ఎపి జెన్‌కోలో ఫైనాన్స్ అండ్ కమర్షియల్ డైరెక్టర్‌గా కె సీతారామరాజు, హెచ్‌ఆర్, ఐఆర్ డైరెక్టర్‌గా వేములపాటి ఉష, హైడల్ డైరెక్టర్‌గా ఎం సుజయకుమార్, కోల్, లాజిస్టిక్స్ డైరెక్టర్‌గా బి నాగ్య, థర్మల్ డైరెక్టర్‌గా పి అశోక్ కుమార్ రెడ్డి, ఎపిసిపిడిఎల్ టెక్నికల్ డైరెక్టర్‌గా ఎ మురళీకృష్ణ, ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా టివిఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఎస్ వెంకటేశ్వర్లు, ఎపి ట్రాన్స్‌కో టెక్నికల్ డైరెక్టర్‌గా జె వెంకటేశ్వరరావు, ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఎన్ వెంకటరమణ మూర్తిని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరంతా రెండేళ్లపాటు డైరెక్టర్ పదవుల్లో కొనసాగనున్నారు.

తాడిపత్రికి వెళ్లనివ్వండి

- పోలీసు అధికారులను కోరిన పెద్దారెడ్డి, అనంత
- సిఎం పర్యటన తర్వాత పంపుతామన్న ఎస్‌పి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే అంశం జిల్లా పోలీసు అధికారుల దృష్టికి వెళ్లింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం శాంతిభద్రతల నేపథ్యంలో పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతించలేదు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించి తాడిపత్రికి వెళ్లేలా అనుమతులు తెచ్చుకున్నారు. కోర్టు తీర్పు పత్రాలను తీసుకుని మంగళవారం నాడు వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డితో కలిసి ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పోలీసు ఉన్నతాధికారులకు హైకోర్టు తీర్పు పత్రాలను అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీన అనంతపురం జిల్లా పర్యటన ముగిసిన తర్వాత పెద్దారెడ్డిని తాడిపత్రికి అనుమతిస్తామని ఎస్పీ వైసిపి నాయకులకు తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కలిసిన అనంతరం అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిలు విలేకరులతో మాట్లాడారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే అంశంపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడామన్నారు. కోర్టు ఉత్తర్వులను అనుసరించి సెక్యూరిటీ ఇచ్చి పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపాల్సిన బాధ్యత ఎస్పీపై ఉందని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత తెలిపారు. కాగా ఈ నెల 8వ తేదీన తాను తాడిపత్రికి వెళ్లనున్నట్లు కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసులకు వినతి ద్వారా తెలియజేశారు.

పోలవరం ప్రాజెక్టుపైనే రాష్ట్రాభివృద్ధి

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోలవరం



పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంపైనే రాష్ట్రాభివృద్ధి ఆధారపడి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జాతీయస్థాయిలో నదుల అనుసంధానానికి పోలవరం ప్రాజెక్టు కీలకమవుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తికి సాంకేతిక సలహాలు ఇచ్చేందుకు వచ్చిన విదేశీ నిపుణుల బృందాన్ని ఆయన ప్రాజెక్టు వద్ద మంగళవారం కలిశారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను, అవసరాన్ని నిపుణుల బృందానికి వివరించారు. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 2027 నాటికి పూర్తయ్యేటట్లు చూడాలని కోరారు. ఎగువ కాపర్ డ్యామ్ బలోపేతం చేసేలా నిర్మిస్తున్న బట్రస్ డ్యామ్, గ్యాప్-2డి వాల్ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. ప్యానల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్ టీమ్‌తో మాట్లాడి సాంకేతిక వివరాలు తెలుసుకున్నారు. గ్యాప్-1, గ్యాప్-2తోపాటు మిగిలిన పనులకు సంబంధించిన డిజైన్లకు త్వరితగతిన అనుమతులిస్తే, అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయగలుగుతామని నిపుణులతో అన్నారు. ప్రాజెక్టును పరిశీలించిన వారిలో విదేశీ నిపుణులు రిచర్డ్ డొనెల్లీ, సీన్ హించ్ బెర్గర్, జియాన్ ఫ్రాన్స్‌కో డి సిక్కో, డేవిడ్ బి పాల్, ప్రాజెక్టు సిఇ కె.నరసింహమూర్తి, ఇంజనీరింగ్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, పిపిఎ కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జలసంఘం అధికారులు సరబ్జెత్ సింగ్ భక్షి, రాకేష్ తేజ, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సిఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, లలిత్ కుమార్, తదితరులు ఉన్నారు.

ప్రకాశం జిల్లాలో భూ ప్రకంపనలు

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లాలో మంగళవారం ఉదయం 9.45 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించింది. పొదిలి, కురిచేడు మండలంలోని బోధనంపాడు, కురిచేడు పంచాయతీలోని కాటంవారిపల్లెలో సుమారు 5 సెకండ్లపాటు స్వల్ప ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇటీవల కాలంలో పొదిలిలో మూడుసార్లు భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. చీమకుర్తి గ్రానైట్ క్వారీలకు సమీపంలో ఉండడంతో భవిష్యత్తులో ఎప్పుడైనా భారీ భూకంపం వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి 13 జిల్లాల్లో కలాం విగ్రహాలు

- ఆకృతులను ఆవిష్కరించిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి 13 జిల్లాల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాల ఆకృతులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఆవిష్కరించారు. వైబ్రంట్స్ ఆఫ్ కలాం అనే సంస్థ రాష్ట్రంలో 13 జిల్లాల్లో అబ్దుల్ కలాం విగ్రహాలు ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంకు చెందిన విజయకలాం నేతృత్వంలో విగ్రహాలు తయారవుతున్నాయి. వాటిని ముఖ్యమంత్రికి చూపించేందుకు వెలగపూడి సచివాలయానికి తీసుకొచ్చారు. దీనిపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కలాం భారతదేశ క్షిపణి పితామహుడని పేర్కొన్నారు. రాష్ట్రపతిగానూ దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న విజయ్‌కలాంను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ప్రభుత్వ వైద్యులపై చర్యలు

- మంత్రి సత్యకుమార్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన సమయంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సర్జరీ చేసి రోగి మృతికి కారణమైన ఇద్దరు ప్రభుత్వ వైద్యులపై సమగ్ర విచారణ చేపట్టాలని వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022లో జరిగిన ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన మంత్రి ఇద్దరు డాక్టర్లపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం చక్రధర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎస్ రాకేష్ ప్రభుత్వాస్పత్రిలో పనిచేయాల్సిన సమయంలో ప్రైవేటు ఆస్పత్రిలో ఒక రోగికి శస్త్రచికిత్స చేశారు. కొన్ని రోజుల తరువాత ఆ రోగి మరణించాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రోగి మరణించాడని అతని బంధువులు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణకు సంబంధించి లిఖితపూర్వక వివరణ అందజేసిన వైద్యులు, తాము మానవతా దృక్పథంతోనే ఒక ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశామని, ఇందులో తమ వైపు నుంచి ఎటువంటి తప్పు లేదని వివరణ ఇచ్చారు. అంతేకాక ఈ చర్యకు క్షమాపణ కొరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైద్యుల వివరణను తిరస్కరించిన మంత్రి కఠిన చర్యలకు ఆదేశించారు.

మ్యాన్ పవర్ ఏజెన్సీల అవకతవకలను ఉపేక్షించం

- మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మ్యాన్ పవర్ ఏజెన్సీల అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సచివాలయంలో కార్మిక, పరిశ్రమలశాఖల అధికారులతో మంగళవారం సమావేశమైన మంత్రి ఏజెన్సీల ఆధ్వర్యాన పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదన్నారు. కొంతమంది కాంట్రాక్టర్లు పిఎఫ్ కూడా చెల్లించడం లేదన్నారు. ఇటువంటి ఏజెన్సీలపై చర్యలు తప్పవన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పరిశ్రమలశాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తొలుత కార్మికశాఖ వెబ్‌సైట్‌తో పాటు, పరిశ్రమలశాఖ వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 86 లక్షల మంది కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చర్యల కారణంగా కార్మికుల జీవన స్థితిగతులు మెరుగుపడుతున్నాయని చెప్పారు. ఇక అధికారులు ప్రభుత్వం కార్మికుల కోసం అందజేస్తున్న పథకాలపై అవగాహన పెంచాలన్నారు. చంద్రన్న బీమా పథకంలో ప్రతి కార్మికుడు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికశాఖ ఆధ్వర్యాన ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక ఆధునిక విధానాలపై కార్మికులకు పూర్తి స్థాయిలో అధికారులు అవగాహన కల్పించాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఇఎస్ఐ డిస్పెన్సరీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొబైల్ యాప్‌తో కార్మికులు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా పొందే అవకాశం ఉందన్నారు. ఈ యాప్‌పై కార్మికులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లక్ష్యంతో వాట్సాప్ గవర్నెన్స్, ఎఐ టూల్స్, గ్రీవెన్స్ మేనేజ్మెంట్ వంటి ఫీచర్లు ఈ యాప్‌లో అనుసంధానం చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి శేషగిరిబాబు, అదనపు ముఖ్యకార్యదర్శి గంధం చంద్రుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

నేతన్నకు 365 రోజులు పని కల్పిస్తాం

- చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత
- ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్‌పార్కుకు భూమిపూజ

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

రాష్ట్రంలో చేనేతలకు స్వర్ణయుగం వచ్చిందని, నేతన్నకు 365 రోజులు పని కల్పిస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత అండ్ జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసిలో మంగళవారం ఎంఎస్ఎంఇ కింద మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి మంత్రులు ఎన్ఎండి ఫరూక్, టీజీ భరత్, ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, అధికారులతో కలిసి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ చేనేతలకు రూ. 348 కోట్ల విలువైన క్లస్టర్లు మంజూరు చేశామని, లేటెస్ట్ డిజైన్లపై శిక్షణ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, అర్హులైన వారికి 90 శాతం సబ్సిడీతో ఫ్రేమ్ లూమ్స్ ఇస్తామని, త్వరలో రూ. ఐదు కోట్ల థ్రిఫ్ట్ ఫండ్ అందిస్తామని హామీ ఇచ్చారు. విశాఖలో రూ. 172 కోట్లతో నిర్మించిన యూనిటీ మాల్‌లో చేనేత ఉత్పత్తులను నిరంతరం ప్రదర్శించుకోవచ్చని అన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని, 25 ఎకరాల్లో హ్యాండ్‌లూమ్ పార్క్, మిగిలిన భూమిలో ఇండస్ట్రియల్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు బ్రాండ్ వస్త్రాలకు సహకారం అందిస్తామని, రిలయన్స్ కంపెనీ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చేనేతలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. చేనేత అండ్ జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్ మొదటి దశ అభివృద్ధికి ఎపిఐఐసి నుంచి రూ. 6.9 కోట్లు కేటాయించామని, 77 ఎకరాల పార్క్‌లో 22 ఎకరాలు చిన్న ప్లాట్లుగా మగ్గాలు పెట్టుకోవడానికి, మిగిలిన భూమి వస్త్ర పరిశ్రమల కోసం కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాష, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, కొడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి , టిడిపి ఆలూరు ఇంచార్జ్ వీర బద్రగౌడ్ , డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టుకు బిఎస్‌సి వారికి అవకాశం కల్పించాలి : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిఎస్‌సి చదివిన వారికి డిఎస్‌సిలో ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టుకు అర్హత కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం లేఖ రాశారు. ఆరేళ్ల తరువాత డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలైనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపుపై ప్రభుత్వం పునరాలోచన చేసి 47 ఏళ్లకు పెంచాలని లేఖలో కోరారు. డిఎస్‌సిలో ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టుకు అర్హత విషయంలో పాఠశాల విద్యాశాఖ ద్వంద్వ విధానం అవలంభించడం శోచనీయమని పేర్కొన్నారు. ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఇంటర్‌లో ఎంపిసి చదివి, బిఇడిలో మెథడాలజీ చదివి ఉండాలనేది అర్హతగా నిర్ణయించి, బిఎస్‌సి కంప్యూటర్స్ చదివిన వారికి అర్హత కల్పించలేదన్నారు. డిఎస్‌సి అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 50 శాతం పాస్ పర్సంటేజ్ ఉండాలనే నిబంధన కారణంగా వేలాది మంది అభ్యర్థులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ నిబంధనలను సడలించాలని లేఖలో పేర్కొన్నారు.

అప్పుల బాధతో అరటి రైతు ఆత్మహత్య



ప్రజాశక్తి-యల్లనూరు (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతో అరటి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా యల్లనూరు మండల పరిధిలోని నీర్జాం పల్లి కొట్టాల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... ఆర్ కృష్ణయ్య (51)కు నాలుగు ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. అందులో అరటి పంట సాగు చేస్తున్నారు. సాగు నిమిత్తం గత కొనేళ్లుగా దాదాపు రూ.పది లక్షలు అప్పులు చేశారు. ఈ పంట చేతికొచ్చే సమయంలో గత నెలలో వీచిన ఈదురుగాలులకు అరటి చెట్లన్నీ నేలకూలాయి. పంట మొత్తం చేతికందకుండా పోవడంతో అప్పులు తీర్చే మార్గం కన్పించక మనస్తాపానికి గురయ్యారు. సోమవారం అర్ధరాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రపోయాక ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య భవాని, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గ్రంథాలయ భవనం ప్రయివేటుకా?

- ప్రభుత్వ ప్రయత్నాలపై ఆగ్రహం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- కేంద్ర గ్రంథాలయ పరిరక్షణకు ఐక్య ఉద్యమం



మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన సముదాయాన్ని అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలు మానుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ పరిరక్షణపై శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులు గొంటి గిరిధర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ఉన్న భవనాలను పడగొట్టి కొత్తగా నాలుగు ఫ్లోర్‌లు నిర్మిస్తామని, అందులో ఒక ఫ్లోర్ గ్రంథాలయానికి కేటాయించి మిగిలిన వాటిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగిస్తామన్న ప్రతిపాదనలను ఖండించారు. ఈ ప్రతిపాదన అభివృద్ధి నిరోధకమని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే గ్రంథాలయ ఉద్యమం మొదలైందని, నాటి నుంచి గ్రంథాలయాల అభివృద్ధికి అనేక మంది కృషి చేశారని అన్నారు. అటువంటి గ్రంథాలయాల ఆస్తులను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలు గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తికే విఘాతం కలిగిస్తున్నాయన్నారు. గ్రంథాలయానికి వందలాది మంది పాఠకులు నిత్యం వస్తుంటారని, మేధో సంపత్తికి నిలయాలుగా ఉన్న గ్రంథాలయాలపై ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. ప్రస్తుత పరిణామాలు విజ్ఞాన సముపార్జన ప్రక్రియకు తీవ్ర ఆటంకమని తెలిపారు. గ్రంథాలయాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, భవిష్యత్ ఉద్యమానికి అన్ని వర్గాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

రిటైర్డ్ లైబ్రేరియన్ కెబి సుబ్రమణ్యం కన్వీనర్‌గా జిల్లా కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కమిటీని 18 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. సమావేశంలో శ్రీకాకుళ సాహితీ సభ్యులు అట్టాడ అప్పలనాయుడు, సాహితీ స్రవంతి అధ్యక్షులు కె శ్రీనివాసు, బిఎల్ నారాయణ, విశాఖ జిల్లా పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె త్రిమూర్తులురెడ్డి, పి మల్లేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి తేజేశ్వరరావు, విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం నాయకులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్వార్ట్‌జైట్ మైనింగ్ లీజు రద్దు చేయాలి

- రాష్ట్ర మైనింగ్ సెక్రటరీకి మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలోని ఇచ్ఛాపురం దెయ్యాల మెట్ట కొండపై క్వార్ట్‌జైట్ మైనింగ్ లీజును ప్రభుత్వం రద్దు చేయాలని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌కు లేఖ రాశారు. 'ప్రజాశక్తి' మెయిన్ పేజీలో ఈ నెల 4న 'మరో కొండకు టెండర్' అన్న శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనాన్ని శర్మ తన లేఖకు జతచేసి ప్రభుత్వానికి పంపారు. కుసులవాడ ప్రాంతంలో మైనింగ్ లీజులపై గతంలో తాను లేఖ రాశానని గుర్తు చేశారు. కొండలపై సహజ సిద్ధమైన ప్రకృతి సంపదలకు విఘాతం కలిగిస్తే పర్యావరణానికి ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కొండల వద్ద గిరిజనులు జీవిస్తున్నారని తెలిపారు. స్థానికులకు, ముఖ్యంగా గిరిజనులకు ఉపాధి దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు.

విశాఖ కలెక్టర్‌కు సిపిఎం లేఖ

దెయ్యాలమెట్ట కొండపై తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు సోమవారం లేఖ రాశారు. ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు. గనుల వెలికితీత పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని తెలిపారు. ఇప్పటికే వాతావరణంలో ప్రతికూల మార్పులు సంభవించి ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే మండలంలోని చిన్నయ్యపాలెం సర్వే నెంబరు 104లో క్వార్ట్‌జైట్, రఫ్ స్టోన్, గ్రావెల్ తవ్వకాల కోసం ప్రభుత్వం అనుమతులిచ్చేందుకు ప్రయత్నిస్తే ప్రజాభిప్రాయ సేకరణలో పరిసర గ్రామాల ప్రజలు ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు.

సిపిఎం నాయకులపై అక్రమ కేసులు కొట్టివేత

ప్రజాశక్తి - కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల హక్కుల కోసం పోరాటంలో సిపిఎం నాయకులపై నమోదైన కేసులను కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి మంగళవారం కొట్టివేశారు. 2016లో నాటి టిడిపి ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదిపై మూడు రిజర్వాయర్ల నిర్మాణం తలపెట్టారు. ఇందులో భాగంగా మూడు మండలాలు, 21 గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం, పునరావాసం, పున:నిర్మాణం కల్పించాలని 110 రోజులపాటు పోరాటం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జి.సింహాచలం, మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, డిఎస్‌పిని కొట్టారని తదితర తప్పుడు అభియోగాలు మోపారు. తొమ్మిదేళ్ల పాటు సాగిన విచారణలో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. సిపిఎం నాయకుల తరపున న్యాయవాది ఎం.అప్పారావు వాదనలు వినిపించారు.

సార్వత్రిక సమ్మెకు ఐద్వా మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళల హక్కుల రక్షణ, గుర్తింపు కోసం మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో మహిళలు పాల్గొనాలని ఐద్వా రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కోట్లాది మంది మహిళలను కార్మికులుగా గుర్తించాలని, వారికి పని భద్రత, కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను నిలబెట్టుకుంటేనే మహిళా శ్రామికులు తమ హక్కులను సాధించుకోగలుగుతారని తెలిపారు. కార్పొరేట్ లాభాలను రక్షించేందుకు పాలకవర్గాలు మహిళల పనిని పనిగానే గుర్తించరన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తెవాలని ప్రయత్నిస్తోందని, ఇందుకు వ్యతిరేకంగా మే 20న దేశ వ్యాప్త సమ్మెకు యావత్ కార్మికవర్గం పిలుపునిచ్చిందన్నారు. కార్మిక సంఘాలు ఈ సమ్మెకు నేతృత్వం వహిస్తున్నాయని, రైతు, రైతు కూలీ, కౌలు రైతు సంఘాలు మద్దతుగా నిలిచాయని తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్క్

కృష్ణాపురం శంకుస్థాపనలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఎంఎస్ఎంఇ పార్క్ శంకుస్థాపన శిలాఫలకం వద్ద మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి - పద్మనాభం (విశాఖపట్నం)

అభివృద్ధి వికేంద్రీకరణ ప్రభుత్వ విధానమని, రాబోయే రెండేళ్లలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం కృష్ణాపురంలో ఎంఎస్ఎంఇ పార్క్‌కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్‌తో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో శంకుస్థాపన చేస్తున్న ఈ ఎంఎస్ఎంఇ పార్క్ భవిష్యత్తులో రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యావంతులైన గ్రామీణ యువత ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సిఎం చంద్రబాబు నాయుడు ఎంఎస్ఎంఇ పార్క్‌ల ఆలోచన చేశారని తెలిపారు. కృష్ణాపురం ఎంఎస్ఎంఇ పార్క్‌లో రూ.100 కోట్ల విలువైన పరిశ్రమలు ఏర్పాటవుతాయని, రూ.12.40 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. మొదటి దశలో 22 ఎకరాల్లో 163 ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ పార్క్‌ల వల్ల ఉత్తరాంధ్రలో ఉపాధి వలసలు తగ్గుతాయన్నారు. భీమిలి నియోజకవర్గంలో అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని, తర్లువాడలో గూగుల్ కంపెనీ కోసం 200 ఎకరాలు సేకరిస్తున్నామని వెల్లడించారు.

కూలిన స్టేజ్

కార్యక్రమం చివర్లో ఎక్కువ మంది ఎక్కడంతో స్టేజ్ కూలిపోయింది. అయితే ముందుగానే అప్రమత్తమైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుల వ్యక్తిగత భద్రతా సిబ్బంది వారిని సురక్షితంగా స్టేజ్ నుంచి కిందకు తీసుకువెళ్లడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



పొగాకు రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

నల్లబర్లీ పొగాకు రైతులకు అండగా ఉంటాం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)

నల్లబర్లీ పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. రాజశేఖర్‌తో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం నాడు ప్రకాశం జిల్లా పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి ఆయన మంగళవారం పర్యటించారు. పొగాకు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ.. పొగాకు రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పొగాకు రైతులెవ్వరూ ఎలాంటి అపోహలకు పాల్పడవద్దని కోరారు. రెండు రోజుల్లో పొగాకు కంపెనీలతో తిరిగి భేటీ అవుతామని, పొగాకు కొనుగోలుకు ఒప్పిస్తానని హామీ ఇచ్చారు. ఒకవేళ కంపెనీలు ముందుకు రాకపోతే మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుండి పొగాకును కొనుగోలు చేస్తామని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీస్తోన్న కేంద్రం

- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే 21 నుంచి నిరవధిక నిరహార దీక్ష
- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల




ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అన్ని విధాలా దెబ్బతీస్తోందని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1545వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని ఆమె సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కాకుండా ప్రయివేటీకరణ దిశగా వెళ్లేందుకు కేంద్రం రూ.11 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిందన్నారు. ఒక చేత్తో నిధులిచ్చి మరో చేత్తో దోచుకుంటోందని విమర్శించారు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్టీల్‌ప్లాంట్ సంపూర్ణ లాభాల బాటలో నడిచిందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కర్మాగారానికి కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. ప్లాంట్ నష్టాల దిశగా వెళ్లడానికి కారణమేంటని ప్రశ్నించారు. మోడీ గడిచిన పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. టిడిపి కూటమి ప్రజాప్రతినిధులు మాత్రం ఆయనను భుజాలపై మోస్తున్నారని విమర్శించారు. ప్లాంట్‌కు సమీపంలోని గంగవరం పోర్టులో ఉన్న సుమారు రూ.9500 కోట్ల విలువైన ప్రభుత్వానికి చెందిన 10 శాతం వాటాలను కేవలం రూ.650 కోట్లకు అదానీకి గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమ్మేశారన్నారు. అదానీ అంటేనే బిజెపి అని తెలిపారు. ఉక్కు కార్మికుల పక్షాల కాంగ్రెస్ నిలబడుతోందన్నారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పాటైన ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటీకరించేందుకు పూనుకోవడం దారుణమన్నారు. వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం.. నిర్వాసితుల హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ ప్లాంట్ నుంచి తొలగించిన కార్మికులకు ఈ నెల 20వ తేదీలోపు విధుల్లోకి తీసుకోకపోతే 21 నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. దీక్షా శిబిరంలో కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

బిఒబికి రూ.5,048 కోట్ల లాభాలు

ప్రతి షేర్‌పై రూ.8.35 డివిడెండ్‌కు ఆమోదం



హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) నికర లాభాలు 3 శాతం వృద్ధితో రూ.5,048 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.4,886 కోట్ల లాభాలు నమోదు చేసింది. ప్రభుత్వ రంగంలోని బిఒబి 2024-25కు గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.8.35 డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు రికార్డ్ తేదిని 2025 జూన్ 6గా తీసుకుంది.

గడిచిన క్యూ4లో బ్యాంక్ వడ్డీ ఆదాయం 3.6 శాతం పెరిగి రూ.29,583.40 కోట్లుగా చోటు చేసుకుంది.

మార్కెట్ కాపిటలైజేషన్ ప్రకారం.. రెండో అతిపెద్ద పిఎస్‌యు బ్యాంక్ అయినా బిఒబి క్రితం మార్చి త్రైమాసికంలో వడ్డీ వ్యయం 10 శాతం పెరిగి రూ.19,622.39 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.26 శాతానికి దిగివచ్చాయి. గతేడాది ఇదే త్రైమాసికం నాటికి 2.92 శాతం జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. ఇదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 0.68 శాతంగా ఉండగా.. గడిచిన మార్చి ముగింపు నాటికి 10 బేసిస్ పాయింట్లు తగ్గి 0.58 శాతంగా నమోదయ్యింది. మొత్తం డిపాజిట్లు 10.3 శాతం పెరిగి రూ.14,72,035 కోట్లకు చేరాయి. గృహ రుణాలు 17.3 శాతం పెరిగి రూ.1,31,123 కోట్లకు చేరగా.. వాహన రుణాలు 20.3 శాతం పెరిగి రూ.46,549 కోట్లుగా నమోదయ్యాయి.

సెన్సెక్స్ 156 పాయింట్ల పతనం

ముంబయి : పాక్‌తో ఉద్రిక్తతల వేళ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 156 పాయింట్లు లేదా 0.19 శాతం పతనమై 80,641కు పరిమితమయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 82 పాయింట్లు లేదా 0.33 శాతం నష్టంతో 24,379.60 వద్ద ముగిసింది.

మాక్‌డ్రిల్స్ నిర్వహించాలంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఉద్రిక్తతలు తలెత్తొచ్చన్న అంచనాలతో మదుపర్లు అమ్మకాలకు దిగారు. దీనికి తోడు తమ దేశంలో ఔషధాల ఉత్పత్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఫార్మా కంపెనీల షేర్లు ఒత్తిడికి గురైయ్యాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, టాటా మోటార్స్, ఎస్‌బిఐ, అదానీ పోర్ట్స్, ఎన్‌టిపిసి షేర్లు అధికంగా నష్టపోగా.. భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా షేర్లు లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.



మళ్లీ లక్ష చేరువలో బంగారం

న్యూఢిల్లీ: ఇటీవల కాస్త తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు తిరిగి మళ్లీ ఎగిసిపడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ టారిఫ్‌లపై దృష్టి పెడుతున్నారనే సంకేతాలకు తోడు యుఎస్ ఫెడ్ రిజర్వు మీటింగ్ నేపథ్యంలో మంగళవారం పసిడి ధర వరుసగా మూడో రోజూ పెరిగింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడిపై రూ.2400 పెరిగి రూ.99,750గా పలికిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారంపై రూ.2400 పెరిగి రూ.99,300గా నమోదయ్యింది. కిలో వెండి రూ.1800 ప్రియమై రూ.98,500గా నమోదయ్యింది. అంతర్జాతీయంగా ఒక్క ఔన్స్ పసిడి 1.37 శాతం లేదా 45.65 డాలర్లు పెరిగి 3,379.77 డాలర్లుగా పలికింది.

పేటియంకు రూ.540 కోట్ల నికర నష్టాలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ వేదిక పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ 2024-25 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.539.8 కోట్ల నష్టాలను చవి చూసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.549.6 కోట్ల నష్టాల పాలయ్యింది. డిసెంబర్ త్రైమాసికంలో రూ.208 కోట్ల నష్టాలు ప్రకటించింది. గడిచిన క్యూ4లో ఆ సంస్థ రెవెన్యూ 15.69 శాతం పతనమై రూ.1,911.5 కోట్లుగా చోటు చేసుకుంది. 2023-24 ఇదే క్యూ4లో ఏకంగా రూ.2,267.1 కోట్ల రెవెన్యూ సాధించింది. మంగళవారం మార్కెట్లు ముగిసిన తర్వాత పేటియం ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. బిఎస్ఇలో 5.72 శాతం పతనమై రూ.816.50 వద్ద ముగిసింది.

సింగిల్ ఛార్జ్‌తో 449 కిలోమీటర్లు

- ఎంజి విండ్‌సోర్ ఇవి ప్రో ఆవిష్కరణ

న్యూఢిల్లీ: జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ కొత్తగా విండ్‌సోర్ ఇవి ప్రో వర్షన్‌ను ఆవిష్కరించింది. మంగళవారం మార్కెట్లోకి విడుదల చేసిన ఈ కొత్త కారు ఒక్క సారి ఛార్జింగ్‌తో 449 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని ఆ సంస్థ తెలిపింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.17.49 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధర తొలి 8,000 మంది కస్టమర్లకు మాత్రమేనని ఎంజి మోటార్ తెలిపింది. ఇందుకోసం మే 8 నుంచి బుకింగ్స్ తెరుస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత విండ్‌సోర్ స్టాండర్డ్ మోడల్‌తో పోలిస్తే అదనంగా కొన్ని ఫీచర్లను జోడించినట్లు పేర్కొంది. ప్రో వేరియంట్‌లో 52.9కిలోవాట్ బ్యాటరీని అమర్చింది.

2032 నాటికి 12.3 కోట్ల విద్యుత్ వాహనాలు

- ఛార్జింగ్ స్టేషన్లకు భారీగా పెట్టుబడులు



న్యూఢిల్లీ : వచ్చే 2032 నాటికి భారత రోడ్లపై 12.3 కోట్ల విద్యుత్ వాహనాలు ఉండొచ్చని ఓ సంస్థ అంచనా వేసింది. ఇవి విప్లవానికి భారత్ సిద్ధమవుతోందని ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్, కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ సయుక్తంగా ఓ రిపోర్టులో తెలిపాయి. ఆ వివరాలు.. ఇప్పటికే ద్విచక్ర, త్రిచక్ర ఇవిల వినియోగం పెరుగుతోంది. ఈ రంగం మరింత విస్తరించడానికి చార్జింగ్ మౌలిక సదుపాయాల్లో భారీ పెట్టుబడులు అవసరమని తెలిపింది. 2070 నాటికి నికర సున్నా ఉద్గారాలను సాధించడానికి ఇవిలను స్వీకరించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ వాహన రంగం వృద్ధికి ఫేమ్-2 పథకం మద్దతునిస్తుంది. ఇది ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు డిమాండ్ ప్రోత్సాహకాలను అందిస్తుంది. అదే విధంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలకు మూలధన సబ్సిడీలకు మద్దతునిస్తుంది.

నేడు ఎపి ఐసెట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్ర వ్యాప్తంగా ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సంయుక్త ప్రవేశ పరీక్ష ఎపి ఐసెట్ - 2025 బుధవారం రెండు సెషన్‌లుగా జరగనుందని ఎపి ఐసెట్ చైర్మన్, ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ తెలిపారు. విశాఖలోని వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు, సెట్ కన్వీనర్ ఆచార్య ఎం.శశిలతో కలిసి పరీక్షా వివరాలను ఆయన మంగళవారం వెల్లడించారు. ఈ పరీక్షకు మన రాష్ట్రంతోపాటు హైదరా బాద్‌లో 94 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 37,572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికి బుధవారం ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుందన్నారు. ఉదయం సెషన్‌లో పరీక్ష రాసేవారికి ఉదయం 7:30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షలు రాసేవారికి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతిస్తారని వెల్లడించారు. కంప్యూటర్ ఆధారితంగా జరిగే ఈ పరీక్షకు అభ్యర్థులు తమ హాల్ టికెట్, ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలన్నారు. హాల్ టికెట్లను cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకొని నేరు గా పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. కన్వీనర్ ఆచార్య ఎం.శశి మాట్లాడుతూ పరీక్ష అనంతరం ప్రాథమిక కీని విడుదల చేసి, అనంతరం ఈ నెల 21న ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)

అప్పులబాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్ల జిల్లా పర్చూరు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరన్నపాలెం గ్రామానికి చెందిన ఉప్పుటూరి సాంబశివరావు (42) ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పొగాకు పంటను సాగు చేశారు. పెట్టుబడి కోసం అప్పులు చేశారు. పొగాకు పంట చేతికొచ్చాక ఎవరూ కొనలేదు. మొత్తం రూ.10 లక్షలకుపైనే అప్పు ఉంది. ప్రస్తుతం పొగాకుకి గిట్టుబాటు ధర లేకపోవడం, దీనికి తోడు ఆయన అనారోగ్యం క్షీణించడంతో ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు సాంబశివరావుకు భార్య యశోద, కూతురు, కుమారుడు ఉన్నారు.

మాజీ ఎంపి పాలకొండ్రాయుడు మృతి



ప్రజాశక్తి-రాయచోటి

టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సుగవాసి పాలకొండ్రాయుడు (78) మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో ఆయన ఇబ్బందిపడుతున్నారు. బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారులు సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్ బాబులు ప్రస్తుతం టిడిపిలో కొనసాగుతున్నారు. ఆయన దాదాపు మూడు దశాబ్దాల పాటు రాయచోటిలో కీలక నేతగా సేవలు అందించారు. 31 ఏళ్ల పాటు రాజకీయాల్లో ఉన్నారు. త చాలా కాలంగా ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని గౌతమ్ థియేటర్ వద్ద పాలకొండ్రాయుడి అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. రాయుడి భౌతికకాయాన్ని సందర్శించేందుకు టిడిపి కార్యాలయంలో ఉంచారు. నివాళులర్పించేందుకు టిడిపి తరపున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం రాయచోటికి రానున్నారు.

పలువురు నాయకుల నివాళి

రాయుడు భౌతికకాయాన్ని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాస్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, టిడిపి, బిజెపి నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.


సంపాదకీయం

మళ్లీ నిర్బంధం!

రైతన్నలు మరోసారి సమరశీలంగా ఉద్యమిస్తున్నారు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) గ్యారెంటీకి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ పంజాబ్ సరిహద్దుల్లోని శంభుకు మార్చ్ నిర్వహించేందుకు సిద్ధమైన రైతులను అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. కనీసం కదల్లేని స్థితిలో ఉన్న రైతు నేత జగ్జిత్‌సింగ్ దల్లేవాల్‌సహా అనేక మంది నేతలను హౌస్ అరెస్టు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఎంఎస్‌పిసహా రైతుల న్యాయమైన డిమాండ్లను అమలు చేసేందుకు నిరాకరించడం దారుణం. అనేక అంశాల్లో బిజెపిని తీవ్రంగా విమర్శించే ఆప్ కమలం పార్టీ బాటలోనే వ్యవహరించడం తగదు. గత మార్చిలో శంభు, ఖనౌరి ప్రాంతాల్లో జెసిబిలతో నేలమట్టం చేసిన పోలీసులు మళ్లీ అదే తరహాలో రైతులపై నిర్బంధాన్ని ప్రయోగించ పూనుకోవడం గర్హనీయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ వైఖరిని విడనాడి, రైతుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి.

ఏ దేశంలోనూ రైతులకు మద్దతు ధరలను ఇవ్వకూడదని, నగదు బదిలీ తదితర రూపాల్లో మద్దతును అందిస్తే తమకు అభ్యంతరం లేదన్నది ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) విధానం. నయా ఉదారవాద విధానాల అమలులో భాగంగా డబ్ల్యుటిఒ తీసుకొచ్చిన ఈ నిబంధన సంపన్న దేశాలకు అనుకూలంగానూ, మూడో ప్రపంచ దేశాల్లో వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే మహమ్మారిగానూ పరిణమిస్తోంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు అందించే సబ్సిడీ రైతులు పండించే పంట ధరలో దాదాపు సగం వరకూ ఉంటే... జపాన్ దాదాపు పంట ధరకు సమానంగా సబ్సిడీ ఇస్తోంది. వీటిని మాత్రం డబ్ల్యుటిఒ తప్పు పట్టదు. రైతులకు మద్దతు ధర ఇచ్చే మనదేశంతోసహా చాలా మూడో ప్రపంచదేశాలపై డబ్ల్యుటిఒ ఒత్తిడి చేస్తోంది. ఇప్పటికే వాణిజ్య పంటలకు మద్దతు ధరను మనదేశం నిలిపివేసింది. ఇప్పుడు ఆహార పంటల ధరలు దారుణంగా పడిపోకుండా అరకొరగానైనా మద్దతు ధరలు ప్రకటిస్తూ... ఆ ధరకు కొనుగోలు చేయాలని ఆదేశించడమో, తాను కొనుగోలు చేయడమో కేంద్రప్రభుత్వం చేస్తోంది. పంటలకు కనీస మద్దతు ధర అందించకపోవడం అంటే వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి రైతుల పొట్టకొట్టటం, అగ్రదేశాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా మన ఆహార భద్రతను పణంగా పెట్టడం. దేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ఇప్పటికే కొంత బలహీనపడింది. ఇటువంటి చర్యల మూలంగా ప్రజలకు నిత్యావసర సరుకులు లభించని పరిస్థితి ఏర్పడుతుంది. పేదలు మరింత దుర్భర స్థితిని ఎదుర్కోవాలి. నయా ఉదారవాద విధానాల అమలుతో ప్రారంభమైన రైతుల ఆత్మహత్యలు ఇప్పుడు సర్వసాధారణంగా మారిపోయాయి. కేంద్రం అమలులోకి తీసుకురావాలనుకున్న నల్ల చట్టాలు (మూడు వ్యవసాయ చట్టాలు) ఈ విధానాలను మరింత తీవ్రం చేయడమే.

దుర్భర దారిద్ర్యంలోకో, ఆత్మహత్యలకో పాల్పడక తప్పని జీవన్మరణ పరిస్థితుల్లోనే ఈ విధానాలపై ఢిల్లీలో గానీ, ప్రస్తుతం పంజాబ్‌లో గానీ అన్నదాతలు సమరం చేస్తున్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలను, ప్రపంచీకరణను సవాల్ చేసిన ఘనత ఢిల్లీలో చారిత్రాత్మక రైతు ఉద్యమానిదే! ఆ ఒత్తిడితో నల్లచట్టాలను ఉపసంహరించుకున్నా... దొడ్డిదోవన అమలు చేసే ఎత్తుగడలు కొనసాగుతూనే ఉన్నాయి. పంజాబ్‌లో దల్లేవాల్, ఇతర రైతు నేతల ఆరోగ్యం క్షీణించడం, దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం కావడంతో ఫిబ్రవరిలో చర్చలకు మోడీ సర్కారు అంగీకరించినా నేటికీ తాత్సారం, నిర్బంధం కొనసాగుతూనే ఉంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించడం, రైతుల ప్రాణాలను బలిగొన్న లఖింపూర్ ఖేరీ దోషులను శిక్షించడంసహా ప్రధాన డిమాండ్లపై దాటవేత, మభ్యపెట్టే ఎత్తుగడలు రైతు వ్యతిరేకతను ప్రస్ఫుటం చేసేవే. ఎంత నిర్బంధం ఎదురైనా, ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న పంజాబ్ రైతులకు సంఘీభావం తెలపడం అన్నదాతలనే కాదు భారతావనిని రక్షించుకోవడమే!



పరభాష ద్వారా బోధన ...
సోపానాలు లేని సౌధం లాంటిది.
- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

జననం : 7.5.1861
మరణం : 6.7.1941

పెహల్గాం బాధిత మహిళలపై ట్రోల్ దాడులు

విశ్లేషణ



కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడిలో భర్తను కోల్పోయిన హిమాన్షి, తండ్రిని కోల్పోయిన ఆరతి మీనన్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వ్యక్తిత్వ హననం జరుగుతున్నది. భర్త వినయ్ నర్వాల్ మృతదేహం ముందు కూర్చుని విలపిస్తున్న హిమాన్షి నర్వాల్ ఫోటో ప్రపంచమంతా వైరల్ అయ్యింది. ఆ ఫోటో ఒక్కటి చాలు! దేశమంతటా ఉగ్రవాద వ్యతిరేకత వెల్లువెత్తడానికి. తండ్రిని కోల్పోయిన కేరళకు చెందిన ఆరతి మీనన్ తన పిల్లలను కాపాడుకున్న తీరు మానవత్వం వున్న ప్రతి ఒక్కరిని కన్నీరు కార్చేలా చేసింది. మన రాష్ట్రానికి చెందిన చంద్రమౌళిని మోకాళ్ళపై కూర్చోబెట్టి భార్య, కూతురు ఎదురుగానే తలలోకి బుల్లెట్లు దించిన తీరును వారు చెబుతుంటే మన ఎదురుగానే జరిగినంత భీతి కలిగింది. ఈ తల్లులు ఇంత శోకంలో కూడా దేశ హితం కోసం ఏది చెప్పాలో, ఏది చెప్పకూడదో విచక్షణతో మాట్లాడారు. శాంతి కావాలి, ఉగ్రవాదాన్ని అంతం చేయండి, చంపిన వారు ముస్లింలే కానీ తిరిగి వెనక్కి రావడానికి సహాయపడిన వారు కూడా ముస్లింలే, కాల్చిన వారి మతాన్ని బట్టి వ్యవహరించకండి...అని గొప్పగా హితవు పలికారు. మన దేశ గౌరవాన్ని మరో మెట్టు ఎక్కించారు. ఇలాంటి మహోన్నతులపై ఉన్మాదం తలకెక్కిన ముష్కరులు సభ్య సమాజం సిగ్గుపడేలా, నాగరికతను సింధూ నదికి దూరంగా విసిరేసేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. వారు ఉగ్రవాద బాధితులన్న సానుభూతి, మహిళలన్న విజ్ఞత కోల్పోయి నీచాతినీచంగా ట్రోల్ చేస్తున్నారు. హిమాన్షిపై చేసిన ఒక క్రూరమైన పోస్టు "ఈ...నీ కూడా ...చంపితే అప్పుడు సపోర్టు చేసేది తురకలకి", "ఇదే తన భర్తను చంపడంలో సహాయం చేసింది". ఆరతి మీనన్‌పై కూడా ఇలాంటి ఘోరమైన పోస్టులు పెడుతున్నారు. సాయుధ ఉగ్రవాదులు వారి ఆత్మీయులను బలిగొంటే, ఈ సోషల్ మీడియా ఉగ్రవాదులు వారి వ్యక్తిత్వాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని, దేశం పట్ల వారి నిబద్ధతను బలి తీసుకుంటున్నారు. ఉన్మాదం తలకెక్కిన వారి చేతిలో వున్న ఆయుధాలే కాదు, సామాజిక మాధ్యమాలు కూడా మనల్ని బలి తీసుకుంటాయి. వాటి నుండి వచ్చిన తూటాలు శరీరాన్ని ఛిద్రం చేస్తే, వీటి నుండి వచ్చే పోస్టులు మనసును ధ్వంసం చేస్తాయి. వాడు మతాన్ని అడిగి మరీ కాల్చేస్తే, వీడు మానవత్వాన్ని మొలకెత్తకుండా కాల్చేయజూస్తున్నాడు. బయటకు వేర్వేరుగా కనిపించే ఈ ఉగ్రవాదులు నిజంగా వేరు కాదు. వారి లక్ష్యం మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, మత ఘర్షణలు పెట్టడం, ప్రజల ఐక్యతను చీల్చడం. ఏప్రిల్ 22న జమ్ము కాశ్మీర్ పెహల్గాం ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని దేశం యావత్తు నిరసించింది, బాధితులను తమ కుటుంబ సభ్యులుగా భావించి విలపించింది. మతాలకు, ప్రాంతాలకు అతీతంగా దేశమంతటా ఒకే కంఠంతో ఉగ్రవాద చర్యలను ఖండించింది. గతంలో ఎన్నడూ లేనంతగా కాశ్మీర్ ప్రజలు కూడా ఈ అమానుష కాండను తీవ్రంగా వ్యతిరేకించారు. అందరికంటే ముందుగా అక్కడ బంద్ పాటించారు. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలను అక్కున చేర్చుకున్నారు, మనో ధైర్యాన్ని ఇచ్చారు, తక్షణ సపర్యలు చేశారు. గాయపడిన వారిని కిలో మీటర్ల కొద్దీ మోసుకు వచ్చారు. చనిపోయినవారికి మార్చురీ వద్ద ఏర్పాట్లు చేసి శోక హృదయాలతో సాగనంపారు. బాధితులకు ఆశ్రయం ఇచ్చారు. కలిగిన దాంట్లోనే భోజనాలు పెట్టారు. ఉచితంగా ఆటో, ట్యాక్సీల్లో రైల్వేస్టేషన్, విమానాశ్రయాలకు చేర్చారు. ఇలాంటి కొన్ని సంఘటనలు సోషల్ మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలిశాయి. బయటకు రాని, రికార్డు కాని అనేక రూపాల్లో స్థానికులు మతం, కులం, ప్రాంతం బట్టి కాకుండా సాటి మనుషులుగా, తమ అతిథులుగా అనుకుని స్పందించారు. మానవత్వంతో, భారతీయులమనే భావనతో చేశారు. వారికి తెలుసు ఉగ్రవాదానికి భిన్నంగా ప్రవర్తించినా, విమర్శించినా జరిగే పరిణామాలు ఏమిటో వారికి అనుభవంలో చాలా తెలుసు, అయినా ఎందుకు స్పందించారు. మేము వారు వేరువేరు, మతం చాటున ఒకే తీరుగా చూడద్దొండి అంటూ పర్యాటకులను వేడుకున్నారు. మనమంతా భారతీయులం అని గొంతెత్తి చాటారు.

ఆయుధాలు కలిగిన ఉన్మాదులతో తలపడితే ఏం జరుగుతుందో తెలిసి కూడా సయ్యద్ ఆదిల్ షా ను ఆత్మార్పణకు సిద్ధపడేలా చేసింది...ఒకవైపు కాల్పులు జరుగుతుంటే గాయపడిన పిల్లవాడిని 11 కి.మీటర్లకు పైగా వీపున మోసుకుంటూ హుస్సేన్‌ను ఆ కొండల్లో నడిచేలా చేసింది... నిజమైన మానవత్వం, అదే నిజమైన భారతీయత. కళ్ళ ముందు తమ వారిని కోల్పోయి దుఃఖంలో వున్నవారికి ఈ దృశ్యాలు ఎక్కడో జీవితం పట్ల, దేశం పట్ల ప్రేమను, నమ్మకాన్ని నిలిపాయి. అందుకే ఇళ్ళకు తిరిగివచ్చిన బాధితుల్లో ఏ ఒక్కరూ కూడా స్థానిక ముస్లింలను ఒక్క మాట అనకపోగా వారిని అనేక విధాలుగా మెచ్చుకున్నారు.

ఇదే దేశంలోని సామాజిక మాధ్యమాల ముష్కరులకు కోపం తెప్పించింది. ఈ దాడులను ఆధారంగా చేసుకుని హిందూ, ముస్లిం మత ఘర్షణలు పెట్టాలనుకునే వారు విచక్షణ కోల్పోయేలా చేసింది. భర్తలను, తండ్రులను, అన్నలను కోల్పోయిన బాధితులంతా ఉగ్రవాదుల దుర్మార్గాలతో పాటు దేశీయ ముస్లింల మీద ఏదో రూపంలో విరుచుకుపడాలని భావించిన ఉన్మాదుల ఆగ్రహానికి కారణమైంది. హిమాన్షి ఏం మాట్లాడింది! "నా భర్త ఎక్కడున్నా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని...దేశం మొత్తం అతని కోసం ప్రార్థించాలని...నేను కోరుకుంటున్నాను. ముస్లింలు లేదా కాశ్మీరీలను ప్రజలు వ్యతిరేకించాలని మేం కోరుకోవడంలేదు. మాకు శాంతి కావాలి, శాంతి మాత్రమే కావాలి. అయితే మాకు న్యాయం కావాలి". ఈ వాఖ్యలు చేసిన ఆమెలో ఎంతటి స్థిరచిత్తం వుందో, ఎంతటి విజ్ఞత వుందో మెదడు వున్న ప్రతి ఒక్కరిని ఆలోచింపచేసింది. తమ ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్ళు బతకమని ఎన్ని హృదయాలు దీవించాయో! ఈ ఆణిముత్యాలు కొందరికి రుచించలేదు. ద్వేషంతో ఊగిపోయే కషాయ నెటిజన్లు ఆమెపై విరుచుకు పడ్డారు. హిమాన్షి జెఎన్‌యు లో చదివిందని, తన భర్త మరణాన్ని సామాజిక, రాజకీయ నిచ్చెన ఎక్కడానికి ఒక అవకాశంగా చేసుకొని ఇలాంటి శాంతి సందేశాలు ఇస్తుందని, కాశ్మీరు హనీమూన్ 'ఆమె ఏర్పాటు చేసిందని' ప్రభుత్వం ఇచ్చే పరిహారం, పెన్షన్ ఆమెకు ఇవ్వకూడదని, ఆమెకు ముస్లిం స్నేహితులు వున్నారని, 'ఆమె జాతి వ్యతిరేకి', 'వారి...సానుభూతిపరురాలు' అంటూ తమ చేతికి, నోటికి అడ్డూ అదుపు లేకుండా పోస్టులు పెడుతున్నారు. ఈ దుర్మార్గంపై జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ స్పందించారు. ఇలాంటి పోస్టులు వెంటనే ఆపండి, మహిళకు తన అభిప్రాయాలు, ఆలోచనలు చెప్పే హక్కును కాలరాస్తారా? అంటూ ప్రశ్నించారు. ఏదైనా అంగీకారం లేదా భిన్నాభిప్రాయాన్ని ఎల్లప్పుడూ మర్యాదగా, రాజ్యాంగ హద్దులకు లోబడి స్పందించాలని చెప్పారు. కేరళకు చెందిన ఆరతి మీనన్ తన పిల్లలను వెంటబెట్టుకుని తండ్రితో కలిసి కాశ్మీరుకు వెళ్లింది. తన తండ్రిని కాల్చవద్దని ఉగ్రవాదులను ఎంతగా వేడుకున్నా కనికరించకుండా అతి సమీపం నుండి ఆయనను కాల్చేశారు. తీవ్ర విషాదంలో కూరుకుపోయిన ఆరతి మీనన్‌కు ఇద్దరు స్థానిక యువకులు అండగా నిలిచి ఆమె పిల్లలను చేరదీసి, ఆమె తండ్రి శవానికి పరీక్షలు పూర్తి చేయించి, ప్రయాణ ఏర్పాట్లు చేసి పంపారు. కేరళకు తిరిగివచ్చిన ఆరతి స్పందిస్తూ "ఈ ప్రయాణం నాకు ప్రియమైన తండ్రిని దూరం చేసింది. కానీ ఇద్దరు సోదరులను ఇచ్చింది. ఒకరు డ్రైవర్ ముసాఫిర్, మరొకరు సమీర్. వారు ప్రతి విషయంలో నాకు తోడుగా నిలిచారు. తెల్లవారుజామున మూడు గంటల వరకు నా దగ్గరే వుండి నన్ను ఒక సోదరిగా చూసుకున్నారు" అని చెప్పింది. మతం-ఉగ్రవాదం-మానవత్వం వేర్వేరు అని తన అనుభవం నుండి చెప్పడాన్ని భారత్ మాతా కీ జై అనే వారు సహించలేకపోయారు. "ఆమె లాంటి పిల్లలు పుట్టడం కంటే లేకుండా వుండటమే మంచిది", "ఆమె మాటలు అసహ్యకరం" అంటూ అత్యంత నీచంగా దుర్భాషలాడుతూ పోస్టులు పెట్టారు.

> **సాయుధ ఉగ్రవాదులు వారి ఆత్మీయులను బలిగొంటే, ఈ సోషల్ మీడియా ఉగ్రవాదులు వారి వ్యక్తిత్వాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని, దేశం పట్ల వారి నిబద్ధతను బలి తీసుకుంటున్నారు. ఉన్మాదం తలకెక్కిన వారి చేతిలో వున్న ఆయుధాలే కాదు, సామాజిక మాధ్యమాలు కూడా మనల్ని బలి తీసుకుంటాయి. వాటి నుండి వచ్చిన తూటాలు శరీరాన్ని ఛిద్రం చేస్తే, వీటి నుండి వచ్చే పోస్టులు మనసును ధ్వంసం చేస్తాయి. వాడు మతాన్ని అడిగి కాల్చేస్తే, వీడు మానవత్వాన్ని మొలకెత్తకుండా కాల్చేయజూస్తున్నాడు. బయటకు వేర్వేరుగా కనిపించే ఈ ఉగ్రవాదులు నిజంగా వేరు కాదు. వారి లక్ష్యం మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, మత ఘర్షణలు పెట్టడం, ప్రజల ఐక్యతను చీల్చడం.**

ఇలాంటి పోస్టులు పెడుతున్నవారి ఫేస్‌బుక్ ప్రొఫైల్ ఫోటోల్లో శ్రీరాముడు, ఆంజనేయస్వామి బొమ్మలు, కాషాయ జెండా, అఖండ భారత ఫోటోలు వుంటున్నాయి. ఇంత నీచంగా ట్రోల్ చేసే ధైర్యం వీరికి అక్కడి నుండే అందుతుంది. శీలం, జ్ఞానం, గర్భ సాంస్కారం, హిందూ సంస్కృతి, 'నారీ శక్తి వందన్ చట్టం', బేటీ బచావో' అంటూ చెప్పే మాటలకు వీరి చేతలకు నకశిఖ పర్యంతమంత తేడా వుంది. కాశ్మీర్ దారుణంపై దేశమంతా ఉగ్రవాదం, దానికి ఆధారంగా వున్న పొరుగు దేశంపై ఆగ్రహావేశాలతో వుంటే, ఉగ్ర బాధితులనే బాధించగల వారిని మనుషులు అనగలమా? బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారి విడుదల ఉత్సవాలు, ఉత్తరప్రదేశ్ ఉన్నావోలో దళిత మహిళపై హత్యాచారానికి పాల్పడిన నేరగాళ్ళ ఊరేగింపు, కాశ్మీర్ కథువాలో ఎనిమిదేళ్ళ బాలికను గుడిలో అత్యాచారం చేసి చంపేసిన నిందితులు తల ఎత్తుకుని దేశ పాలకుల పక్కన నిలచిన ఫోటోలు, మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన వీడియోలు దేశమంతా ప్రచారం చేయగలిగే నీచ మనస్తత్వం ఎవరికి వుంటుంది? ఆధునిక సమాజంలో ఉన్నత చదువులు చదివి స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పడానికి ప్రయత్నిస్తున్న అనేక మంది మహిళలు తీవ్రమైన సామాజిక మాధ్యమాల హింసకు గురవుతున్నారు. ప్రముఖ సామాజికవేత్తలు స్వాతి చతుర్వేది, అరుంధతీ రాయ్, గుజరాత్ ఫైల్స్ రచయిత రాణా ఆయూబ్, తులసీ చందు...ఇలా ఒక్కరేమిటి అనేక మంది ఇలాంటి హింసను నిత్యం అనుభవిస్తున్నారు.

హత్యాచారాలకు, హత్యలకు పాల్పడే ఉన్మాదులను వ్యతిరేకించినంత మాత్రాన ఈ సమస్య తీరదు. ఇలాంటి వారిని ఎందుకు శిక్షించడం లేదని దేశ పాలకులను ప్రశ్నించాలి. ఇలాంటి వారి వెనుక వున్న మతోన్మాద సంస్థలను నిలదీయాలి. బాధితుల పక్షాన నిలవాలి.



వి. రాంభూపాల్

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

మిలిటరీ బడ్జెట్ పెంపు-పౌర సంక్షేమానికి కోత!

అంతర్జాతీయం

సామ్రాజ్యవాదుల యుద్ధోన్మాదం



డోనాల్డ్ ట్రంప్ పిచ్చి పనులతోనే కాదు, యుద్ధోన్మాదంతో కూడా రెచ్చిపోతున్నాడు. ఒకవైపు ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతానంటాడు, మరోవైపు గాజాలో మారణకాండకు మద్దతు, ఎమెన్‌పై ప్రత్యక్షంగా దాడులు జరిపిస్తాడు. ఇలాంటి దుర్మార్గాలకు మరింతగా పాల్పడేందుకు మిలిటరీ బడ్జెట్‌ను భారీగా పెంచేందుకు పూనుకున్నాడు. 2026 సంవత్సర బడ్జెట్‌లో మిలిటరీకి 13 శాతం పెంచి లక్ష కోట్ల డాలర్లకు చేర్చాలని, అందుకుగాను విద్య, వైద్యం, పర్యావరణం, ప్రజాసాయం, అదనపు పోషకాహార సాయ పథకం (మన ఉచిత బియ్యం వంటిది), బలహీన వర్గాల గృహ నిర్మాణం వంటి సంక్షేమ పథకాలకు కోత పెట్టాలని ప్రతిపాదించాడు. ఈ మేరకు అధ్యక్ష భవనం ఈనెల రెండవ తేదీన ఒక ముసాయిదా బడ్జెట్‌ను ఆవిష్కరించింది. ఈ కోతలు ఇంకా పెరగవచ్చు. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సామర్థ్య శాఖ (డోజె) ఇప్పటికే పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించి, ఉద్యోగాలకు కోత పెట్టి పొదుపు చర్యలంటూ అనేక సంస్థలకు నిధుల కోతకు పాల్పడింది. బడ్జెట్‌లో రెండు రకాలు ఉంటాయి. విధిగా కేటాయింపులు జరపాల్సినవి, విచక్షణతో అమలు జరపాల్సినవి. రెండో రకం పథకాల మొత్తం వచ్చే ఏడాది 1.7 లక్షల కోట్ల డాలర్లు ఉంటుందని, వర్తమాన బడ్జెట్‌తో పోలిస్తే 7.6 శాతం కోత ...ల్లని చెబుతున్నారు. ఇవి ప్రధానంగా సంక్షేమ పథకాలకు చెందినవే.

అమెరికా రాజ్యాంగం ప్రకారం బడ్జెట్ మీద అధికారం పార్లమెంటుదే, అయితే నిబంధనల మేరకు అధ్యక్ష భవనం తన వాంఛలను తెలియచేస్తూ పార్లమెంటుకు ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. అయితే వాటిని పార్లమెంటు ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు, సవరించవచ్చు. అవి అధ్యక్షుడికి నచ్చకపోతే 1974లో సవరించిన చట్ట ప్రకారం తనకున్న అధికారాల ద్వారా ఉత్తర్వులు జారీ చేసి అమలు చేయవచ్చు.

స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం 2024లో ప్రపంచ మిలిటరీ ఖర్చు 2.7 లక్షల కోట్ల డాలర్లని, దీనిలో మూడో వంతు అమెరికా ఖర్చు 997 బిలియన్ డాలర్లు అని పేర్కొన్నది. హిట్లర్ వారసురాలైన జర్మనీ అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే 28 శాతం పెంచి 88.5 బి.డాలర్లు, మరో యుద్ధోన్మాది జపాన్ 21 శాతం పెంచి 55.3 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. మిలిటరీ ఖర్చులో ఏడవ స్థానంలో ఉన్న జర్మనీ నాలుగుకు ఎగబాకింది. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యా 149 బి.డాలర్లు ఖర్చు చేస్తే ఎలాంటి దాడుల్లో ప్రత్యక్షంగా పాల్గొనని నాటో దేశాలు పది రెట్లు అదనంగా 1.5 లక్షల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టాయి. మొత్తం ఖర్చు 2015లో ఉన్న 1.67 లక్షల కోట్ల డాలర్లతో పోలిస్తే 2024లో 2.7 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. యుద్ధోన్మాదం లేదా మిలిటరీ ఖర్చు పెరుగుదల తీరు ముప్పును సూచిస్తున్నది. ఐరోపా మీద పెత్తనం చెలాయించాలని చూస్తున్న జర్మనీ యుద్ధ సన్నాహాలకు గాను అంటే మిలిటరీ అవసరాలకు సైతం ఉపయోగపడే విధంగా రోడ్లు, వంతెనలు, ఆసుపత్రుల వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు 1.13 లక్షల కోట్ల డాలర్లు ఖర్చు చేసేందుకు పూనుకుంది. ఇది మొదటి ప్రపంచ యుద్ధం తొలి ఏడాదిలో జర్మనీ చేసిన ఖర్చులో 8.6 శాతం కాగా రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు సంవత్సరం చేసిన ఖర్చుకు దగ్గరలో ఉందని పోలికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రయత్నాలన్నీ యుద్ధ పరిశ్రమలు ముఖ్యంగా అమెరికా సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు దోహదం చేస్తున్నాయి. సిప్రి అంచనా ప్రకారం 2023లో ఆయుధ తయారీలో అగ్రభాగాన ఉన్న 100 కంపెనీలు 632 బిలియన్ డాలర్ల మేర విక్రయించగా ఒక్క అమెరికా ఉత్పత్తిదారులకే 317 బిలియన్ డాలర్లు దక్కాయి.

అమెరికా తన ప్రయోజనాలకే ఎప్పుడూ పెద్ద పీట వేస్తుందని ఐరోపాకు తెలిసినప్పటికీ గతంలో తగిలిన ఎదురుదెబ్బల కారణంగా దానితో జూనియర్ భాగస్వామిగా కలసి ప్రయాణిస్తున్నది. స్వతంత్ర పాత్ర పోషించేందుకు ఐరోపా సమాఖ్య, ఉమ్మడి కరెన్సీని కూడా ఏర్పాటు చేసుకుంది. రెండూ దాగుడు మూతలాడుతున్నాయి. మొత్తం మీద చూసినపుడు మిత్ర వైరుధ్యాలు పెరుగుతున్నాయి తప్ప తగ్గటం లేదు. కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు తాము చేయలేని పనిని చైనా చేయటాన్ని గమనిస్తున్నాయి. అయితే దానితో చేతులు కలిపే అవకాశం లేదు గనుక దాన్ని చూపి అమెరికాతో బేరమాడుతున్నాయి.

'అమెరికాకే అగ్రస్థానం' పేరుతో డోనాల్డ్ ట్రంప్ ఎజెండాను ముందు పెట్టిన తరువాత కొన్ని సందర్భాలలో ప్రతిఘటిస్తామని చెప్పటం తాజా పన్నుల యుద్ధంలో చూశాం. ఈ విషయంలో ట్రంప్ వెనక్కు తగ్గినా అలాంటి కత్తి వేలాడుతూనే ఉంటుంది గనుక ఐరోపా తన రక్షణ తానే చూసుకొనేందుకు పూనుకోవటం ఖాయం. దాన్లో భాగమే జర్మనీ పెద్ద మొత్తంలో మిలిటరీ ఖర్చుకు పూనుకోవటం. ఇరవై ఏడు దేశాల ఐరోపా సమాఖ్య 800 బిలియన్ యూరోల మిలిటరీ ఖర్చు అదనంగా చేసేందుకు నిర్ణయించింది. ఐరోపా జనాభాలో 24 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నప్పటికీ ఈ ఖర్చు చేయటాన్ని గమనించాలి. ధనిక దేశాల్లోని కులీనులందరూ తమ లాభాలకు ముప్పు లేకుండా భారాలన్నింటినీ కార్మికవర్గం భరించే విధంగా విధానాలను రూపొందిస్తున్నారు. సామాజిక సంక్షేమ కోతలకు ఎలా పూనుకుంటారో ముందే చెప్పినట్లుగా దీనికి ఎదురయ్యే ప్రతిఘటనలను అణచివేసేందుకూ పూనుకుంటారు. ఉక్రెయిన్ విషయంలో అమెరికా, ఐరోపాల స్నేహ బండారం త్వరలోనే బయటపడుతుంది.

> **ట్రంప్ ఒకవైపు ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతానంటాడు. మరోవైపు గాజాలో మారణకాండకు మద్దతు, ఎమెన్‌పై ప్రత్యక్షంగా దాడులు జరిపిస్తాడు. ఇలాంటి దుర్మార్గాలకు మరింతగా పాల్పడేందుకు మిలిటరీ బడ్జెట్‌ను భారీగా పెంచేందుకు పూనుకున్నాడు. 2026 సంవత్సర బడ్జెట్‌లో మిలిటరీకి 13 శాతం పెంచి లక్ష కోట్ల డాలర్లకు చేర్చాలని, అందుకుగాను విద్య, వైద్యం, పర్యావరణం, ప్రజా సాయం, అదనపు పోషకాహార సాయ పథకం (మన ఉచిత బియ్యం వంటిది), బలహీన వర్గాల గృహ నిర్మాణం వంటి సంక్షేమ పథకాలకు కోత పెట్టాలని ప్రతిపాదించాడు. ఈ మేరకు అధ్యక్ష భవనం ఈనెల రెండవ తేదీన ఒక ముసాయిదా బడ్జెట్‌ను ఆవిష్కరించింది. ఈ కోతలు ఇంకా పెరగవచ్చు.**

చైనా మిలిటరీ బడ్జెట్ 258 బిలియన్ డాలర్లని వార్తలు వచ్చాయి. తైవాన్‌కు ఆయుధాలు విక్రయించటం, దక్షిణ చైనా సముద్రంలో అమెరికా రెచ్చగొట్టుడు చర్యల కారణంగా ఇటీవలి కాలంలో దాని బడ్జెట్ గణనీయంగా పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచంలో వంద ఆయుధాలు ఎగుమతి అవుతుంటే వాటిలో 42 అమెరికా, ఫ్రాన్సు, రష్యాల నుంచి పదకొండు చొప్పున, చైనా 5.8, జర్మనీ 5.6 ఎగుమతి చేస్తున్నాయి. ఇక దిగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న భారత్ 9.8, సౌదీ అరేబియా 8.4, కతార్ 7.6, ఉక్రెయిన్ 4.9, పాకిస్తాన్ 4.3, చైనా 2.9 చొప్పున దిగుమతి చేసుకుంటున్నాయి. సిప్రి సమాచారం ప్రకారం మొత్తం తొమ్మిది దేశాలలో 12,121 అణ్వాయుధాలు ఉన్నాయి. దేశాల వారీ మోహరించినవి లేదా సురక్షిత ప్రదేశాల్లో నిల్వ ఉంచినవిగానీ దేశాల వారీ ఇలా ఉన్నాయి. బ్రాకెట్లలోని అంకెలు మోహరించినవి. రష్యా 5,580 (1,710), అమెరికా 5,044 (1,770), చైనా 500 (24), ఫ్రాన్సు 290 (280), బ్రిటన్ 225 (120), భారత్ 172, పాకిస్తాన్ 170, ఇజ్రాయిల్ 90, ఉత్తర కొరియా 50 కలిగి ఉన్నాయి. మన దేశం దగ్గర అణ్వాయుధాలు ఉన్నా వాటిని ప్రయోగించే అవకాశం లేదు గనుక సాంప్రదాయ ఆయుధాలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవటంతో ఆయుధ ఎగుమతి దేశాలన్నీ ప్రధాని నరేంద్ర మోడీని విశ్వగురువు అంటూ ఆకాశానికి ఎత్తి ఆయుధ ఆర్డర్లు పొందుతున్నాయంటే అతిశయోక్తి కాదు!



ఎం. కోటేశ్వరరావు

జనవాక్యం

బాబాలు, మహిమలు ట్రాష్

స్వాములు, బాబాల వద్దకు వెళ్లే వారిలో సామాన్యులను మొదలుకొని రాజకీయ నాయకుల వరకు వుంటారు. వారికి భారీగా సమర్పించుకుంటారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చెవురు గ్రామం వద్ద వెలసిన దొంగ రామదూత దగ్గరకు చాలామంది రాజకీయ నాయకులు వచ్చారు. విచిత్రంగా వారిలో ఎక్కువమంది జైళ్లకు వెళ్లారు. 2011లో కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప, మంత్రి గాలి జనార్ధనరెడ్డి, బిజెపి జాతీయ అధ్యక్షుడు బంగారు లక్షణ్ చెవురు దొంగ స్వామి ఆశ్రమానికి వచ్చారు. అపుడే వీరు ముగ్గురికీ జైలు శిక్ష పడింది. బంగారు లక్ష్మణ్‌కు ఏదో కేసులో సుప్రీంకోర్టు సంవత్సరం శిక్ష వేసింది. చివరికి చనిపోయారు. యడియూరప్పకు ముఖ్యమంత్రి పదవి పోయింది. జైలుకి వెళ్ళాడు. గాలి రెడ్డి మూడేళ్లు బెయిల్ కూడా లేకుండా జైలులో గడిపాడు. అలాగే స్వరూపానంద చేత జగన్, కెసిఆర్‌లు యజ్ఞాలు చేయించారు. ఇద్దరూ ఓడిపోయారు. కనుక బాబాల వలన ప్రయోజనం ఏమీ ఉండదు. వారిని పోషించటం తప్ప ప్రజలకు ఉపయోగం ఉండదుగాక ఉండదు. నాయకుల అండ చూసుకొని వీరు ప్రభుత్వ భూముల ఆక్రమిస్తారు. ఎవరి దగ్గరా ఎలాంటి మహిమలూ వుండవన్న వాస్తవాన్ని గ్రహించాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

నిషేధిత జాబితాలో కొనసాగించడం సబబు కాదు

- ఎక్స్ సర్వీస్‌మెన్‌ల భూములపై హైకోర్టు



ప్రజాశక్తి-అమరావతి

ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ప్రభుత్వం ఇచ్చే అసైన్‌మెంట్ భూమిని సదరు ఎక్స్ సర్వీస్‌మెన్ క్రయ విక్రయాలు చేసేందుకు రూల్స్ అనుమతిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం ఆ భూమిని నిషేధిత భూముల జాబితా (22ఏ)లో కొనసాగించడం సబబు కాదని హైకోర్టు తీర్పు చెప్పింది. నిషేధిత భూముల జాబితా నుంచి తన భూమిని తొలగించాలన్న పిటిషనర్ అభ్యర్థనను తిరుపతి జిల్లా కలెక్టర్ తిరస్కరించడాన్ని ఆక్షేపించింది. కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేసింది. పిటిషనర్ భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తక్షణమే తొలగించాలంటూ జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ తీర్పు వెలువరించారు. ఎక్స్ సర్వీసెమెన్ కోటా కింద అసైన్మెంట్ కింద ఇచ్చిన భూమిని పదేళ్ల తర్వాత అమ్మేందుకు 1993లో జిఓ 1117 జారీ చేసిందని తెలిపారు. పిటిషనర్‌కు సంబంధించిన వ్యవహారంలో తహశీల్దార్ రిపోర్టు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సర్క్యులర్‌ను కలెక్టర్ పట్టించుకోలేదని తప్పుపట్టారు. దేశం కోసం సేవలు అందించిన మాజీ సైనికులకు పదేళ్ల తర్వాత భూమిని అమ్ముకునే హక్కు ఉందన్నారు.

తమ్మిశెట్టి బోదయ్య మద్రాసు రెజిమెంట్లో 15 ఏళ్లు పనిచేశారు. 1994లో అప్పటి నెల్లూరు జిల్లా, దొరవారిసత్రం మండలం, పూలతోట గ్రామంలో 3.5 ఎకరాల భూమిని ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద బోదయ్యకు ఇచ్చారు. తన భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ బోదయ్య 2021లో దరఖాస్తు చేసుకుంటే ఆ తర్వాత ఏడాది జిల్లా కలెక్టర్ తిరస్కరిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీనిని సవాల్ చేసిన కేసులో హైకోర్టు పైవిధంగా తీర్పు చెప్పింది.

ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో నిందితులకు బెయిల్ మంజూరు పరిధిపై విచారణ

ప్రజాశక్తి-అమరావతి

ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో నిందితులు నేరుగా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయవచ్చునో లేదో అనే మీమాంసను తేల్చేందుకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారణ ప్రారంభించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఓ మనోహర్‌రెడ్డి, న్యాయవాదులు ఎంఆర్‌కె చక్రవర్తి, శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదిస్తూ, రాజ్యాంగంలోని 226 అధికరణం కింద హైకోర్టుకు విస్తృతాధికారాలు ఉన్నాయని, ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో నిందితులకు బెయిల్ మంజూరు చేసే పరిధి హైకోర్టులకు ఉంటుందని చెప్పారు. పూర్తిస్థాయి వాదనల నిమిత్తం విచారణ బుధవారానికి వాయిదా పడింది. అక్రమ మైనింగ్ వ్యవహారంలో నెల్లూరు జిల్లా, పొదలకూరు పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మాజీ ఎమ్మెల్యే కాకాణి.. హైకోర్టును ఆశ్రయించాక పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి కేసును కూడా నమోదు చేశారు. అదేవిధంగా చిలకలూరిపేట టిడిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి విడదల రజినిపై చిలకలూరిపేట పట్టణ పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశారు. ఎన్‌ఎస్‌యు యువ నాయకుడు సంపత్ కుమార్ హత్య కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ న్యాయవాది కెసి కృష్ణారెడ్డి, గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం మోహన్ రంగారావు వేర్వేరుగా వ్యాజ్యాలు వేశారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో నిందితులకు హైకోర్టు ముందస్తు బెయిల్ ఇవ్వొచ్చునో లేదో తేల్చాలంటూ డివిజన్ బెంచ్‌కు సింగిల్ జడ్జి జస్టిస్ మల్లికార్జునరావు నివేదించారు. హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయవచ్చా లేక హైకోర్టు కన్నా ముందు ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టునే ఆశ్రయించాలా అనే వివాదంపై జస్టిస్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణ ప్రారంభించింది.

సాంకేతికతను ఉపయోగించుకోవాలి

- ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు పివి సత్యనారాయణ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

చిన్న, సన్న కారు రైతులు సాంకేతికతను అందిపుచ్చుకొని అధికదిగుడులు సాధించాలని ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయ డాక్టర్ పి.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. దక్షిణ మండలి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం మంగళవారం వైఎస్ఆర్ జిల్లా ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా, నానో డిఎపి సమర్థత స్థాయిని పరిశీలించాలని, పరిశోధనా ఫలితాలను త్వరతగతిన వెల్లడించడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రభుత్వానికి సబ్సిడీ భారం తగ్గించాలని చెప్పారు. భూమి, వాయు, నీటి కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడగలమని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పురుగు మందుల అవశేషాలను ఆహార ధాన్యాలు, కూరగాయలు పండ్లలో త్వరగా నిర్ధారించే పద్ధతులను గుర్తించి అందుకనుగుణంగా పురుగు మందుల అవశేషాలను నిర్మూలించే పరిశోధనలను వేగంగా పూర్తి చేయాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ సమావేశానికి శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, రైతులు కీలక భాగస్వాములు కనుక ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక కోసం తమ విలువైన సూచనలు ఇవ్వాలని కోరారు. కీటక శాస్త్రం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి ప్రధాన శాస్త్రవేత్త మురళీకృష్ణ మాట్లాడుతూ పురుగు మందుల అవశేష నిర్మూలన పద్ధతులు అడివి పందుల యాజమాన్యం గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, ఊటుకూరు, ప్రభాకర్ రెడ్డి, ఏరువాక కేంద్రం, ఊటుకూరు, సమన్వయకర్త అంకయ్య కుమార్ పాల్గొన్నారు.

కూటమి సర్కార్ మొద్దునిద్ర

- వైసిపి రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అకాల వర్షాలకు కుదేలైన ధాన్యం రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందని, మంత్రులు.. అన్నదాతలకు ముఖం చాటేస్తున్నారని వైసిపి రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వి రఘురాం విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆక్వా రంగాన్ని గాలికొదిలేసి క్రాప్ హాలిడే తెచ్చారని తెలిపారు. వారికి తక్షణం సబ్సిడీ విద్యుత్ అందించాలన్నారు. ధాన్యం, మిర్చి, పొగాకు, కోకో, అరటి రైతులను ఆదుకోవాలన్నారు. కోకోను సాగుచేయాలని ప్రోత్సహించిన ప్రభుత్వమే నేడు వారిని రోడ్లపాలు చేసిందని ఆరోపించారు.

కుట్టుమిషన్ల శిక్షణలో భారీ అవినీతి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపణ

కుట్టుమిషన్ శిక్షణ ముసుగులో భారీ అవినీతి జరిగిందని, తొలి విడతలో రూ.157 కోట్లు స్వాహాకు యత్నం చేస్తున్నారని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. మొత్తంగా రూ.254 కోట్ల దోపిడీకి కుట్ర జరుగుతోందన్నారు. బాబూ ష్యూరిటీ అవినీతి గ్యారెంటీగా పాలన సాగుతోందని విమర్శించారు. శిక్షణకు ప్రభుత్వ సంస్థలను కావాలనే పక్కన బెట్టారని, అనుకూల వ్యక్తులకు అధిక రేట్లకు టెండర్లు అప్పగించారని వివరించారు. ఈ స్కామ్‌పై సిబిఐతో విచారణ జరపాలని కల్యాణి డిమాండ్ చేశారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada-520002 (A.P.)

E Procurement Short Tender Notice

NIT No. 25/MAU61-EE0LS(OTH)/1/2022-RZLE, Dt.05.05.2025

Name of Work : APCRDA-"Renovation of 4th Fountain Structure at Entrance of AP-High Court"- **ECV: 12,26,272/-.**

The bid can be downloaded on AP e-procurement portal from **07.05.2025** to **14.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **14.05.2025 up to 15.00 Hrs**, Technical bid opening **14.05.2025 @16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**.

Sd/- Addl. Commissioner, APCRDA, Vijayawada

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)

అయోధ్యనగర్ బ్రాంచి (64070), డోర్.నెం.18-1-34, ప్రభాస్ కాలేజ్ బిల్డింగ్, సి.కె. రెడ్డి రోడ్డు, కేదారేశ్వరపేట, ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ-520003.

డిమాండ్ నోటీసు

NOTICE UNDER SECTION 13(2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/కో-ఆబ్లిగెంట్(లు)/హామీదారు(లు): 1. మెస్సర్స్ శ్రీ రామ హైడ్రాలిక్స్, (ప్రొప్రయిటర్ శ్రీ తుర్లపాటి వెంకట రాజ గోపాల్), ఫైవ్ స్టార్స్ కాంప్లెక్స్, షాప్ నెం. 12, బ్లాక్ నెం. 101 & 102, 2వ క్రాస్, 3వ రోడ్డు, జవహర్ ఆటోనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007. **2. మెస్సర్స్ శ్రీ రామ హైడ్రాలిక్స్, (ప్రొప్రయిటర్ శ్రీ తుర్లపాటి వెంకట రాజ గోపాల్),** ఫ్లాట్ నెం. 204, పగడాల వారి వీధి, జె.పి. రెసిడెన్సీ, రామవరప్పాడు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521108. **3. మెస్సర్స్ శ్రీ రామ హైడ్రాలిక్స్, (ప్రొప్రయిటర్ శ్రీ తుర్లపాటి వెంకట రాజ గోపాల్),** సర్వే నెం. 252/1, 15-24-350-1/8, ప్రశాంతి నగర్ బస్ స్టాప్, మూసాపేట్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఏ.టి.యం దగ్గర, కూకట్‌పల్లి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, తెలంగాణ-500072. **4. మెస్సర్స్ శ్రీ రామ హైడ్రాలిక్స్ (ప్రొప్రయిటర్ శ్రీ తుర్లపాటి వెంకట రాజ గోపాల్),** ఫ్లాట్ నెం. 303, 2-108, సర్వే నెం/ మున్సిపల్ నెం. 275 పి, అపర్ణ హిల్ పార్క్ అవెన్యూస్, చందానగర్, హైదరాబాద్, తెలంగాణ-500050. **5. శ్రీ తుర్లపాటి వెంకట రాజ గోపాల్,** తండ్రి: టి.వి.జి.ఎస్.వి ప్రసాద్ శర్మ, ఫ్లాట్ నెం. 401, విజయరాఘవ అపార్ట్‌మెంట్, చందానగర్, తిరుమలగిరి, హైదరాబాద్-500050. **6. తుర్లపాటి వెంకట విజయ సారధి,** తండ్రి: టి.వి.జి.ఎస్.వి ప్రసాద్ శర్మ, 23-29-14/ఏ, పొత్తూరివారి వీధి, సాయిబాబా గుడి దగ్గర, ముత్యాలంపాడు, సత్యనారాయణపురం, విజయవాడ-520011. **7. తుర్లపాటి నాగ శైలజ,** భర్త: తుర్లపాటి వెంకట రాజ గోపాల్, ఫ్లాట్ నెం. 401, విజయరాఘవ అపార్ట్‌మెంట్, చందానగర్, తిరుమలగిరి, హైదరాబాద్-500050.

నేచర్ ఆఫ్ లిమిట్	మంజూరు చేయబడిన మొత్తం (రూ. లక్షల్లో)	ది. 23-04-2025 నాటికి బకాయి మొత్తం (రూ.)
CCGEN - CC-GENERAL 640705010000125	రూ. 80,00,000/-	రూ. 87,87,000/-
GCLE1 - UNION GUARANTEED CREDIT 640706990000119	రూ. 10,30,000/-	రూ. 7,44,000/-

దిగువ వివరించిన స్థిరాస్తి తనఖా: 1. ఆంధ్రప్రదేశ్, ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, రామవరప్పాడు, పగడాల వారి వీధి, కోళ్ళఫార్మ్ రోడ్డు, ఆర్.ఎస్ నెం: 126/4ఏ, 126/4బి & 126/4సి, డోర్ నెం: 2-51, జె.పి రెసిడెన్సీ, మొదటి అంతస్తులో ఆర్.సి.సి ఫ్రేమ్డ్ 3 బి.హెచ్.కె నివాస ఫ్లాట్, ఫ్లాట్ నెం: 204 టి.జి.ఎస్.వి ప్రసాద శర్మ గారి కుమారుడు శ్రీ తుర్లపాటి వెంకట విజయ సారధి గారి పేరున కలదు. **హద్దులు: తూర్పు:** శూన్యాకాశము, **దక్షిణం:** శూన్యాకాశము, **పడమర:** కారిడార్ & మెట్ల దారి, **ఉత్తరం:** లిఫ్ట్ & శూన్యాకాశము.
2. కృష్ణాజిల్లా, మచిలీపట్నం తూర్పు భాగం, ఉల్లింగిపాలెం, మస్తాన్‌ఖాన్ పేట శివారు, ప్లాట్ నెం. 10 భాగం, ఆర్.ఎస్ నెం. 246 & 249, రెవెన్యూ వార్డ్ నెం. 3, డి.నెం. 30/715 సమీపంలో తుర్లపాటి వెంకట రాజ గోపాల్ గారి భార్య శ్రీమతి తుర్లపాటి నాగ శైలజ గారి పేరున గల నివాస ఖాళీ స్థలం. (116.66 చదరపు గజాల విస్తీర్ణం). **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 1 యొక్క స్థలం, **దక్షిణం:** తుర్లపాటి నాగ శైలజ గారి స్థలం, **పడమర:** 33 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** మల్లంపల్లి నాగ లింగ శాస్త్రి గారి స్థలం.
3. కృష్ణాజిల్లా, మచిలీపట్నం తూర్పు భాగం, ఉల్లింగిపాలెం, మస్తాన్‌ఖాన్ పేట శివారు, ప్లాట్ నెం. 11, ఆర్.ఎస్ నెం. 246 & 249, వార్డు నెం.30, రెవెన్యూ వార్డ్ నెం. 3, డి.నెం. 30/715 సమీపంలో తుర్లపాటి వెంకట రాజ గోపాల్ గారి భార్య శ్రీమతి తుర్లపాటి నాగ శైలజ గారి పేరున గల నివాస ఖాళీ స్థలం (266.60 చదరపు గజాల విస్తీర్ణం). **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 2 యొక్క స్థలం, **దక్షిణం:** కె. ఫణి కుమార్ గారి స్థలం, **పడమర:** 33 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** తుర్లపాటి నాగ శైలజ గారి స్థలం.
4. కృష్ణాజిల్లా, మచిలీపట్నం, గారాలదిబ్బ, ఎల్.పి నెం. 116/2012/ఆర్, ఆర్.ఎస్ నెం. 518, రెవెన్యూ వార్డ్ నెం. 3, ప్లాట్ నెం. 17, డి.నెం. 1/1 సమీపంలో తుర్లపాటి వెంకట రాజ గోపాల్ గారి భార్య శ్రీమతి తుర్లపాటి నాగ శైలజ గారి పేరున గల నివాస ఖాళీ స్థలం (140 చదరపు గజాల విస్తీర్ణం). **హద్దులు: తూర్పు:** 33 అడుగుల వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, **దక్షిణం:** కొప్పనాతి నిర్మల గారి స్థలం, **పడమర:** ప్లాట్ నెం. 22 యొక్క స్థలం, **ఉత్తరం:** పుట్టి గోపాల కృష్ణ గారి స్థలం.

అమ్మా/ అయ్యా,
విషయం: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి-నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు **CCGEN - CC-GENERAL and GCLE1 - UNION GUARANTEED CREDIT** క్రింద మా **అయోధ్యనగర్** బ్రాంచి **(64070),** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను **ది.22-04-2025**న నిరర్థక ఆస్తిగా **(NPA)** వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము **రూ. 87,86,240.20 (అక్షరాలా ఎనభై ఏడు లక్షల ఎనభై ఆరు వేల రెండు వందల నలభై రూపాయల ఇరవై పైసలు మాత్రమే)** మరియు **రూ. 7,43,888.90 (అక్షరాలా ఏడు లక్షల నలభై మూడు వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది రూపాయల తొంభై పైసలు మాత్రమే)** మరియు **ది.23.04.2025** నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం వడ్డీ, అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు/మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పంద రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంక్ వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము /డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంక్ వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది :23-04-2025 **అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

ADITYA BIRLA CAPITAL
PROTECTING INVESTING FINANCE ADVISING

ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండు, వెరవల్, గుజరాత్-362266.
విజయవాడ బ్రాంచి చిరునామా: 3వ అంతస్తు, కానూరు బాపయ్య కన్‌స్ట్రక్షన్ & లీజింగ్ బిల్డింగ్ (కెబిసిఎల్), డోర్ నం. 40-1-52సి, ఆచార్య రంగా నగర్, కెఎఫ్‌సి ప్రక్కన, ఎంజి రోడ్, బెంజ్ సర్కిల్, విజయవాడ-520010.

సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

2024 సం॥లో మీచేత పొందిన రుణసదుపాయలన్నీ, ఇప్పుడు ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ (ఇందు తదుపరి "ఎబిసిఎల్"గా పేర్కొబడును)కు బదిలీచేయబడినది మరియు అందుకు ఎబిసిఎల్ చేత మీకు ఈ ప్రకటన జారీచేస్తుంది.
షెడ్యూలులో పేర్కొనబడిన ఆస్తులు తాకట్టుపెట్టుట ద్వారా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత ఐన మీరు రుణం పొందియున్నారు మరియు లోన్ అగ్రిమెంట్ కొరకు రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారులు/ తాకట్టుదారులుగా మీరు నిలిచియున్నారు. అదేవిధంగా, మీరు డిఫాల్టిచెందినందున, ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (క్లుప్తంగా సార్ఫసీ యాక్ట్) యొక్క నియమాల క్రింద, మీ రుణ ఖాతా **15.04.2025** న నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినారు. మేము ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్, మీచేత చూపిన చిరునామాకు సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(13)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు జారీచేశాము. సదరు నోటీసుల్లోగల సమాచారం ఏమంటే, మీకు మంజూరైన రుణాలును చెల్లించుటలో మీరు డిఫాల్టి కమిట్ అయినారు అని తెలియజేయబడుచున్నది. అందుకుగాను, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) యొక్క నియమాలు మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)కు నియమాల ప్రకారం మీకు నోటీసు చేరవేయుట కొరకు ఈ ప్రచురణ ఇవ్వడమైనది.

రుణ ఖాతా నం. & రుణగ్రహీత, సహ-రుణగ్రహీత(ల) & తాకట్టుదారుల పేరు & చిరునామా: రుణ ఖాతా నం.: ఎబిఎఫ్ఎల్‌విజెడబ్ల్యుఎల్‌ఎపి0000033680-1. అంగజాల పరమేశ్వర రావు, డోర్ నం.6-229ఎ, అమరావతి మెయిన్ రోడ్, గోరంట్ల, గుంటూరు-522034. **మరియు:** 128-1-67, బోసు బొమ్మ సెంటర్, గోరంట్ల, గుంటూరు, గుంటూరు-522034 **మరియు:** డోర్ నం.11-5-8/3, షాప్ నం.3, హిందు కాలేజి ఎదురుగా, గుంటూరు-522001............... **(రుణగ్రహీత), 2. అంగజాల సునిత,** డోర్ నం.6-229ఎ, అమరావతి మెయిన్ రోడ్, గోరంట్ల, గుంటూరు-522034. **మరియు:** 128-1-67, బోసు బొమ్మ సెంటర్, గోరంట్ల, గుంటూరు, గుంటూరు-522034 **మరియు:** డోర్ నం.11-5-8/3, షాప్ నం.3, హిందు కాలేజి ఎదురుగా, గుంటూరు-522001............... **(సహ-రుణగ్రహీత), 3. టాటా డెకార్స్,** డోర్ నం.6-229/ఎ, అమరావతి మెయిన్ రోడ్, గోరంట్ల, గుంటూరు-522034. **మరియు:** 128-1-67, బోసు బొమ్మ సెంటర్, గోరంట్ల, గుంటూరు, గుంటూరు-522034 **మరియు:** డోర్ నం.11-5-8/3, షాప్ నం.3, హిందు కాలేజి ఎదురుగా, గుంటూరు-522001............... **(సహ-రుణగ్రహీత), ఇమెయిల్ ఐడి:**tatadecors@gmail.com**(ఇందు తదుపరి సేకరణలో "రుణగ్రహీతలు"గా పేర్కొనబడును).**

డిమాండు నోటీసు తేది: 28.04.2025.

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తాలు: 17.04.2025 నాటికి వడ్డీ మరియు ప్రిన్సిపల్ ఏరియర్స్ (ఆలస్యపు చార్జీలుతో కలిపి) బకాయి మొత్తాలు రూపేనా **రూ.57,13,164.69 పై.లు (రూపాయలు యాభై ఏడు లక్షల పదమూడు వేల నూటా అరవై నాలుగు మరియు అరవై తొమ్మిది పైసలు మాత్రమే)**

స్వాధీనం చేసుకున్న సెక్యూరిటీ వివరాలు: "గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-రిజిస్ట్రార్, గోరంట్ల గ్రామపంచాయతి ఏరియా, గోరంట్ల గ్రామం, డి. నం.34/2, డోర్ నం.6-229ఎ, అసెస్మెంట్ నం.1021149319 లోగల ఈజిమెంట్ హక్కులన్నింటితో దానిలో ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్, మొదటి, రెండవ మరియు మూడవ అంతస్తులతోపాటు 169చ.గ.లు లేదా 141.31చ.మీ.ల విస్తీర్ణంతో నివాసిత సైటు వద్దగల ఆస్తి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: పంచాయతి బాజారు, -33అ.లు, దక్షిణం: గునకల హనుమంత రావు యొక్క ఆస్తి సరిహద్దు-44.10అ.లు, పడమర: కన్నెగంటి వెంకట సుబ్బమ్మ ఆస్తి ప్రహరీ (ప్లాటు సరిహద్దు), ఉత్తరం: పంచాయతి రోడ్డు-47.3అ.లు;

తేది: 07.05.2025
ప్రదేశం: విజయవాడ.
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ తరపున,
సం/- అధీకృత అధికారి

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking | सिंडिकेट Syndicate

విజయవాడ మెయిన్ బ్రాంచ్ (13340), విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా. & 0866-2567779, 9440905155

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **కెనరా బ్యాంక్, విజయవాడ మెయిన్ బ్రాంచ్** వారికి **ఋణగ్రహీత:** M/s **శ్రీ శ్రీ శ్రీ జగత్‌గురు ట్రేడర్స్, ప్రొప్రయిటర్: శ్రీ దుర్గాసి వెంకట నానాజీ మరియు హామీదారు/తనఖాదారు: శ్రీ. దుర్గాసి జయదుర్గా** వారు తేది **30.04.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 7,92,276.97 (అక్షరాల ఏడు లక్షల తొంభై రెండు వేల రెండు వందల డెబ్బై ఆరు రూపాయల తొంభై ఏడు పైసలు మాత్రమే)** + వడ్డీ కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు **కెనరా బ్యాంక్, విజయవాడ మెయిన్ బ్రాంచ్** అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను **తేది 26.05.2025** న **"ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా"** మరియు **"అక్కడ ఏమున్నదో అది"** అనే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీత మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 26.05.2025, మ॥ 12.30 గం.ల నుండి మ॥ 2.00 గం.ల వరకు
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 26.05.2025, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

కృష్ణా జిల్లా, నున్న ఎస్.ఆర్.ఒ., విజయవాడ రూరల్, పాతపాడు గ్రామ పంచాయితీ, పాతపాడు గ్రామం, ఆర్.ఎస్.నెం. 247/16 మరియు సబ్-డివిజన్ ఆర్.ఎస్. నెం.247/16B నందు గల 484 చ॥గ॥ విస్తీర్ణంలోని ఖాళీ స్థలము యావత్తు. **హద్దులు: తూర్పు:** 12 అ॥ వెడల్పు నడక దారి, **దక్షిణం:** మరుపిల్ల నాని ఆస్తి, **పడమర:** తమిన్న వెంకటేశ్వరరావు ఆస్తి, **ఉత్తరం:** 15 అ॥ వెడల్పు ఉమ్మడి దారి.

రిజర్వు ధర: రూ. 21,39,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 2,13,900/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ **www.canarabank.com** లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, విజయవాడ మెయిన్ బ్రాంచ్ ఛీఫ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు: ఫోన్: 0866-2567779, 9440905155.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ **https://baanknet.com/** హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 06.05.2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

---

homefirst — We'll take you home

Home First Finance Company India Limited
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 18003008425
Email ID: loanfirst@homefirstindia.com

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలైన మీరు షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తిని తాకట్టుపెట్టుటచే రుణం పొందియున్నారు మరియు దిగువ పేర్కొన్న మీరు రుణ ఒప్పందం కొరకు రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత హామీదారుగా ఉన్నారు. మీరు డిఫాల్ట్ చెందిన పర్యవసానంగా, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (సంక్షిప్తంగా సర్ఫాసీ చట్టంలో) యొక్క నియమాల క్రింద **06.05.2025**న నాన్-పర్ఫార్మింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. మేము హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ గా మీరు సమర్పించిన చిరునామాకు సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(13)తో చదవగల సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేశాము. సదరు నోటీసులు **06.05.2025**న జారీ చేయబడినవి మరియు సదరు నోటీసులో పేర్కొన్నదేమనగా మీకు మంజూరు చేయబడిన చెల్లింపుల్లో మీరు డిఫాల్ట్ చెందియున్నారు. కావున, సర్ఫాసీ చట్టం యొక్క సెక్షన్ 13(2) యొక్క నియమాలు మరియు సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1) క్రింద నియమాలను అనుసరించి నోటీసు పంపుటకు ప్రస్తుత ప్రచురణ జారీచేయబడినది.

క్ర. సం.	ఖాతా చిరునామా మరియు రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల) పేరు	అమలు చేయబడిన సెక్యూరిటీల వివరాలు	డిమాండ్ నోటీసు తేది నాటికి మొత్తం బకాయి ప్లస్ తదుపరి వడ్డీ మరియు ఇతర వ్యయాలు (రూ.లో)
1.	అబ్దుల్ అజీమ్, షేక్ నాజరీన్, అబ్దుల్ మెహరున్నిసా	ఫ్లాట్-డో.నం.20/700-200-137, ఆర్.ఎస్.నం.411/1, ప్లాట్ నం.137, మున్సిపల్ వార్డు నం.20, ఫ్లాట్ నం.137, మూల్యాంకనం నం.1070053590, చిలకలపుడి, మచిలీపట్నం టౌన్, మచిలీపట్నం-521001, హద్దులు : ఉత్తరం : సిహెచ్.చిట్టి సైట్, దక్షిణం : రాణి సైట్, తూర్పు: జక్రియ సైట్, పడమర : మున్సిపల్ రోడ్డు.	10,92,172
2.	తిప్పిరెడ్డి సుబ్బారెడ్డి, తిప్పిరెడ్డి కోమలి	ఇంటి-డో.నం.325, డో.నం.4-195, మూల్యాంకనం నం.770, పాకాడు గ్రామ పంచాయతీ మరియు గ్రామం, సత్తెనపల్లి మండలం, సత్తెనపల్లి ఎస్ఆర్ఓ, గుంటూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522403. హద్దులు : తూర్పు : పంచాయతీ బజారు 23, దక్షిణం : తిప్పిరెడ్డి వెంకట రామ రెడ్డి ఆస్తి 75'-10, పడమర : బుత్తుకూరి వెంకట సుబ్బారెడ్డి ఆస్తి 23', ఉత్తరం : తిప్పిరెడ్డి తిరుపతిరెడ్డి ఆస్తి 75'-10.	8,44,715
3.	అంకంపూర్ణ చంద్ర, అంకం మానస	ఇల్లు- డో.నం.5-36, సర్వే నం.342/2, మండేపుడి గ్రామ పంచాయతీ ఏరియా, అమరావతి మండలం, పెదకూరపాడు ఉపజిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522401. హద్దులు : తూర్పు : కైల మరియమ్మ ఆస్తి, దక్షిణం : పంచాయతీ రోడ్డు, పడమర : పంచాయతీ రోడ్డు, ఉత్తరం : కైల భాగ్యలత ఆస్తి.	10,88,013

ఇందుమూలంగా మిమ్మల్ని కోరడమేమనగా వడ్డీ మరియు ఖర్చులతో పై మొత్తాలను ఈ నోటీసు తేది ప్రచురణ తేది నుండి 60 రోజుల కాలవ్యవధిలోపు ఎఫ్ఆర్ఓ 5196 (పాత), కొత్త మున్సిపల్ నం.17-2-180, కొలత 300 చ.గ.లు. చావని నది అలిబాగ్ హైదరాబాద్, తెలంగాణ-500023 వద్ద ఉన్న **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారికి చెల్లించాలి, విఫలం చెందితే రుణగ్రహీతలు, తాకట్టుదారులు మరియు హామీదారుల యొక్క సెక్యూర్డు ఆస్తుల స్వాధీనతా తీసుకొనుటతోసహా సెక్యూర్డు అసెట్స్ యొక్క అన్ని లేదా ఏదేని లేదా మరిన్నింటిపై సదరు చట్టం యొక్క నియమాల క్రింద **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** అవసరమైన చర్య తీసుకుంటుంది. సదరు చట్టం క్రింద **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు లభించు అధికారాలతోసహా (1) సెక్యూర్డు అసెట్స్ రియలైజింగ్ కొరకు అమ్మకం యొక్క లీజు, అసైన్‌మెంట్‌చే బదిలీచేయు హక్కులతోసహా రుణగ్రహీతలు/హామీదారుల సెక్యూర్డు అసెట్స్ స్వాధీనతాను చేపట్టు అధికారం (2) **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** చే సెక్యూర్డు అసెట్‌గా ఏదేని బదిలీ మరియు సెక్యూర్డు అసెట్స్‌ను రాబట్టుటకు మరియు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో బదిలీ హక్కులతోసహా సెక్యూర్డు అసెట్ యొక్క మేనేజ్‌మెంట్‌పై తీసుకొనుటకు అన్ని హక్కులు మరియు మీచే బదిలీ చేయబడినందున బదిలీ చేయబడిన సెక్యూర్డు ఆస్తులకు సంబంధించినవి.
సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) యొక్క నియమాలను అనుసరించి, మీరు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారి ముందస్తు అనుమతి లేకుండా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు హైపోథికేట్ చేసిన/ తాకట్టుపెట్టిన మరియు పై సూచించిన సెక్యూర్డు అస్తుల ఏదేని అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (మీ వ్యాపారం యొక్క నార్మల్ కోర్స్‌లో కాకుండా) రూపంలో బదిలీచేయుట నుండి మీరు నిషేధించబడినారు.

ప్రదేశం : గుంటూరు, విజయవాడ
తేది : 07.05.2025
సం/- అధీకృత అధికారి, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

Chola — Enter a better life

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయం: "చోలా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
శాఖా కార్యాలయం : చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్., డో.నం.59-14-2ఎ, 1వ అంతస్తు, శాంతి ప్లాజా, గాయత్రి నగర్, విజయవాడ-520008. సంప్రదించాల్సిన నెం.: శ్రీ.చైతన్య కుమార్ పగడాల, మహమ్మద్ రహీస్ మొ.నం. 8124000030 / 6374845616.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు. దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టినట్లు సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ తాకట్టు పెట్టిన వారు (లు)కి నోటీసు ఇవ్వబడింది, **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి లాంఛనప్రాయంగా స్వాధీనం తీసుకున్న దాన్ని ఇకపై **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**గా ఇక్కడ సూచించబడుతుంది. తాకట్టు ఆస్తులు **"ఏది ఉంటే అదే" "ఏమి ఉన్నాయో వాటినే"** మరియు **"ఎక్కడ ఉన్నాయో అక్కడే"** పద్ధతిలో ఇ-వేలం ద్వారా విక్రయించబడతాయి. పబ్లిక్ ఈ-వేలం ను మేము వెబ్‌సైట్ **https://bankauctions.in/** ద్వారా నిర్వహించబోతున్నామని దీని ద్వారా సాధారణ ప్రజలకు తెలియజేయడం జరిగింది.

క్ర సం.	ఖాతా సంఖ్య మరియు రుణ గ్రహీత, సహ రుణ గ్రహీత, తనఖాదారుల పేరు	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం మరియు తేది	ఆస్తి/ఆస్తుల వివరణ	రిజర్వు ధర / బయానా మొత్తం / బిడ్ పెంపుదల మొత్తం
1	**లోన్ అకౌంట్ నం.లు.: HE01GUN00000046327** **1. వెంకటేశ్వర్లు నాగెండ్ల, 2. వెంకట రమణ నాగెండ్ల, ఇరువురి నివాసం :** డో.నం.1-149-4, రేంజర్ గారి బజారు, రెంటచింతల, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522421. **3. శ్రీ లక్ష్మి గణపతి సిమెంట్స్,** డో.నం.10-125, మెయిన్ రోడ్డు, రెంటచింతల, రెంటచింతల మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522421.	08/10/2024 & Rs.37,84,517/- as on 08/10/2024	నరసరావుపేట రిజిస్టర్డ్ జిల్లా, గురజాల ఉపజిల్లా, రెంటచింతల గ్రామ పంచాయతీ, రెంటచింతల గ్రామం వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగాలు మరియు పార్సిల్ సర్వే డో.నం.357/ఎ/2బి, బ్లాక్-1 డో.నం.1-149/4, విస్తీర్ణం 142-9 చ.గ.లు. ఖాళీ సైట్‌తో అన్నీ సౌలభ్య హక్కులు. **హద్దులు : తూర్పు :** బజారు 16-09 అ.లు., **దక్షిణం :** దొరనాల అనంతరావమ్మ లోగిలి 70-03 అ.లు., **పడమర :** కొమ్మారెడ్డి చలమారెడ్డి సైట్ 19.03 అ.లు., **ఉత్తరం :** చాపరపు శ్రీనివాసరెడ్డి లోగిలి 72-6 అ.లు. **(లాంఛనప్రాయ స్వాధీనత)**	Rs.44,10,000/- / Rs.4,41,000/- / Rs.50,000/-
2	2. **లోన్ అకౌంట్ నం.లు.: HE01GUN00000055089** **1. రాధాకృష్ణమూర్తి యార్లగడ్డ, 2. యార్లగడ్డ వెంకటేశ్వరమ్మ, 3. మౌనిక యార్లగడ్డ, నం.1 నుండి 3 ఇక్కడ :** నం.4-310, నందిరాజు తోట, బాపట్ల తూర్పు, రూరల్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522101. **4. రాయల్ షూస్,** 5545, శ్రీనివాస చిల్డ్రన్స్ హాస్పిటల్, ఎమ్.జి.రోడ్డు, బాపట్ల పశ్చిమం, యు గ్రామం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522101.	08/10/2024 & Rs.51,66,022/- as on 08/10/2024	ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-522101, గుంటూరు జిల్లా, నరసరావుపేట ఉపజిల్లా, బాపట్ల మండలం, తూర్పు బాపట్ల గ్రామం హామ్లెట్, బాపట్ల, బాపట్ల రూరల్, బాపట్ల తూర్పు, నందిరాజు తోట గ్రామ కంఠం, తూర్పు బాపట్ల గ్రామం 4-310, మూల్యాంకనం నం.390 వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్సిల్ డో.నం.846 బయట ఎ.లు. 3-14 సెంట్లు. ఆ బయట ఎ.లు. 0-17 సెంట్లు. సైట్ విస్తీర్ణం 411.4 చ.గ.లు. తో ఆర్‌సిసి భవనంతో అన్నీ ఫిక్చర్లు మరియు దానిపై ఫిట్టింగులు. **హద్దులు : సరిహద్దులు : ఉత్తరం :** యార్లగడ్డ రామారావు సైట్, **తూర్పు :** సర్కార్ డొంక, **దక్షిణం :** కసాని నాగేశ్వరరావు సైట్, **పడమర :** బజారు. **(లాంఛనప్రాయ స్వాధీనత)**	Rs.70,50,000/- / Rs.7,05,000/- / Rs.1,00,000/-

ఇ వేలం తేది మరియు సమయం : 10.06.2025, ఉ.11.00గం.ల నుండి మ.1.00గం.ల వరకు (ఒక్కొక్కటి 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
ఇఎమ్‌డి సమర్పణ చివరి తేది : 09.06.2025 (సా.5.30గం.ల వరకు) తనిఖీ తేది : 03.06.2025 మరియు 04.06.2025

1. ఆసక్తిగల పాల్గొనేవారు/ బిడ్డర్లు అందరూ వెబ్‌సైట్ **https://bankauctions.in & www.cholamandalam.com/news/auction-notices** ను సందర్శించవలసిందిగా అభ్యర్థించబడ్డారు. ఇ-వేలం వివరాలు, సహాయం, ప్రక్రియ మరియు ఆన్‌లైన్ శిక్షణ కోసం, కాబోయే బిడ్డర్లు సంప్రదించవచ్చు **శ్రీ. మహమ్మద్ రహీస్-8124000030 / 6374845616, మెసెర్స్. 4 క్లోజర్.; రేఖ, ఫోన్ నెం.8142000062, ఇ మెయిల్ : CholaAuctionLAP@chola.murugappa.com**
2. నిబంధనలు మరియు షరతులపై మరిన్ని వివరాల కోసం ఇ-వేలంలో పాల్గొనడానికి **https://bankauctions.in & www.cholamandalam.com/news/auction-notices** ని దయచేసి సందర్శించండి.

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) కింద ఇది చట్టబద్ధమైన 30 రోజుల విక్రయ నోటీసు కూడా

తేది:07.05.2025, ప్రదేశం: గుంటూరు, విజయవాడ — **సం/- అధీకృత అధికారి, చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

బహిరంగ ప్రకటన

ICICI Bank — శాఖ కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

క్రింది రుణగ్రహీతలు బ్యాంక్ నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క అసలైన మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) కింద వారికి నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైంది.

క్ర. సం.	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/ హామీదారుల పేర్లు (లోన్ అకౌంట్ నెంబరు) మరియు చిరునామా	అమలు చేయబడిన సెక్యూర్డ్ అసెట్స్ చిరునామా	నోటీసు పంపిన తేది/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తం	ఎన్‌పిఎ తేది
1.	మందవ కవిత/ పోలినేని హరికృష్ణ- ఫ్లాట్ నం.402, శ్రీనివాస టవర్స్ ఎమ్ఆర్ఓ కార్యాలయం రోడ్డు వద్ద, పునాదిపాడు విజయవాడ, విజయవాడ-521151/ LBVJW00005163078- LBVJW00005163074- LBVJW00005198341	ఎ షెడ్యూల్ : కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కంకిపాడు మండలం, పునాదిపాడు గ్రామ పంచాయతీ ఏరియా, పునాదిపాడు గ్రామం డో.నం.1-10 వద్ద, రీ సర్వే నం.317/2, 317/3, 891.56 చ.గ.లు. స్థిర స్థలం మరియు దీని సరిహద్దులు : తూర్పు : రావి వెంకటేశ్వర రెడ్డి స్థలం అ.లు 79.3 ఇం.లు., దక్షిణం : మునిపల్లి రాఘవ స్థలం అ.లు. 101.3 ఇం.లు., పడమర : 40 అ.లు. వెడల్పు పంచాయతీ రోడ్డు అ.లు. 79.3 ఇం.లు., ఉత్తరం : అన్నవరపు మాలకొండయ్య అ.లు. 101.3 ఇం.లు. ఈ సరిహద్దుల మధ్య బయట 891.56 చ.గ.లు. స్థలం పేర్కొనబడని 1/20 వాటా ఉమ్మడి హక్కులు 44.578 చ.గ.లు.కు సమానమైన 37.27 చ.మీ.లు. స్థిర స్థలం. బి షెడ్యూల్ : పై ఎ షెడ్యూల్‌లో పేర్కొన్న మొత్తం ఆస్తిలో నిర్మించబడిన "శ్రీనివాస టవర్స్" అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో ఫ్లాట్ నం.402 ఈ ఫ్లాట్ యొక్క సరిహద్దులు : తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : మెట్లకేస్ మరియు ఓపెన్ టు స్కై. ఈ నాలుగు సరిహద్దుల పేర్కొనబడని ఫ్లాట్ తో 902 చ.అ.లు. ప్లింత్ ఏరియా 225 చ.అ.లు. సాధారణ ఏరియా, 120 చ.అ.లు. పార్కింగ్ ఏరియా (మార్క్ చేయబడిన ప్రదేశం వద్ద)	11.03.2025 Rs. 27,62,214.58/-	08-01-2025
2.	మహమ్మద్ అసాదుల్లా ఖాన్/ ఆరిశెట్టి ప్రభావతి- ఫ్లాట్ నం.205 7వ బ్లాక్ పంచవతి అపార్టుమెంట్ పాత గుంటూరు, గుంటూరు-522003/ LBGTR00005272787	ఆస్తి (ఎ) షెడ్యూల్ : గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని గుంటూరు సిటీ, పొన్నూరు రోడ్డు, ఆనందపేట ఎక్స్‌టెన్షన్‌లో బేరింగ్ పాత మున్సిపల్ వార్డు నం.9, టౌన్ సర్వే 778/3, రీ సర్వే నం.778/3ఎఫ్, 778/3జి, 778/3హెచ్, డో.నం.17-11-19, కొలత 12150 చ.గ.లు. క్రింది విధమైన హద్దులు : ప్లాట్ కొరకు సరిహద్దులు : ఉత్తరం : వాక వెంకటరావమ్మ ప్లాట్ ఆస్తి సరిహద్దు 68 అ.లు., దక్షిణం :షేక్ మునీర్ మొదలైనవారి ఆస్తి సరిహద్దులు, బచ్చు శ్రీరాములు ఆస్తి సరిహద్దు అక్కడ నుండి అసెట్స్, ఎపి ట్రాన్స్‌కో ద్వారా వారికి అమ్మబడిన ఆస్తి 770 అ.లు., తూర్పు : శ్రీ రామగిరి రామారావు మొదలైనవారి ఆస్తి సరిహద్దు 129 అ.లు., పడమర : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు పరిధి 811.0 అ.లు. మరలా పడమర : వాక వెంకటరమణ స్థలం సరిహద్దు 25 అ.లు., మరలా ఉత్తరం : వాకా వెంకటరమణ స్థలం సరిహద్దు 811 అ.లు. ఈ పరిధి మధ్య 12150 చ.అ.లు. లేదా 8140 చ.గ.లు. ప్లాట్ పేర్కొనబడని, అవిభక్త విభజన కొలత 47 చ.గ.లు. లేదా 39.30 చ.మీ.లు. స్థలం మరియు సౌలభ్య హక్కులు మొదలైనవి. ఆస్తి (బి) షెడ్యూల్ : పంచవటి ఆమోదించిన ప్లాన్ ప్రకారం పైన పేర్కొన్న ఏరియాలో నిర్మించబడిన అపార్టుమెంట్లు, బ్లాక్ నం.4, మూడవ అంతస్తు, ఫ్లాట్ నం.303 మరియు పని ప్రణాళిక ప్రకారం బ్లాక్ నం.8, మూడవ అంతస్తు నం.303 వివరాలు : ఫ్లాట్ కొరకు సరిహద్దులు : ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర : కామన్ కారిడార్. 1180 చ.అ.లు. హద్దుల మధ్య ఆర్.సి.సి. ఫ్లాట్, టూ వీలర్ పార్కింగ్, కార్ పార్కింగ్ మొదలైన వాటితో సౌలభ్య హక్కులు.	17.03.2025 Rs. 18,33,811.45/-	03-02-2025
3.	రాజశేఖర్ మండ/ కృష్ణవేణి మండ- ఎ 49 శ్రీకుంజ్ కుటీర్, గోత్రి రోడ్డు, పుష్పం టెనెమెంట్స్ వడోదర-390021/ LBBRD00005427845/ LBVJW00001959944	ఎ షెడ్యూల్ ఆస్తి అమ్మకం షెడ్యూల్ : కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రార్ వారి, పెనమలూరు మండలం, కానూరు గ్రామ పంచాయతీ ఏరియా, కానూరు గ్రామం రెవెన్యూ నం.223/6 ఆర్.ఎల్.పి.నం.57/2010/నిజ లే అవుట్ ప్లాన్ ఎంట్రీ ప్లాట్ నం.14, 15ఎ, 15బి, డో.నం.9-37 వద్ద ఎంట్రీ చ.మీ.లు. 1083 స్థిరాస్తి సరిహద్దులు : తూర్పు : ఎ.30-0 వెడల్పు పంచాయతీ రోడ్డు 117-8, దక్షిణం : అమీరున్నిసా బేగం ఆస్తి 83-0, పడమర : వేములపల్లి నాగభూషణం ఆస్తి 117-0, ఉత్తరం : ప్లాట్ నం.16 పునుమత్స ప్రవేశించిన ఆస్తి 83-0 వెంకటరాజుగారు ఈ నాలుగు సరిహద్దుల మధ్య 1083 చ.గ.లు. లేదా 905.52 చ.మీ.లు. స్థిరాస్తి, ఈ స్థిరాస్తిలో సైట్ పేర్కొనబడని విభజించబడని ఉమ్మడి 54.15 చ.గ.లు. లేదా 45.276 చ.మీ.లు. మరియు బి షెడ్యూల్ : పైన పేర్కొన్న ఎ షెడ్యూల్ మొత్తం ఏరియాలోని సైట్‌లో నిర్మించబడిన "శ్రీ భవాని రెసిడెన్సీ పేరు తో ఉన్న అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ నాలుగవ అంతస్తులోని ఫ్లాట్ నం.501 సరిహద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : లిఫ్ట్ మరియు ఓపెన్ టు స్కై, పడమర : ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నం.502కు మాత్రమే చెందిన కామన్ కారిడార్, ఉత్తరం : ఓపెన్ టు స్కై.	28.03.2025 Rs. 15,99,265.02/-	02-11-2024

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

తేది : 07 మే, 2025
ప్రదేశం : విజయవాడ
సం. అధీకృత సెక్రెటరీ
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున



గుజరాత్‌లో భారీ వర్షాలు

- 14 మంది మృతి
- 16 మందికి గాయాలు

న్యూఢిల్లీ : గుజరాత్‌లో గత 24 గంటల్లో కురిసిన భారీ వర్షాలకు 14 మంది మరణించారని అధికారులు మంగళవారం వెల్లడించారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో ఈ భారీ వర్షాలు కురిసాయని తెలిపారు. చెట్లు, హోర్డింగ్‌లు కూలిపోవడం, పిడుగులు పడ్డం, విద్యుత్ షాక్‌లు, ఇళ్లు కూలిపోవడం వంటి కారణాలతో ఈ మరణాలు సంభవించాయని తెలిపారు. అనేక జిల్లాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఖేడా, గాంధీనగర్, మెహ్సానా, వడోదర జిల్లాలో గత 24 గంటల్లో దాదాపు 40 మి.మీ వర్షపాత నమోదయిందని చెప్పారు. కాగా, మరిన్ని రోజులు గుజరాత్‌లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. కాగా, భారీ వర్షాలకు 14 మంది మరణించడంపై రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినా ప్రభుత్వం ఎటువంటి ఏర్పాట్లు చేయలేదని తెలిపాయి. ఇది వినాశకరమైన నిర్లక్ష్యం అని ప్రతిపక్ష నాయకుడు అమిత్ చావ్డా విమర్శించారు.

వరి విత్తనాల పరిశోధనలపై చిన్నచూపు

- మెడికల్ కాలేజీకి పరిశోధనా క్షేత్రం భూములు
- ప్రత్యామ్నాయంగా అనువైన భూములు కేటాయించకుండా తాత్సారం



మచిలీపట్నంలోని రైతు పరిశోధనా స్థానం కార్యాలయం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

విజన్-మిషన్‌లో భాగంగా మచిలీపట్నాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న ప్రభుత్వాలు చౌడు భూముల్లో సాగుకు అనుకూలమైన వరి విత్తనాల రూపకల్పనకు సాగుతున్న పరిశోధనలపై మాత్రం చిన్నచూపు చూపుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న ఒకే ఒక్క మచిలీపట్నం పరిశోధనా క్షేత్రం భూములను గత ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణానికి ఇచ్చింది. దీనికి ప్రత్యామ్నాయంగా నాలుగేళ్లుదాటినా పరిశోధనలకు అనువైన ప్రత్యామ్నాయ భూములను ఆయా ప్రభుత్వాలు ఇప్పటికీ కేటాయించలేదు. దీంతో, అంతర్జాతీయ పరిశోధనా ప్రాజెక్టును స్వల్ప విస్తీర్ణంలోని కౌలు భూముల్లో నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. వాతావరణ మార్పులు, బోరు నీటి వాడకం, రసాయన ఎరువుల వినియోగం, నీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ముంపు సమస్యలు అధికమవ్వడంతో రాష్ట్రంలోనూ, కృష్ణా జిల్లాలోనూ ఏటా చౌడు భూముల విస్తీర్ణం పెరిగిపోతోంది. రాష్ట్రంలో 2010 నాటికి 6.85 లక్షల ఎకరాల చౌడు భూములుండగా, 2018 నాటికి అవి 9.98 లక్షల ఎకరాలకు పెరిగిపోయాయి. కృష్ణా జిల్లాలో 30 వేల ఎకరాల చౌడు భూములు ఉన్నాయి. అంతర్జాతీయంగానూ చౌడు భూముల సమస్య తీవ్రమవుతోంది. ఈ క్రమంలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో రూపొందించిన 160 రకాల చౌడు భూములను తట్టుకునే వంగడాలపై ఫిలిప్పైన్స్ దేశ సహకారంతో మచిలీపట్నంలో ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు మొదలెట్టారు. ఇందుకు సొంత భూములు లేకపోవడంతో మచిలీపట్నంలోని రుద్రవరంలో మూడు ఎకరాల కౌలు భూముల్లో పరిశోధనలు చేపట్టారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మరో రెండు సంవత్సరాలు అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో పరిశోధనలకు అనువైన 50 ఎకరాల భూములను పరిశోధనా క్షేత్రానికి కేటాయించాలని సంబంధిత అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. 50 ఎకరాలు పరిశోధనా క్షేత్రానికి కేటాయిస్తే నాణ్యమైన ఫౌండేషన్ సీడ్‌ను రైతులకు అందించే అవకాశం ఉందని నివేదికలో అధికారులు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణానికి పరిశోధనా క్షేత్రం భూములు

చౌడును తట్టుకుని అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాల రూపకల్పనకు 1955లో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు మచిలీపట్నంలో వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రాడార్ కేంద్రం సమీపంలో కేటాయించిన 26.30 ఎకరాలను పరిశోధనలకు అనుగుణంగా మార్పు చేశారు. విత్తనాలు ఆరబోసుకునే సిమెంట్ కళ్లాలు, విత్తనాల ప్రాసెసింగ్ యంత్రాలు, గోదాములు, కార్యాలయ భవనాలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. అయితే, శాస్త్రవేత్తల అభ్యంతరాలను పట్టించుకోకుండా 2021లో ఈ భూములను ప్రభుత్వం మెడికల్ కళాశాలకు అప్పగించింది. మెడికల్ కళాశాలను నిర్మించే క్రమంలో రూ.7 కోట్ల విలువైన పరిశోధనా స్థానంలోని గొడౌన్లు, ఫ్లాట్‌ఫారాలు, కళ్లాలు, ప్రాసెసింగ్ యంత్రాలు ధ్వంసమయ్యాయి. దీంతో, ఇక్కడ పరిశోధనలు సాగించడం సమస్యగా మారింది.

భూములు, నిధులు కేటాయిస్తేనే పూర్తి స్థాయి పరిశోధనలు

విజన్-మిషన్‌లో భాగంగా మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా 300 ఎకరాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక పార్కు (ఎంఎస్ఎంఇ), నాలుగు వేల ఎకరాల్లో మెగా ఇండస్ట్రియల్ పార్కు, 80 ఎకరాల్లో మంగినపూడిలో టూరిజం ప్రాజెక్టులకు భూములను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. అయితే, వరి పరిశోధనా క్షేత్రానికి అనువైన భూములు, మౌలిక వసతులకు నిధులు కేటాయింపులపై ఏ మేరకు శ్రద్ధ చూపుతారనేది వేచి చూడాలి.

జమ్మూకాశ్మీర్‌లో లోయలో పడిన బస్సు

- సైనికుడితో సహా నలుగురి మృతి
- 44 మందికి గాయాలు

జమ్మూ : జమ్మూకాశ్మీర్‌లో ప్రయాణీకులతో వెళతున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిపోవడంతో ఒక సైనికుడుతో సహా నలుగురు మరణించారు. ఈ ఘటన పూంచ్ జిల్లాలోని మెంధర్ వద్ద మంగళవారం సంభవించింది. ఈ ప్రమాదంలో 44 మంది గాయడ్డారు. అధికారుల వివరాల ప్రకారం ఘని గ్రామం నుంచి మెంధర్ వస్తున బస్సు ఉదయం 9:20 గంటల సమయంలో బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఒకస్మారిగా రోడ్డు పక్కన ఉన్న లోయలోకి పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఆర్మీ, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు ప్రారంభించారు. గాయడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. మృతి చెందిన సైనికుడ్ని ఘని గ్రామానికి చెందిన 45 ఏళ్ల మహ్మద్ మజీద్‌గా గుర్తించారు. మజీద్ అస్సాంలో విధులు నిర్వహిస్తున్నాడు. సెలువులపై గ్రామానికి వచ్చాడు. గాయపడిన వారు మెంధర్, రాజౌరిల్లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని జమ్మూ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ (జిఎంసి)కి తరలించారు.



చిరాగ్-సాత్విక్ జంటకు 18వ ర్యాంక్

- బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల

లాసన్నె: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత డబుల్స్ జంట చిరాగ్-సాత్విక్ 18వ స్థానంలో నిలిచారు. గాయాల కారణంగా వీరు ఈ ఏడాది జరిగిన టోర్నీల బరిలోకి దిగని కారణంగా వీరి ర్యాంకింగ్ పతనమైంది. మాజీ నంబర్ వన్ జంట ఈ ర్యాంకింగ్స్‌కు ముందు 11వ స్థానంలో ఉండగా.. తాజా ర్యాంకింగ్స్‌లో 7స్థానాలు పడిపోయి 18వ స్థానంలో నిలిచారు. ఇక మహిళల సింగిల్స్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు 18వ స్థానం నుంచి 16వ స్థానానికి ఎగబాకింది. ఇటీవల ముగిసిన సుదీర్మన్ కప్‌లో 29ఏళ్ల సింధు ఒక్క గేమ్ కూడా నెగ్గకున్నా.. ర్యాంక్‌ను సవరించుకోవడం విశేషం. మాల్విక బన్సోద్(23), రక్షితశ్రీ(41), అనుపమ ఉపాధ్యాయ(42), ఆకర్షి కశ్యప్ 47స్థానాల్లో నిలిచి టాప్-50లో చోటు దక్కించుకున్నారు. ఇక మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రీ గోపీచంద్ జంట 10వ స్థానంలో నిలువగా.. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 18వ స్థానం నుంచి 19వ ర్యాంక్‌కు పడిపోయాడు. ఇక ఆసియా క్రీడల కాంస్య పతక విజేత హెచ్ఎస్ ప్రణయ్ 30 నుంచి 35వ ర్యాంక్‌కు పడిపోగా.. ప్రియాన్షు రాజవత్ 36వ ర్యాంక్ నుంచి 33వ ర్యాంక్‌కు ఎగబాకాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల-తానీసా కాస్ట్రో 19వ స్థానంలో ఉన్నారు.

హర్మన్‌ప్రీత్ సేనకు పరీక్ష

- నేడు దక్షిణాఫ్రికా మహిళలతో చివరి లీగ్ మ్యాచ్
- ముక్కోణపు సిరీస్



కొలంబో: ముక్కోణపు సిరీస్‌లో భారత మహిళలజట్టు చివరి లీగ్ మ్యాచ్ బుధవారం ఆడనుంది. టోర్నీలో భాగంగా తొలుత ఆడిన రెండు లీగ్ మ్యాచుల్లోనూ గెలిచి దాదాపు ఫైనల్‌కు చేరుకుంది అనుకున్నా... ఆతిథ్య శ్రీలంకతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన్ అనూహ్యంగా ఓటమిపాలైంది. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా మహిళలతో బుధవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిస్తే హర్మన్‌ప్రీత్ సేనకు ఫైనల్ బెర్త్ ఖాయం కానుంది. మిగిలిన జట్లతో పోల్చిచూస్తే భారత్‌కు మెరుగైన రన్‌రేట్ కలిగి ఉంది. మరోవైపు దక్షిణాఫ్రికా మహిళలు ఆడి రెండు లీగుల్లోనూ ఓడి ఫైనల్ బెర్త్ నుంచి దాదాపు నిష్క్రమించినా.. ఆ జట్టు భారత్, శ్రీలంకతో ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉంది. భారత్ మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. శ్రీలంక కూడా మూడింట రెండు విజయాలు సాధించి, రన్‌రేట్ విషయంలో భారత్ కంటే వెనుకబడి రెండో స్థానంలో ఉంది. సౌతాఫ్రికా జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో పరాజయాలు ఎదుర్కొని చివరి స్థానంలో నిలిచింది. శ్రీలంకతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని లంక 5 బంతులు మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు 11న జరిగే ఫైనల్లో టైటిల్‌కై తలపడనున్నాయి.

భారత్‌కు ఎదురుదెబ్బ

సౌతాఫ్రికాతో జరిగే మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ టోర్నీలోనే అరంగేట్రం చేసిన 22ఏళ్ల బ్యాటింగ్ ఆల్‌రౌండర్ కశ్వీ గౌతమ్ గాయం బారిన పడింది. ఈ కారణంగా ఆమె టోర్నీ నుంచి వైదొలిగింది. శ్రీలంకతో జరిగిన గత మ్యాచ్ సందర్భంగా కశ్వీ కాలికి గాయమైంది. కశ్వీ స్థానాన్ని అన్ క్యాప్డ్ పేసర్ క్రాంతి గౌడ్‌తో రీప్లేస్ చేశారు భారత సెలెక్టర్లు. కశ్వీ గత డబ్ల్యుపిఎల్‌లో రాణించి టీమిండియాలో స్థానం సంపాదించింది.

భారత్- బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ : భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదిరింది. మంగళవారం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ఫోన్ సంభాషణ అనంతరం భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఒప్పందంపై ప్రకటన చేశారు. బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో పాటు, సామాజిక భద్రతా ఒప్పందం ఖరారైనట్లు తెలిపారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా అభివర్ణించారు. దీనివల్ల రెండు దేశాలకూ లాభదాయకమన్నారు. స్టార్మర్ భారత్‌లో పర్యటన కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అంశంపై ఇరు దేశాల మధ్య గత మూడేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. బోరిస్ జాన్సన్ ప్రధానిగా ఉన్నప్పటి నుంచి ఇరు దేశాల మధ్య చర్చలు నడుస్తూ వచ్చాయి. ఇటీవల ఈ ఒప్పందం ఖరారు చేయడం కోసం కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ వారం రోజుల వ్యవధిలోనే రెండు సార్లు లండన్‌లో పర్యటించారు. స్వేచ్ఛా మార్కెట్, వాణిజ్య ఆంక్షల సడలించడం ద్వారా 2040 నాటికి ఇరు దేశాల వాణిజ్యాన్ని 25.5 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా దాదాపు 14 దఫాలుగా చర్చలు జరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 20.36 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వాణిజ్యం 2023-24 నాటికి 21.34 బిలియన్ డాలర్లకు పెరిగింది. రాబోయే పదేళ్లలో దీన్ని 20 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే 99 శాతం ఉత్పత్తులకు జీరో టారిఫ్ వర్తిస్తుంది. అలాగే, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతయ్యే విస్కీపై సుంకం 150 శాతం నుంచి 75 శాతానికి తగ్గనుంది. నిర్దేశిత కోటా మేరకు ఆటోమొబైల్ దిగుమతుల సుంకం 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గనుంది. వీటితో పాటు వైద్య పరికరాలు, అధునాతన మెషినరీ పరికరాలు, చాక్లెట్లు, బిస్కెట్లపై టారిఫ్‌లను భారత్ తగ్గించనుంది. అలాగే, సామాజిక భద్రత ఒప్పందంలో భాగంగా బ్రిటన్‌లో పనిచేసే భారతీయులు సోషల్ సెక్యూరిటీ ఫండ్స్ కింద రెట్టింపు చెల్లింపు చేయాల్సిన అవసరం తప్పుతుంది.

మైనార్టీ రుణాల్లో దూదేకులకు దగా!

- రూ.173 కోట్ల రుణాల్లో మొండిచేయి
- ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో కనిపించని ఆప్షన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మైనార్టీ రుణాల మంజూరులో దూదేకులకు అన్యాయం జరుగుతోంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 36,58,915 మంది మైనార్టీ జనాభాలో ముస్లిములు, క్రిస్టియన్లు, దూదేకుల అనుబంధ కులాలు ప్రధానంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.173 కోట్లతో 15 వేల మంది లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీతో మైనార్టీ రుణాల మంజూరుకు ఆదేశాలు జారీ చేసింది. రూ.152.50 కోట్లు సబ్సిడీ, రూ.21.07 కోట్లు శిక్షణకు కేటాయించింది. శ్లాబ్-1లో కిరాణా దుకాణాలు మొదలుకొని ఎలక్ట్రికల్ రిపేర్, సైకిల్ దుకాణాల రిపేరు సెంటర్ల ఏర్పాటుకు రూ.లక్ష చొప్పున 15 వేల యూనిట్లు, శ్లాబ్-2లో ఎసి, ఫ్రిజ్ రిపేర్ పనుల దగ్గర నుంచి చికెన్, మటన్ దుకాణాల ఏర్పాటుకు వరకు రూ.3 లక్షల చొప్పున 3,040 యూనిట్లు, శ్లాబ్-3లో ఆటోమొబైల్ సెక్టార్, ట్రాన్స్‌పోర్టు సెక్టార్, ఫ్యాబ్రికేషన్ సెక్టార్‌ల ఏర్పాటుకు అవసరమైన మేరకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 1,525 యూనిట్లు, శ్లాబ్-4లో ఆయా మండల కేంద్రాల్లో ఆటోమొబైల్ దుకాణాలు, జనరిక్ మందుల దుకాణాలు, ఫిట్‌నెస్ సెంటర్లు మొదలైనవి ఏర్పాటు చేసుకోవడానికి ఉద్దేశించి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలతో 225 యూనిట్ల చొప్పున రుణాలు మంజూరు చేస్తోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొంది. రాష్ట్రంలోని ముస్లిమ్ మైనార్టీ నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకుంటోంది. సోమవారం నాటికి కడప జిల్లాలో 50 దరఖాస్తులు, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వెయ్యి దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తుల సాఫ్ట్‌వేర్‌లో బిసి ఎ, బిసి బి, బిసి సి, బిసి ఇ కేటగిరీల పరిధిలోని కులాల వివరాలు డిస్‌ప్లే అవుతున్నాయి. బిసి బి కేటగిరీలోని మైనార్టీలుగా ఉన్న దూదేకుల అనుబంధ కులాలైన దూదేకుల, నూర్ బాషా, పింజారీ, లద్దాఫ్ కులాలకు ఆప్షన్ డిస్‌ప్లే కావడం లేదు. ఫలితంగా రాష్ట్రంలోని సుమారు లక్షలాది మంది దూదేకుల సామాజిక యువతకు అన్యాయం జరుగుతోందని దూదేకుల సంఘాల నుంచి సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కడప జిల్లాలోని 3,18,441 మంది మైనార్టీ యువతకు రూ.26.54 కోట్లతో 1,723 యూనిట్లు, అన్నమయ్య జిల్లాలోని 2,93,463 మంది మైనార్టీ యువతకు రూ.24.45 కోట్లతో కూడిన 167 యూనిట్లు మంజూరు చేసింది. మైనార్టీ రుణాల షెడ్యూల్ విడుదలైన వెంటనే కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వందలాది మంది ఆన్‌లైన్ పోర్టల్‌ను సంప్రదించారు. మైనార్టీ రుణాల మంజూరు సాఫ్ట్‌వేర్‌లో దూదేకుల ఆప్షన్ కనిపించకపోవడంతో దిక్కుతోచని మైనార్టీ ఇడి కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారు. మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయంలో సమాధానం చెప్పడానికి తడబడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కారణాలను ఆరా తీస్తే రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయకుండా వదిలేసినట్లు సమాచారం. ఫలితంగా రాష్ట్రంలోని సుమారు లక్షలాది మంది దూదేకుల అనుబంధ కులాలకు అన్యాయం జరుగుతుండడంపై దూదేకుల సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం గురించి తెలియని నిరుద్యోగ యువత మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

నకిలీ పత్రాలతో రుణాలపై కొనసాగిన విచారణ

- పత్తా లేని సెంట్రల్ బ్యాంక్ మేనేజర్, దళారీ

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సెంట్రల్ బ్యాంకులో చేపల చెరువుల నకిలీ లీజు అగ్రిమెంట్లతో ఆయా చెరువుల యజమానులకు తెలియకుండానే సుమారు రూ.4 కోట్లు రుణం పొందిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ సర్దుకొడప గ్రామానికి తిరుమాని నాగరాజు, శ్రీనివాస్, వడ్డి కాసులు, పద్మావతి పేరిట సుమారు 19 ఎకరాల భూమిపై సుమారు రూ.4 కోట్ల రుణాలు దూది చంద్రశేఖర్, కె.ప్రసాద్ పొందినట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై సెంట్రల్ బ్యాంక్ విజయవాడ రీజనల్ కార్యాలయం నుండి మంగళవారం నలుగురు అధికారులు బ్యాంకుకు వచ్చి విచారణ చేపట్టారు. అప్పటికే బ్యాంక్ మేనేజర్ టి.ప్రకాశం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో బ్యాంకు అధికారులుఉ సిబ్బందిని విచారించి, పలు డాక్యుమెంట్లు పరిశీలించి వెనుదిరిగారు. సెంట్రల్ బ్యాంకులో రుణాల కుంభకోణం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. బ్యాంకర్లు దళారీల ద్వారా వెళ్తే వెంటనే రుణాలిచ్చి కమీషన్లు తీసుకుంటున్నారని, న్యాయబద్ధంగా అన్ని పత్రాలతో నేరుగా బ్యాంకుకు వెళ్తే కనీసం సమాధానం చెప్పడం లేదని పలువురు ఆరోపించారు. ఈ కేసులో రుణాలిప్పించడంలో కీలకంగా వ్యవహరించిన దళారీ కొప్పినీడి మాధవ్, బ్యాంక్ మేనేజర్‌ను సంబంధిత అధికారులు సరైన రీతిలో విచారించలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

గోప్యంగా బిబిఎస్ అధ్యక్షుని వివరాలు

- ఆర్‌టిఐ ప్రశ్నకు బదులివ్వని కేంద్రం

న్యూఢిల్లీ : భారతీయ భాషా సమితి (బిబిఎస్) ఛైర్మన్ చాము కుమార్ శాస్త్రి విద్యార్హతలు, బయోడేటాను కేంద్ర ప్రభుత్వం గోప్యంగా ఉంచుతోంది. సమాచార హక్కు చట్టం కింద 'ది టెలిగ్రాఫ్' పత్రిక అడిగిన సమాచారాన్ని అందజేయడంలో కేంద్రం విఫలమైంది. బీబీఎస్ అధ్యక్షుడిగా చాము కుమార్ శాస్త్రి 2021లో నియమితులయ్యారు. ఆయన ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్కృత భారతిలో సభ్యుడు. చిన్నారుల కోసం శిబిరాల వంటివి ఏర్పాటు చేసి వాటి ద్వారా సంస్కృత అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి ఆ సంస్థ ప్రయత్నిస్తోంది. భారతీయ భాషలను ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన చర్యలను సూచించడానికి కేంద్ర ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసింది.

శాస్త్రికి ఏ ప్రాతిపదికన జీతాన్ని నిర్ణయించారో తెలియజేయాలని ఆ పత్రిక కోరింది. అయితే దానికి కూడా విద్యా శాఖ నుండి సమాధానం రాలేదు. శాస్త్రి బయోడేటా ప్రతిని కేంద్ర ప్రజా సమాచార అధికారి (సీపీఐఓ) అందజేయలేదు. బయోడేటాను, ఇతర వివరాలను అందజేయాలంటూ చేసిన అభ్యర్థనపై మొదటి అప్పిలెట్ అధికారి సుమన్ దీక్షిత్ మార్చి 20న స్పందించారు. కోరిన సమాచారం అందుబాటులో లేదని బదులిచ్చారు.

'కోరిన, అందించిన సమాచారానికి సంబంధించిన ముఖ్యమైన కోణం నుండి మీ అప్పీలును పరిశీలించాము. ఉన్నత విద్యాశాఖకు చెందిన సీపీఐఓ (ఎల్-11) రికార్డులలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని అందజేయడం జరిగిందని గుర్తించాము' అని ది టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన సమాధానంలో తెలియజేశారు. 2023 డిసెంబర్ నుండి శాస్త్రికి ప్రతి నెల రెండున్నర లక్షల రూపాయలు చెల్లించారు. కేంద్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జీతం కంటే ఇది ఎక్కువ అని 'ది టెలిగ్రాఫ్' తెలిపింది.

ఫలితమివ్వని ప్రసూతి పథకం

- నానాటికీ తగ్గుతున్న లబ్దిదారుల సంఖ్య
- కేటాయింపులూ అంతంతే
- ని'బంధనాల'తో గర్భిణులకు అందని సాయం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ప్రసూతి ప్రయోజన పథకం ఆశించిన ఫలితాలను అందించడం లేదు. ఈ పథకం ఏటా కేవలం ఇరవై శాతం శిశు జననాలకే ప్రయోజనం చేకూరుస్తోంది. 2013వ సంవత్సరపు జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద దేశంలోని గర్భిణీ స్త్రీలు అందరికీ ఆరు వేల రూపాయలు అందించాల్సి ఉంటుంది. అయితే దానికి స్వస్తి చెప్పిన కేంద్ర ప్రభుత్వం...ప్రసూతి ప్రయోజన పథకాన్ని తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం మార్చిలో రాజ్యసభకు అందజేసిన వివరాల ప్రకారం ఈ పథకం కింద 2024-25లో కేవలం 54 లక్షల మంది లబ్దిదారులకు మాత్రమే నగదు చెల్లించారు. 2022-23లో 73 లక్షల మంది లబ్దిదారులకు నగదు అందజేశారు. 2023-24లో మాత్రం కేవలం 22.5 లక్షల మంది మాత్రమే ప్రయోజనం పొందారు. దేశంలో ఏటా 270 లక్షల శిశు జననాలు జరుగుతున్నాయని అంచనా.

పెరగని కేటాయింపులు

సంవత్సరానికి 270 శిశు జననాలు జరుగుతుంటే అందులో 90 శాతం మంది శిశువుల తల్లులకు ఆరు వేల రూపాయల చొప్పున నగదు అందజేయాలంటే ప్రభుత్వానికి రూ.14,500 కోట్లు ఖర్చవుతుంది. అయితే ప్రసూతి ప్రయోజన పథకమైన ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై)కు గత కొన్ని సంవత్సరాలగా కేటాయింపులు రెండు వేల కోట్ల రూపాయలు దాటడం లేదు. లబ్దిదారులకు అందజేస్తున్న నగదు మొత్తాన్ని 2013 నుండి పెంచడం లేదు. వాస్తవానికి ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేస్తే అది మరింత తగ్గింది. ప్రసూతి ప్రయోజనాన్ని కనీసం రూ.12,000కు పెంచాలని ఆహార హక్కు కార్యకర్తలు కోరుతున్నారు.

సవాలక్ష నిబంధనలతో...

ఎన్ఎఫ్ఎస్ఏ కింద గర్భిణీ స్త్రీలు అందరూ ఆరు వేల రూపాయల చొప్పున ప్రయోజనం పొందుతారని 2017 ఏప్రిల్‌లో మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అయితే కేంద్రం దీనికి బదులు పీఎంఎంవీవైని అమలు చేసి ఆర్థిక ప్రయోజనాన్ని ఐదు లక్షల రూపాయలకు తగ్గించింది. అది కూడా మొదటి బిడ్డకే. రెండో బిడ్డ బాలిక అయితేనే సాయం లభిస్తుంది. పథకం అమలుకు ప్రభుత్వం అనేక షరతులు విధించింది. మొదటి విడత సాయంగా మూడు వేల రూపాయలు పొందాలంటే ప్రెగ్నెన్సీ నమోదు కావాల్సి ఉంటుంది. ఆరు నెలల లోపు గర్భ పరీక్ష చేయించుకోవాలి. రెండో విడత సాయంగా రెండు వేల రూపాయలు పొందాలంటే శిశు జననాన్ని నమోదు చేయించాలి. శిశువుకు వాక్సినేషన్ కూడా చేయించాల్సి ఉంటుంది. పైగా రేషన్ లేదా బీపీఎల్ కార్డు ఉన్న వారికే పథకం వర్తిస్తుంది. 18 సంవత్సరాల 7 నెలల కంటే తక్కువ వయసున్న మహిళకు ఈ పథకం వర్తించదు. ఆధార్ కార్డు, దానితో అనుసంధానించిన బ్యాంక్ లేదా పోస్టాఫీసు ఖాతా వివరాలు, మొబైల్ నెంబరు, అర్హతకు సంబంధించిన రుజువు వంటి అనేక పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

ఇలాంటి సవాలక్ష షరతుల కారణంగా అనేక మంది మహిళలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందలేకపోతున్నారు. 2023-24లో కేవలం 2.7 లక్షల మంది మహిళలు (ఒక శాతం) మాత్రమే రెండో విడత ఆర్థిక సాయం పొందారు. తమిళనాడు, ఒడిషా ప్రభుత్వాలు గర్భిణులకు వరుసగా రూ.18,000, రూ.10,000 అందజేస్తున్నాయి.

అన్నదాత దిగాలు..!

- అకాల వర్షంతో అవస్థలు

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు దిగుబడులు చేతికందే వేళ అకాల వర్షం, ఈదురుగాలులు కంటిమీద కునుకులేకుండా చేశాయి. దాళ్వా కోతలు ఊపందుకోవడంతో ఏ గ్రామానికి వెళ్లినా కల్లాల్లో, రోడ్లపై ధాన్యం ఆరబోసి, పంట నెలకొరిగి, నీళ్లలో వరిచేలు ఉన్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. తేమ శాతం తగ్గిన తరువాత మిల్లులకు తరలిస్తామని భావించిన రైతులు ఆదివారం ఒక్కసారిగా భారీ వర్షంతో పంటను రక్షించుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని సీతారామపురం, రుస్తుంబాద, యర్రంశెట్టి వారి పాలెం, లక్ష్మణేశ్వరం తదితర గ్రామాల్లో రోడ్లపైనే రైతులు ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ఎల్‌బి.చర్ల, మోడీ గ్రామాల్లో దర్భరేవు డ్రెయిన్‌లో నీరు లాగకపోవడంతో కోత కోసిన చేల్లో మోకాల్లోతు నీటిలోనే రైతులు పనులు చేయించుకుంటున్నారు. చేలల్లో మురుగు నీటిని బయటకు పంపే పరిస్థితి లేకపోవడంతో కోత మిషన్లు తిరగక కూలీలపైనే ఆధారపడిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

చక్కెర రోగులకు చేదు వార్త

- ఔషధ ఉత్పత్తిని నిలిపివేస్తున్న నోవో నార్డిస్క్
- 'హ్యూమన్ ఇన్సులిన్' సరఫరాకు స్వస్తి
- ఇక ప్రత్యామ్నాయాలు వెతకాల్సిందే
- కేంద్రంలో కానరాని స్పందన

న్యూఢిల్లీ : మధుమేహ వ్యాధి చికిత్స కోసం తాను ఉత్పత్తి చేస్తున్న ఔషధాన్ని దశల వారీగా తొలగించాలని డెన్మార్క్‌కు చెందిన బహుళజాతి ఫార్మా సంస్థ నోవో నార్డిస్క్ నిర్ణయించింది. దీనిపై మన దేశానికి చెందిన పలువురు మధుమేహ రోగులు తమ న్యాయవాదుల ద్వారా ఈ నెల ఐదవ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)కు ఓ లేఖ రాశారు. నోవో నార్డిస్క్ కంపెనీ నిర్ణయంపై అత్యవసరంగా చర్యలు చేపట్టాలని అందులో కోరారు. నోవో నార్డిస్క్ కంపెనీ పెన్ను రూపంలో 'హ్యూమన్ ఇన్సులిన్'ను ఉత్పత్తి చేస్తోంది. ఇది మధుమేహ రోగులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అయితే ఈ ఔషధం ఉత్పత్తిని నిలిపివేయాలని ఆ కంపెనీ నిర్ణయించింది. మన దేశంతో పాటు ప్రపంచ దేశాలలో ఇప్పుడు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను మాత్రమే విక్రయిస్తారు. అంటే ఇకపై ఈ మందు ఉత్పత్తి జరగదు.

రెండు రూపాలలో...

ఇన్సులిన్ రెండు రూపాలలో...హ్యూమన్, అనలాగ్... లభిస్తోంది. ఇవి రెండూ ఇంజక్షన్లే. ఇన్సులిన్ ఏ మాత్రం ఉత్పత్తి జరగని లేదా కొద్ది మోతాదులో ఉత్పత్తి అయ్యే రోగులను టైప్-1 డయాబెటిస్ రోగులుగా పరిగణిస్తారు. టైప్-2 రోగులలో ఇన్సులిన్ ఉత్పత్తి జరుగుతుంది కానీ అది అవసరమైన పరిమాణంలో ఉండదు. టైప్-1 రోగులు పూర్తిగా ఇంజక్షన్ పైనే ఆధారపడతారు. భోజనానికి 30-60 నిమిషాల ముందు హ్యూమన్ ఇన్సులిన్ ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అనలాగ్ రూపంలో ఉండే ఇన్సులిన్‌ను భోజనానికి ముందు...ఏ మాత్రం వేచిచూడకుండా తీసుకోవచ్చు. ఇది వేగంగా పనిచేస్తుంది. అయితే భారత్ వంటి వర్ధమాన దేశాలలో, కొన్ని ఆఫ్రికా దేశాలలో హ్యూమన్ ఇన్సులిన్‌నే ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎందుకంటే ఇది అనలాగ్ కంటే చౌకగా లభిస్తుంది.

చౌకగా లభించే వయల్స్

ఇన్సులిన్ పెన్నులు, వయల్స్ రూపాలలో దొరుకుతుంది. పెన్నులో ఇన్సులిన్‌ను ముందుగానే నింపుతారు. దానిని తీసుకున్న తర్వాత పారేయాల్సిందే. అందుకే వీటిని డిస్పోజబుల్ పెన్నులు అంటారు. వయల్స్ రూపంలో లభించే ఇంజక్షన్‌ను తిరిగి ఉపయోగించవచ్చు. అంటే దీనిలో ఇన్సులిన్‌ను అనేకసార్లు నింపవచ్చునన్న మాట. పెన్నులతో పోలిస్తే వయల్స్ చాలా చౌక. కానీ రోగులు సాధారణంగా పెన్నులనే ఇష్టపడతారు. ఏదేమైనా రాబోయే ఆరు నెలల కాలంలో పెన్నుల రూపంలో ఉండే హ్యూమన్ ఇన్సులిన్ క్రమేపీ అదృశ్యమవుతుంది. ఆ తర్వాత అది ఇక కన్పించవు. అయితే ఇన్సులిన్ వయల్ రూపంలో మాత్రం లభిస్తూనే ఉంటుంది.

ఏం చేయాలి?

ఇక రోగుల ముందు రెండు ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉంటాయి. హ్యూమన్ ఇన్సులిన్ పెన్నులను ఉపయోగిస్తున్న వారుఅనలాగ్ రూపానికి మారడం. అంటే వారు ఖరీదైన మందును కొనుగోలు చేయాల్సి ఉంటుంది. హ్యూమన్ రూపంలోని ఔషధాన్నే కొనసాగించాలని అనుకుంటే మాత్రం వయల్స్ లేదా సిరంజీలను వాడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ తన అత్యవసర మందుల జాబితాలో అనలాగ్ ఇన్సులిన్‌ను చేర్చాలని రోగుల తరఫున న్యాయవాదులు కోరుతున్నారు. ఎందుకంటే ఆ జాబితాలో చేర్చే ఔషధం ధరలు తగ్గుతాయి. రోగులు వయల్స్‌కు మారాలని అనుకుంటే పిల్లల పైనే ఎక్కువగా ప్రభావం పడుతుంది. ఎందుకంటే వారు సిరంజీలకు భయపడతారు. వృద్ధులు, దృష్టి లోపం ఉన్న వారు, సిరంజీలను ఉపయోగించడంలో ఇబ్బంది పడే వారికి కూడా సమస్యలు తప్పవు. పైగా సిరంజీల ద్వారా తీసుకునే వయల్స్ మోతాదులో హెచ్చుతగ్గులు ఉండవచ్చు.



'వెగోరీ' తయారీ కోసమే...

అధిక బరువును తగ్గించే వెగోవీ అనే ఔషధాన్ని ఉత్పత్తి చేయడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నందున మానవ ఇన్సులిన్ పెన్నులను దశల వారీగా తగ్గిస్తున్నట్లు నోవో నార్డిస్క్ కంపెనీ 2003 నవంబరులోనే ఒక ప్రకటన విడుదల చేసింది. మధుమేహానికి అధిక బరువు ప్రధాన కారణం కనుక వెగోవీ ఉత్పత్తిపై దృష్టి సారిస్తున్నామని తెలిపింది. అయితే ఇక్కడ ఓ విషయాన్ని గు ర్తించాలి. టైప్-1 డయాబెటిస్‌కు అధిక బరువు కారణంగా రాదు. అది ఆటో ఇమ్యూన్ డిజాస్టర్. టైప్-2 డయాబెటిస్‌కు మాత్రమే అధిక బరువుతో సంబంధం ఉంటుంది.

ప్రత్యామ్నాయాలు ఉన్నాయి

ఇన్సులిన్ మార్కెట్‌లో నోవో నార్డిస్క్‌దే అగ్రస్థానం. ఒక్క మన దేశంలోనే దాని మార్కెట్ రూ.4,500 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. అయితే నోవో నార్డిస్క్ నిర్ణయం కారణంగా రోగులకు ప్రత్యామ్నాయాలు ఏమిటనే ప్రశ్న ఉదయిస్తోంది. నోవో నార్డిస్క్‌తో పాటే కొన్ని ఇతర కంపెనీలు కూడా హ్యూమన్ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. బయోకాన్, ఎల్ లిలీ, సనోఫీ, ఎరిస్ లైఫ్ సైన్సెస్ అనేవి వీటిలో కొన్ని. అయితే వాటి ధరలు మారుతుంటాయి. నోవో నార్డిస్క్ వదిలేసిన ఖాళీని భర్తీ చేయాలంటే ఈ కంపెనీలన్నీ తమ ఉత్పత్తులను బాగా పెంచాల్సి ఉంటుంది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కొన్ని దేశాలు ఇప్పటికే తమ వైద్యులకు మార్గదర్శకాలు జారీ చేశాయి. భారత్‌లో మాత్రం ఎలాంటి సలహాలు, మార్గదర్శకాలు లేవు. మన దేశంలో 133 మిలియన్ల మంది డయాబెటిస్ రోగులు ఉన్నారు. ప్రపంచంలోని డయాబెటిస్ రోగులలో 30 శాతం మంది భారత్‌లోనే ఉండడం గమనార్హం. జన ఔషధి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అనలాగ్ ఇన్సులిన్‌ను సరఫరా చేయవచ్చునని వైద్య నిపుణులు సూచించారు. అనలాగ్ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలని వారు కోరారు.

బీహార్‌లో ఏకతాటిపైకి ప్రతిపక్షాలు

- ఎన్‌డిఎ ఓటమి కోసం ఉమ్మడి కృషి
- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి
- ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌తో సిపిఎం బృందం భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో ఎన్‌డిఎను ఓడించడానికి ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తున్నాయి. ఈ దిశగా ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి తెలిపారు. పాట్నాలో మహాఘట్బంధన్ సమన్వయ కమిటీ కన్వీనర్, ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్‌తో మంగళవారం సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ దావలే, బీహార్ రాష్ట్ర కార్యదర్శి లాలన్ చౌదరి, కేంద్ర కమిటీ సభ్యుడు అవధేష్ కుమార్, అసెంబ్లీలో సిపిఎం శాసనసభా పక్షనేత అజయ్ కుమార్‌తో కలిసి ఎంఎ బేబీ భేటీ అయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, శాసన ఎన్నికల గురించి సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎ బేబి మాట్లాడుతూ మహాఘట్‌బంధన్‌ను



సభలో మాట్లాడుతున్న ఎంఎ బేబి

బలోపేతం చేయడానికి వామపక్షాల కృషి కొనసాగుతుందని చెప్పారు.

సమన్వయంతో కూడిన ప్రతిపక్ష వ్యూహం అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. బీహార్‌లో ప్రభుత్వ మార్పు అనివార్యమని పేర్కొన్నారు. బిజెపి, సంఘ్ పరివార్ ప్రోత్సహిస్తున్న మతతత్వాన్ని ఓడించడానికి అన్ని లౌకిక పార్టీలు ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్ని ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా నిలవడంతో ప్రతిపక్షాల ఐక్యత, సంకల్పం స్పష్టమైందన్నారు. తేజస్వి యాదవ్ మాట్లాడుతూ బీహార్‌లో మహాఘట్‌బంధన్ సామరస్యంగా ముందుకు సాగుతోందన్నారు. సీట్ల చర్చలు పురోగమిస్తున్నాయని చెప్పారు. బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగడంపై ప్రజలకు ఆసక్తి లేదని తేజస్వి అన్నారు.

భోగేంద్ర యాదవ్ విగ్రహావిష్కరణ



ఈ బేటీకి ముందు మధుబని జిల్లా హుస్సేన్‌పూర్ గ్రామంలో సిపిఎం నాయకులు భోగేంద్ర యాదవ్ విగ్రహాన్ని ఎంఎ బేబి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో బేబి మాట్లాడుతూ మధుబని జిల్లాలో వామపక్షాల నేతృత్వంలో పోరాటాల అద్భుతమైన వారసత్వాన్ని ప్రస్తావించారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దారుణమైన దాడిని ఖండిస్తూ, ఉగ్రవాదానికి మతం లేదని నొక్కిచెప్పారు. అయితే ప్రజలను మతం పేరుతో రెచ్చగొట్టడానికి ఆర్‌ఎస్‌ఎస్‌-బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, రాష్ట్ర కార్యదర్శి లాలన్ చౌదరి, కేంద్ర కమిటీ సభ్యులు అవధేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎమ్మెల్యే అజయ్ కుమార్, రాంపరి దేవి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేష్ పాండే, ఆర్‌జెడి రాజ్యసభ ఎంపి ఫయాజ్ అహ్మద్, సిపిఎం నాయకులు మనోజ్ కుమార్ యాదవ్, షీలా దేవి తదితరులు ప్రసంగించారు.

నేడు పౌర రక్షణ మాక్ డ్రిల్స్

- వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించిన కేంద్ర హోం శాఖ కార్యదర్శి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బుధవారం నాడు పౌర రక్షణ మాక్ డ్రిల్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పాటించాల్సిన నిబంధనావళిపై మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సమీక్షించారు. అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, సివిల్ డిఫెన్స్ అధిపతులతో పాటు ఎన్‌డిఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్ డైరెక్టర్స్ జనరల్‌తో సహా పలు కీలక కేంద్ర బలగాలు, ఏజెన్సీ అధికారులు కూడా పాల్గొన్నారు. మాక్ డ్రిల్ ఏర్పాట్లలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని పలువురు ఈ సమావేశంలో వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే ఇలాంటివన్నీ అధికమించడానికి నిర్దేశిత ప్రోటోకాల్‌ను తుచ తప్పకుండా అమల్జేయాలని గోవింద్ మోహన్ సూచించినట్లుగా సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కాగా, ఈ నెల 7న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర హోంశాఖ సోమవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా గుర్తించిన 259 చోట్ల ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. శత్రు దేశాల దాడులు లేదా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొవాల్సివచ్చినప్పుడు పౌర రక్షణ యంత్రాంగాల సంసిద్ధతను అంచనా వేయడానికి, మెరుగుపరచ్చుడానికి మాక్ డ్రిల్ నిర్వహణ అత్యంత కీలకంగా భావిస్తారు. దేశంలో 1971 తరువాత ఇలాంటి మాక్ డ్రిల్స్‌ను నిర్వహించడం ఇదే తొలిసారి.

1971లో మాక్ డ్రిల్స్ ఇలా..!

దాదాపు 50 ఏళ్ల తర్వాత దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టడం గమనార్హం. కార్గిల్ యుద్ధం అప్పుడు జరిగినా.. అవి సరిహద్దు జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ వంటి సరిహద్దు రాష్ట్రాలకే పరిమితమయ్యాయి. ఈసారి మాత్రం దేశవ్యాప్తంగా కీలక ప్రదేశాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. 1971లో తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్తాన్‌తో పోరాడాల్సి రావడంతో దేశ వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేశారు. అంతకుముందు 1962, 65 యుద్ధాల సమయంలో కూడా నిర్వహించారు. 1971లో మాక్ డ్రిల్స్ అనుభవాన్ని సీనియర్ జర్నలిస్టు మధురేంద్ర ప్రసాద్ సిన్హా ఓ మీడియా సంస్థతో పంచుకొన్నారు. యుద్ధానికి సరిగ్గా రెండు నుంచి నాలుగు రోజుల ముందు ఈ డ్రిల్స్ మొదలుపెట్టారని.. తూర్పు పాకిస్తాన్‌లో లెఫ్టినెంట్ జనరల్ ఎఎకె నియాజీ ఢాకాలో లొంగుబాటు పత్రంపై సంతకం చేసే వరకు వీటిని కొనసాగించారన్నారు. నాడు రాత్రి 6:30 కల్లా ప్రతి ఒక్కరూ ఇళ్లకు చేరుకొనేవారన్నారు. సైరన్ వినిపించగానే ప్రతి ఒక్కరూ లైట్లు ఆర్పేసి.. ఇంట్లో సురక్షిత స్థానాల్లో దాక్కొనేవారమని పేర్కొన్నారు. ఆ సమయాల్లో పెద్దగా మాట్లాడటం కూడా చేసేవారు కాదు. ఆర్కే శర్మ అనే రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి తన అనుభవాలు చెబుతూ.. నాడు సైరన్ వినిపించగానే నేలపై పడుకొని.. చెవులు గట్టిగా మూసుకొనేవారమన్నారు.

2027 ప్రారంభంలో గగన్‌యాన్

- ఇస్రో చైర్మన్ వి నారాయణన్



న్యూఢిల్లీ : భారత్ తొలి మానవ సహిత అంతరిక్ష నౌక గగన్‌యాన్ ప్రయోగం మళ్లీ వాయిదా పడింది. గగన్‌యాన్ ప్రయోగం 2027 మొదటి త్రైమాసికంలో నిర్వహించనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ వి. నారాయణన్ న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అంటే ముందుగా ప్రకటించిన దాని కంటే ఐదేళ్ళ ఆలస్యంగా గగన్‌యాన్ ప్రయోగం జరగనుంది. గగన్‌యాన్ ప్రాజెక్టు యొక్క మొదటి అన్‌క్రూడ్ మిషన్ ఈ ఏడాది చివర్లో ప్రారంభమవుతుందని, దీని తరువాత 2026లో ఇలాంటివి మరో రెండు మిషన్లు ఉంటాయని చెప్పారు. మొదటి సిబ్బందితో కూడిన తొలి మిషన్ 2027 మొదటి త్రైమాసికం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. దీనికి ముందు మానవ రహిత మిషన్‌లో భాగంగా హాఫ్-హ్యూమనాయిడ్ రోబోట్ వ్యోమ్‌మిత్రను ఇస్రో రోదసిలోకి పంపుతుందని తెలిపారు. కాగా, ఇస్రో చైర్మన్ తాజా ప్రకటన ప్రకార గగన్‌యాన్ ప్రయోగం అసలైన షెడ్యూల్ ప్రకారం దాదాపు ఐదు సంవత్సరాలు ఆలస్యమవుతుంది. 2018 ఆగస్టు 15న ఎర్రకోట వద్ద నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ 2022లో గగన్‌యాన్‌ను ప్రయోగిస్తామని ప్రకటించారు. అయితే తరువాత కరోనా మహమ్మారి విజృంభణ కారణంతో వ్యోమగాములకు శిక్షణ ఇవ్వడంలో జాప్యం, మిషన్‌కు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాలను సాధించడంలో జాప్యం జరిగింది. తరువాత ఈ గగన్‌యాన్ మిషన్ 2025లో జరుగుతుందని భావించారు. అయితే 2026లో ప్రయోగిస్తామని ఇస్రో తెలిపింది.

అది ఇప్పుడు 2027 మొదటి త్రైమాసికానికి ఆలస్యం అయింది. మంగళవారం నారాయణన్ మాట్లాడుతూ 'గగన్‌యాన్ ప్రయోగం చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. మనం మొదటిసారిగా దీన్ని నిర్వహిస్తున్నాం. 90 శాతం పని పూర్తయింది. మేం అర్హత యొక్క చివరి దశలో ఉన్నాం' తెలిపారు. గగన్‌యాన్ ప్రయోగం విజయవంతమయితే స్వతంత్రంగా మానవులను అంతరిక్షంలోకి పంపిన నాల్గో దేశంగా భారత్ రికార్డుసృష్టిస్తుంది. ఇప్పటి వరకూ రష్యా, అమెరికా, చైనా మాత్రమే ఈ ఘనత సాధించాయి.

ఓఎంసి కేసులో కొన్ని ముఖ్యాంశాలు..

ప్రజాశక్తి- హైదరాబాద్

- 2007 జూన్ 18న ఓఎంసికి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న సిబిఐ కేసు నమోదు చేసింది.
- ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం..ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్లపాటు విచారణ కొనసాగింది. కేసు దర్యాప్తుకే ఐదేళ్ల పట్టింది. 2009 నుంచి 2014 వరకు సిబిఐ నాలుగు ఛార్జిషీట్లను దాఖలు చేసింది.
- ఓఎంసి వ్యవహారంలో 2011లో ఛార్జిషీట్‌ను తొలిసారి వేయగా.. 2014లో తుది ఛార్జిషీట్ తర్వాత సుదీర్ఘంగా విచారణ జరిగింది. 219 మంది సాక్షులను విచారించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సిబిఐ సేకరించింది.
- అనంతపురంలోని ఓబుళాపురంలో గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సిబిఐ ఆధారాలు సేకరించింది. అక్రమంగా తవ్వకాలు, రవాణా, ఎగుమతులు, విక్రయాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు సిబిఐ గుర్తించింది. ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి ఆధారాలు, సాక్ష్యాలు సేకరించి 2014లో తుది ఛార్జిషీట్ దాఖలైంది.
- విదేశాలకు అక్రమంగా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, అక్రమ బినామీ లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని సిబిఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది.
- ఈ కేసు విచారణలో మొత్తంగా 3,337 డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సిబిఐ గుర్తించింది.
- ఈ కేసులో విచారణ దశలోనే నిందితుడు లింగారెడ్డి మృతి చెందారు. ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది.

కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కా : సబితా ఇంద్రారెడ్డి

ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను సిబిఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించిన న్యాయ వ్యవస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసు విషయంలో పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఎన్ని అపవాదులు వచ్చినా తన నియోజకవర్గ ప్రజలు మాత్రం తనకు అండగా నిలిచారన్నారు. ఈ తీర్పు అనంతరం ఆమె కోర్టు వద్ద మీడియాతో మాట్లాడారు.

ఉగ్రదాడులపై మోడీకి ముందే సమాచారం

- నిఘా సంస్థలు హెచ్చరించినా చర్యలు మృగ్యం
- ప్రధాని మోడీ తీరుపై ఖర్గే విమర్శలు



రాంచి : జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడులకు పాల్పడే ప్రమాదముందని నిఘా సంస్థలు ముందుగానే హెచ్చరించినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించిందని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రత్యేకించి పహల్గాం దాడికి సంబంధించి ప్రధాని మోడీకి నిఘా వర్గాలు ముందే హెచ్చరించాయని, ఆయన స్వీయ పర్యటను వాయిదా వేసుకున్నారే మినహా ప్రజల భద్రతను పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బీహార్ ప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో రాంచిలో నిర్వహించిన 'సంవిధాన్ బచావో' సభలో ఖర్గే ప్రసంగించారు. ఉగ్ర దాడులు జరుగుతాయని నిఘా వర్గాల సమాచారముందన్న కథనాలను ప్రస్తావించిన ఖర్గే..ముందుగానే సమాచారం ఉన్నప్పుడు భద్రతను పటిష్టం చేస్తూ ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. పహల్గాం దాడికి మూడు రోజులు ముందుగా నిఘా వర్గాల సమాచారం వచ్చినందునే ప్రధాని మోడీ తన కాశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఖర్గే పేర్కొన్నారు. మోడీని ఉద్దేశించి ఆయన వరుస ప్రశ్నలు సంధించారు. 'మీకు (మోడీ) ముందుగానే పరిస్థితి గురించి సమాచారం తెలిసినట్లైతే, అదే విషయాన్ని మీ నిఘా బృందానికి, భద్రతా వర్గాలకు, కాశ్మీర్ పోలీసులకు, బిఎస్‌ఎఫ్ బృందాలకు ఎందుకు తెలియచేయలేదు. ప్రజల భద్రతకు హామీ ఎందుకు కల్పించలేదు." అని ఖర్గే ప్రశ్నించారు. భద్రతా వైఫల్యం వుందని అఖిల పక్ష సమావేశంలో మోడీ సర్కార్ అంగీకరించిందని, ఈ దాడిలో కోల్పోయిన ప్రాణాలకు కూడా బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఏప్రిల్ 19న కాత్రా నుండి శ్రీనగర్‌కు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని మోడీ ప్రారంభించాల్సి వుంది. ఒక పౌరుడిగా తాను, పాకిస్తాన్‌పై ప్రభుత్వం చేసే పోరాటానికి మద్దతునిస్తానని ఖర్గే చెప్పారు. అయితే ప్రజల ప్రాణాల గురించి ప్రభుత్వానికి పట్టడంలేదని విమర్శించారు.

కర్రెగుట్టలపై మరో ఎన్‌కౌంటర్

- మహిళా మావోయిస్టు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా దండకారణ్యం కర్రెగుట్టలపై మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందారు. మహిళ మృతదేహంతోపాటు 303 రైఫిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్రెగుట్టలపై గత 15 రోజులుగా జరుగుతున్న గాలింపు చర్యల కారణంగా మావోయిస్టుల వందలాది రహస్య స్థావరాలను, బంకర్లను గుర్తించారు. మావోయిస్టు స్థావరాలను నుంచి వేల కిలోల పేలుడు పదార్థాలు, నిత్యావసర వస్తువులు, డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. పలు చోట్ల జరిగిన ఐఇడి పేలుడు ఘటనలో నలుగురు జవాన్లు గాయపడ్డారు. గాయపడిన సైనికుల ఆరోగ్య కుదుట పడిందని పోలీసు అధికారులు తెలిపారు. గాయపడిన సైనికులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ప్రత్యామ్నాయం చూపకపోతే మరో పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

తీర్పు ఇచ్చిందని, అది మీకు తెలియదా? అని ప్రశ్నించారు. చట్టాన్ని ఉల్లంఘించి పేదల ఇళ్లను కూల్చే అధికారులు భవిష్యత్‌లో చట్టప్రకారం శిక్షార్హులన్నారు. ఉండిలో రఘురామకృష్ణరాజే కోర్టు, పోలీసు, అధికారిగా వ్యవహరిస్తున్నారని, అధికారులు ఆయనకు దాసోహం అంటున్నారని శ్రీనివాసరావు విమర్శించారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో ఉన్న నగర్‌లో ఇళ్లను కూల్చిన ఎంఎల్‌ఎ ఇప్పుడు అల్లూరి స్వగ్రామం మోగల్లులో కూడా పేదల ఇళ్లపై దౌర్జన్యానికి దిగడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యానికి కారణాలు ఏమిటో ముందు పరిశీలించాలని, ఎఎస్‌ఆర్ నగర్‌లో నీటి కాలుష్యంపై ఎక్కడ పరీక్షించారని ప్రశ్నించారు. పేదలకు ఇళ్లు కట్టించి, ప్రత్యామ్నాయం చూపిస్తే వారే ఇల్లు ఖాళీ చేస్తారని, ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడం సబబు కాదని అన్నారు. ఇప్పటికైనా పేదల ఇళ్ల కూల్చివేతను ఆపితే ఇది ముగింపు సభ అవుతుందని, లేదంటే ఇదే ఉద్యమ ప్రారంభ సభగా మారుతుందని హెచ్చరించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ పేదల ఇళ్లు కూల్చుతూ సర్దుకుపోవాలని ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు అంటున్నారని, ఆయన భూస్వామి కాబట్టి పేదల ఇబ్బందులు ఏమీ తెలీదని అన్నారు. జిల్లాలో కాలుష్యానికి కారణాలు పరిశ్రమలు తప్ప పేదల ఇళ్లు కాదని తెలిపారు. పేదల ఇళ్ల తొలగింపు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, భూస్వాములకు దోచిపెట్టడానికే తప్ప అభివృద్ధికి కాదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ఎంఎల్‌ఎ గత ఏడు నెలల్లో సుమారు 800 ఇళ్లు, రెండొందలు దుకాణాలను కూల్చివేయించారని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ గోదావరి జలాలు ఏ విధంగా కలుషితమవుతున్నాయో అనేకమంది ప్రముఖులు చెబుతున్నారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఎంఎల్‌ఎ అనుచిత వ్యాఖ్యలను సిపిఐ ఖండిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్‌రాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అంటే ఏమిటో అర్థం తెలియని వాళ్లు ఎంఎల్‌ఎ అయ్యారని ఉండిలో నిరూపణైందన్నారు. మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని చట్టాలు చెబుతున్నాయనే విషయం ఎంఎల్‌ఎకు తెలియదా అని ప్రశ్నించారు. బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎం.రత్నరాజు, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ పేదలపై బుల్డోజర్ల రాజకీయాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. పివి.రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, ఎపి బహుజన జెఎసి ఫౌండర్, చైర్మన్ తాళ్లూరి మధు మాట్లాడుతూ పర్యావరణం పేరుతో పేదల ఇళ్లు కూల్చడం అభివృద్ధా అని ప్రశ్నించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనా జోసెఫ్ మాట్లాడుతూ పేదలకు అండగా ఉండాల్సిన అధికారులు ఎంఎల్‌ఎకు అండగా నిలుస్తున్నారని విమర్శించారు. సభలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి దండు శ్రీనివాస్‌రాజు, ఎంసిపిఐ (యు) జిల్లా నాయకులు రాంబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

అందరూ అంగన్‌వాడీ వర్కర్లే

- మినీ వర్కర్లను ప్రమోట్ చేసిన తెలంగాణ సర్కారు
- మా పోరాట ఫలితంగానే జిఒ.. : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన ఒక్కొక్క హామీని తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చుకుంటూ వస్తున్నది. తాజాగా మినీ అంగన్‌వాడీ వర్కర్లకు శుభవార్త తెలిపింది. 3989 మినీ అంగన్‌వాడీ వర్కర్లను మెయిన్ అంగన్‌వాడీ వర్కర్లుగా ప్రమోట్ చేస్తూ జిఒ నెంబర్ 306ని జారీ చేసింది. ఇక నుంచి మినీ, మెయిన్ అంగన్‌వాడీ అన్న తేడా లేకుండా ఇకపై అందరూ అంగన్‌వాడీ వర్కర్లేనని స్పష్టం చేసింది. ఈ నెల నుంచే అది అమల్లోకి రానున్నది. ఇప్పటివరకూ మినీ అంగన్‌వాడీలకు రూ.7800ని ఇస్తున్నది. ఇక నుంచి వారికి నెలకు రూ.13,650 ఇవ్వనుంది. సాంకేతిక సమస్యలు, న్యాయపరమైన చిక్కుల వల్ల ఇంతకాలం ఆలస్యమైనట్టు ప్రభుత్వం పేర్కొంది. తమను మెయిన్ అంగన్‌వాడీ వర్కర్లుగా ప్రమోట్ చేయడంపై మినీ అంగన్‌వాడీ వర్కర్లు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉగ్రదాడి బాధిత కుటుంబానికి రాహుల్ పరామర్శ

చండీగఢ్ : పహల్గాం ఉగ్రదాడిలో కన్నుమూసిన నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరామర్శించారు. హర్యానాలోని నర్వాల్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భారత్ వైపు మళ్లీ ఎవరూ కన్నెత్తి చూడని విధంగా పహల్గాం దోషులను శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం విషయంలో కేంద్రానికి ప్రతిపక్షం తరపున పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

కొత్త రేషన్ కార్డులకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రైస్ కార్డులను జారీ చేస్తామని, ఆ కార్డులపై కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయన్నారు. స్మార్ట్ కార్డును స్కాన్ చేయగానే అన్ని వివరాలూ కనిపిస్తాయని, డేటా బేస్‌కు ఈ కార్డును లింక్ చేయడంతో సిస్టమ్‌లో ఆటోమెటిక్‌గా డాటా కూడా అప్‌డేట్ అవుతుందన్నారు. అలాగే ఈ నెల 4న పడిన అకాల వర్షంతో ఉభయ గోదావరి జిల్లాల్లో దాదాపు 7 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైందని, పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జూన్ 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 41 వేల ప్రభుత్వ పాఠశాలలకు, 4 వేల సంక్షేమ వసతి గృహాలకు ఫైన్ క్వాలిటీ రైస్ 25 కిలోల బ్యాగ్‌ల ద్వారా నెలనెలా పంపిణీ చేస్తామని మంత్రి నాదెండ్ల తెలిపారు. ఈ సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనరు సౌరబ్‌గౌర్ పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలతో సామాన్యులు విలవిల

- అమెరికా ప్రజలపై ఏడాదికి రూ.3.3 లక్షల అదనపు భారం
- పలు గ్రూపుల విశ్లేషణలు




న్యూయార్క్ : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తన సన్నిహిత మిత్రుడు, టెస్లా అధినేత ఎలన్ మస్క్‌తో కలిసి తీసుకుంటున్న వినాశకర నిర్ణయాలతో ఆ దేశ ప్రజానీకం సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విదేశీ ఉత్పత్తులపై ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల అమెరికన్ల ఖర్చులు అమాంతంగా పెరిగిపోతున్నాయి. సామాన్య ప్రజలను, వ్యాపారస్తులను, స్టాక్ మార్కెట్లను సైతం టారిఫ్‌లు బెంబేలెత్తిస్తున్నాయి. ఈ అనాలోచిత సుంకాల కారణంగా అమెరికాలోని సాధారణ ప్రజల కుటుంబాలపై ఒక్కొ కుంటుంపై సగటున ఏడాదికి రూ.3.3 లక్షలు చొప్పున అదనంగా భారం పడనుంది. ఈ మేరకు పలు సంస్థలు అంచనాలు వేశాయి.

న్యూయార్క్‌కు చెందిన డెమోక్రాట్ నేత, అమెరికా సెనెట్ మైనారిటీ నేత చుక్ షుమర్ మాట్లాడుతూ, సుంకాల వల్ల ప్రజల ఖర్చులు పెరుగుతాయని ట్రంప్ ఎన్నడూ ఓటర్లకు పూర్తిగా వివరించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ టారిఫ్‌లతో అమెరికన్ల ఖర్చులు పెరుగుతాయని, సగటున ఏడాదికి నాలుగు వేల డాలర్లు (దాదాపు రూ.3.3 లక్షలు) చొప్పున ఒక్కొ కుటుంబంపై అదనంగా భారం పడుతుందని ఆయన వాపోయారు.


రాజకీయ సైద్ధాంతికంగా వేర్వేరు భావజాలాలు కలిగిన ఐదు గ్రూపులు యాలే బడ్జెట్ ల్యాబ్, అమెరికన్ యాక్షన్ ఫోరం, ట్యాక్స్ ఫౌండేషన్, అర్బన్ ఇన్‌స్టిట్యూట్ బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్ ట్యాక్స్ పాలసీ సెంటర్; సిఎన్‌ఎన్ వార్తా సంస్థ ఈ అంచనాలను వెల్లడించాయి. అయితే ఇవన్నీ కూడా కెనడా, మెక్సికో సహా వివిధ దేశాలపై సగటున 10 శాతం టారిఫ్‌లను పెంచుతూ ఈ ఏడాది ఏప్రిల్ 2న ట్రంప్ చేసిన ప్రకటనల ప్రభావాన్ని అనుసరించి లెక్కగట్టిన అంచనాలు. దేశాల వారీగా ట్రంప్ ప్రకటించిన అధిక టారిఫ్‌ల ప్రభావాన్ని ఈ అంచనాల్లో లెక్కలోకి తీసుకోలేదు. అవి కూడా కలిపితే అమెరికన్లు భారీ మూల్యమే చెల్లించుకోవాల్సివుంటుందని ఐదు గ్రూపులు హెచ్చరించాయి. ఈ ఐదు సంస్థలు అదనపు భారంపై వేసిన అంచనాలు ఏడాదికి 3,100 నుండి 4,900 డాలర్లు వరకు వున్నాయి. వీటి సగటును తీసుకుంటే షుమర్ చెప్పిన 4 వేల డాలర్లు వుంటుంది. ఇక ఐదవ గ్రూపు అంచనా అయితే 1243 డాలర్లు మేరకు అదనపు భారం వుంటుందని పేర్కొంది. ఈ టారిఫ్‌లు దేశ ఆర్థిక వ్యవస్థలో ఏ మేరకు చొచ్చుకుపోతాయనే అంశంపై వివిధ గ్రూపులు వివిధ రకాలుగా అంచనాలు వేశాయి. దాన్ని బట్టే వ్యయం అంచనాలు కూడా వున్నాయి. ఏప్రిల్ 2కు ముందు ట్రంప్ విధించిన టారిఫ్‌ల ప్రాతిపదికనే ఈ అంచనాలు వేశారు. అంటే అన్ని దేశాల ఉత్పత్తులపై 10 శాతం సుంకాలు, చైనా ఉత్పత్తులపై మాత్రం 145 శాతం టారిఫ్‌లు వుంటాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వాటి ఆధారంగానే ఈ గ్రూపులు అంచనా వేశాయి. ప్రధానంగా తక్కువ ఆదాయ కుటుంబాలు బాగా దెబ్బతింటాయని విశ్లేషణల్లో వెల్లడైంది. అలాగే జీవన నాణ్యత కూడా దెబ్బతింటుందని, ప్రజలు ఖర్చును భరించేలక నాసిరకం ఉత్పత్తుల వైపే మొగ్గు చూపుతారని భావిస్తున్నారు.

జర్మనీ ఛాన్సలర్‌గా ఫ్రెడరిక్ మెర్జ్ విజయం



బెర్లిన్ : జర్మనీ ఛాన్సలర్‌గా కన్జర్వేటివ్ నేత, క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ (సిడియు) అభ్యర్థి ఫ్రెడరిక్ మెర్జ్ మంగళవారం ఎన్నికయ్యారు. పార్లమెంట్‌లో రెండో రౌండ్‌లో జరిగిన ఓటింగ్‌లో ఆయన గెలుపొందారు. తొలి రౌండ్‌లో పూర్తి మెజారిటీకి 316 ఓట్లు అవసరం కాగా, ఫ్రెడరిక్ మెర్జ్‌కు ఆరు ఓట్లు తక్కువగా 310 ఓట్లే లభించాయి. 325మంది సభ్యులు గల పార్లమెంట్‌లో ఈసారి ఆయనకు 325ఓట్లు లభించాయి. పార్లమెంట్‌లో స్వంత సంకీర్ణ కూటమికి 328 సీట్లు వున్నందున గెలుపు సులభమేనని భావించిన తరుణంలో అందుకు విరుద్ధంగా ఓటమిని చవి చూడాల్సి వచ్చింది. మొదటి రౌండ్‌లో రహస్య ఓటింగ్ జరగ్గా ఆయన ఓడిపోయారు. రెండో రౌండ్‌లో 325 ఓట్లు గెలిచి జర్మనీ 10వ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

అమెరికా ఆంక్షలపై వెనిజులా అధ్యక్షుని ఆగ్రహం



కారకస్ : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ఆంక్షల పట్ల వెనిజులా అధ్యక్షులు నికొలస్ మదురో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ అమలు చేస్తున్న విధానాల వల్ల వెనిజులాలో తమ కంపెనీ కార్యకలాపాలు ప్రభావితమవుతున్నాయని, దీనివల్ల వెనిజులా నుండి తమ కంపెనీ వైదొలగితే అమెరికా ఇంధన భద్రతకు ముప్పు కలుగుతుందని చెవ్‌రాన్ సిఇఒ మైక్ విర్త్ హెచ్చరించారు. ఆ నేపథ్యంలో మదురో స్పందిస్తూ, అమెరికా, వెనిజులాల్లో మితవాద శక్తులు, సంస్థలు విధించే ఆంక్షల కారణంగా వాస్తవ నష్టం చెవ్‌రాన్ కంపెనీకి కలుగుతుందని మదురో పేర్కొన్నారు. వెనిజులాలోని ఫాసిస్ట్ మితవాద రంగాలు, అమెరికాలోని తీవ్రవాద రంగాలు ఈ ఆంక్షలను విధించాయని మదురో గుర్తు చేసుకున్నారు. వీటివల్ల రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం వుంటుందని, పైగా చెవ్‌రాన్ కంపెనీకి కూడా నష్టం జరుగుతుందన్నారు. ఈ చర్యలన్నీ అర్థం లేనివని మదురో తీవ్రంగా విమర్శించారు. చమురు దిగ్గజ కంపెనీతో ఒప్పందాన్ని ఉల్లంఘించేందుకు ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ తీవ్రంగా వ్యాఖ్యలు చేశారు. ఈ కంపెనీతో తాము కుదుర్చుకున్న ఒప్పందాలను గౌరవిస్తామని మదురో పునరుద్ఘాటించారు. చమురు ఉత్పత్తిని పెంచుతామని హామీ ఇచ్చారు. ట్రంప్ ప్రభుత్వం అర్ధంతరంగా తీసుకుంటున్న చర్యల వల్ల వెనిజులాలోకంపెనీ కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని మైక్ విర్త్ ఆందోళన వ్యక్తం చేశారు. మరింత సుస్థిరమైన, శాశ్వతమైన ఇంధన విధానం తీసుకురావాలని ఆయన అమెరికా ప్రభుత్వాన్ని కోరారు.


రిజర్వేషన్ రైలు కంపార్ట్‌మెంట్ లాంటిది

- సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని కుల ఆధారిత రిజర్వేషన్ వ్యవస్థను రైలు బోగీల్లాంటివని సుప్రీంకోర్టు అభివర్ణించింది. మంగళవారం మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబిసి రిజర్వేషన్లకు సంబంధించిన పిటిషన్ విచారణలో సుప్రీంకోర్టు జస్టిస్ సూర్యకాంత్ రిజర్వేషన్లను "రైలు కంపార్ట్‌మెంట్"తో పోల్చారు. రైలు బోగీల్లో అప్పటికే సీట్లు పొందిన వ్యక్తులు ఇతరులు ప్రవేశించకూడదని కోరుకుంటారని, రిజర్వేషన్లు పొందిన వ్యక్తులు, సమూహాలు కూడా ఇతరులకు రిజర్వేషన్లు దక్కకూడదని అనుకుంటారని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

మంగళవారం వాదనలో మహారాష్ట్రలో రాజకీయంగా వెనుకబడిన, సామాజికంగా వెనుకబడిన తరగతులను గుర్తించాలని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదించారు. బాంథియా కమిషన్ ఒబిసిలు రాజకీయంగా వెనుకబడినవారని చెప్పకుండానే వారికి ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించిందని శంకరనారాయణన్ అన్నారు. ఒబిసిలకు సంబంధించిన డేటా ఉన్నప్పటికీ, దానిని ప్రభుత్వం ఉపయోగించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అధికారుల ద్వారా స్థానిక సంస్థలను ఏకపక్షంగా నడుపుతోందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందేందుకు ఒబిసిలలోనే వెనకబడిన వారిని గుర్తించాలని వాదించారు. దీనిపై జోక్యం చేసుకున్న జస్టిస్ సూర్యకాంత్ "విషయం ఏమిటంటే, ఈ దేశంలో రిజర్వేషన్ వ్యాపారం రైల్వే లాగా మారింది. కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన వారు మరెవరూ ప్రవేశించకూడదని కోరుకుంటారు. అదే మొత్తం ఆట. పిటిషనర్ కూడా అదే ఆట" అని అన్నారు. రిజర్వేషన్ల ప్రయోజనాలను కోల్పోకుండా చూడ్డానికి ప్రభుత్వాలు మరిన్ని తరగతులను గుర్తించాల్సిన అవసరం ఉందని, ఈ వర్గీకరణ ఒక నిర్దిష్ట కుటుంబం లేదా సమూహాలకు పరిమితం కాకూడదని పేర్కొన్నారు. మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు 2016-17లో జరిగాయి. అప్పటి నుంచి ఈ ఎన్నికలు ఆలస్యమవుతూ వస్తున్నాయి. ఈ ఆలస్యం కావడానికి ప్రధాన కారణం ఒబిసి అభ్యర్థుల కోటాపై జరిగిన న్యాయ పోరాటం. ఒబిసిలకు 27 శాతం కోటా అమలు చేయడానికి 2021లో మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనం చిక్కులను విచారించడానికి ఒక ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని పేర్కొంది. మహారాష్ట్ర రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను 4 వారాల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలను ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఒబిసి రిజర్వేషన్ల సమస్య కారణంగా మహారాష్ట్రలో చాలా కాలంగా జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను మరింత ఆలస్యం చేయలేమని ధర్మాసనం పేర్కొంది. 2022 నివేదికకు ముందు రాష్ట్రంలో ఉన్న విధంగా ఒబిసి వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వబడతాయి.



నిజమైన స్నేహితుడు



ఇద్దరు స్నేహితులు సెలవురోజు ఊరు వెలుపల షికారుకెళ్లారు. తోవలో మాట్లాడుకుంటూ ఏదో విషయంపై అభిప్రాయం కుదరక ఇద్దరూ వాదించుకున్నారు. వాదన ఎక్కువై మొదటివాడు, రెండోవాడిని చెంపపై కొట్టాడు. దెబ్బతిన్నవాడు అక్కడున్న ఇసుకపై 'ఈ రోజు నా స్నేహితుడు నా చెంపపై కొట్టాడు' అని రాశాడు. మళ్లీ ఇద్దరూ ముందుకు నడిచారు.

మరి కొంత దూరం వెళ్లాక ఇద్దరికీ దాహం వేసి ఓ మడుగు దగ్గరకు వెళ్లారు. చెంపదెబ్బ తిన్న మిత్రుడు ముందు నీళ్లలోకి దిగాడు. అక్కడ ఊబి ఉంది. అతడు ఊబిలోకి కూరుకుపోతుండగా గట్టు మీద ఉన్న మొదటి మిత్రుడు కర్ర సాయంతో అతన్ని బయటకు లాగాడు. బయటకి వచ్చిన రెండో మిత్రుడు అక్కడ ఉన్న ఓ బండరాయిపై 'ఈ రోజు నా మిత్రుడు, ప్రమాదం నుండి నన్ను కాపాడాడు' అని రాశాడు.

మొదటి విషయాన్ని ఇసుకపై, రెండోదాన్ని రాయిపై ఎందుకు రాశావని మొదటివాడు అడిగాడు. 'ఇసుకపై ఏదైనా రాస్తే గాలి వీచి, కాసేపటికి చెరిగిపోతుంది. స్నేహితుల పొరపాట్లను మనసులో నిలుపుకోకూడదు. అందుకే అలా రాశాను. అదే సహాయం చేస్తే శాశ్వతంగా గుర్తుంచుకోవాలి. అందుకే రాయిపై రాశాను' అని చెప్పాడు.

నీతి : స్నేహితులే కాదు, ఎవరు తప్పు చేసినా క్షమించి మరిచిపోవాలి. వారు చేసిన సాయం మాత్రం కలకాలం గుర్తుంచుకోవాలి.



**- యు.రుష్మిక,
6వ తరగతి, గీతాంజలి హైస్కూలు,
రంగాపురం, రెడ్డిగూడెం మండలం,
ఎన్‌టిఆర్ జిల్లా,
98853 04643.**

వేసవి పతంగి



నందనవనం ఊరిలో రాజేష్ అనే పిల్లవాడు ఉన్నాడు. అతను ఆరవ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల్లో పతంగి ఎగురవేయాలని ఎప్పటినుండో అనుకున్నాడు. సెలవులు ఇవ్వగానే పతంగి కొనుక్కొని బంగ్లా పైకి వెళ్ళాడు. దానికి దారం లేదు. పతంగి ఎగరాలంటే దారం ఉండాలని రాజేష్ ఫ్రెండ్స్ చెప్పారు. రాజేష్ వాళ్ల నాన్న దగ్గరికి వెళ్లాడు. 'నాన్న, నాకు దారం కొనివ్వవా? లేకపోతే కావలసిన డబ్బులు ఇవ్వవా. నేనే తెచ్చుకుంటాను' అని అడిగాడు.

'వద్దు బాబు, పతంగి ఎగురవేయడం కంటే పిండి వంటకాలు చేసుకొని తిందాము. సరేనా!' అన్నాడు నాన్న. రాజేష్ నాన్నని ఎంతో బతిమాలాడు. ఇక చేసేదేమీ లేక, 'సరే ,తెచ్చుకో' అని నాన్న అనగానే రాజేశ్ పరుగున దుకాణానికి వెళ్లి దారం తెచ్చుకున్నాడు. అది మార్కెట్లోకి కొత్తగా వచ్చిన మాంజా. అది ప్రమాదరకరమని రాజేష్‌కి తెలియదు. దాన్ని చూడగానే రాజేష్ వాళ్ల నాన్న బాగా కోప్పడ్డాడు. 'ఆ దారంతో అజాగ్రత్తగా ఉంటే చేతులు, మెడలు కోస్తుంది. దీనితో పతంగి ఎగురవేయవద్ద'ని చెప్పాడు. కానీ రాజేష్ పతంగి ఎగురవేసాడు. అనుకోకుండా దారం రాజేష్ చేయికి తగిలి చేయి తెగి రక్తం కారింది. రాజేష్ బాగా ఏడ్చాడు.

రాజేష్ ఏడుపు విని అతని నాన్న బంగ్లా పైకి వచ్చి చూసాడు. 'చూసావా రాజేష్, ఈ దారం చాలా ప్రమాదకరమని ముందే చెప్పాను కదా' అని రాజేష్‌ను ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చిన తర్వాత రాజేష్ నాన్నతో 'నాన్న, ఇక నుండి మీరు చెప్పినట్లు వింటాను. మీరు వద్దని చెప్పిన పని ఎప్పుడూ చేయను' అన్నాడు. రాజేష్ తన తప్పు తెలుసుకున్నందుకు నాన్న ఎంతో సంతోషించాడు.



**- బి.విశ్వ తేజ,
ఆరవ తరగతి,
జిల్లా పరిషత్
ఉన్నత పాఠశాల,
అనంత సాగర్,
సిద్ధిపేట జిల్లా,
99590 07914**

బొమ్మల కొలువు





**విఘ్నేష్,
యుకేజీ,
యశోద ప్రైమరీ స్కూల్,
ధర్మవరం.**



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496



JEEVANA జీవన the family

అందుబాట్లో సాంకేతిక నైపుణ్యం

ఇంటర్నెట్ ఉన్న మొబైల్ ఫోన్‌లో ఇప్పుడు చాలా పనులు చేయొచ్చు. మల్టీమీడియా డిజైనింగ్, యానిమేషన్, రోబోటిక్స్, ఎగ్జామినేషన్ ఇవాల్యుయేషన్‌ను కూడా ఇప్పుడు అతి తక్కువ సమయంలో జరుగుతున్నాయి. ఇంటర్నెట్‌లోని ఈ సాంకేతిక సృజనపై ప్రాథమిక దశలోనైనా విద్యార్థులకు అందిస్తే వారు సాంకేతికపరంగా ముందుకు దూసుకెళ్తుంటారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో కంప్యూటర్ బోధన ఉంటున్నా అరకొరగానే సాగుతోంది. ఇలాంటి తరుణంలో విజయవాడ కెఎస్‌ఆర్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అత్యున్నత ప్రమాణాలతో ఈ బోధన కొనసాగుతోంది.



విజయవాడ పటమట లంకలోని కొమ్మా సీతారామయ్య ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (కెఎస్‌ఆర్)లో గత 8 సంవత్సరాలుగా చైతన్య సారధి ట్రస్ట్ ద్వారా బాలికల కోసం కంప్యూటర్ శిక్షణ కొనసాగుతోంది. ఈ పాఠశాలలో 6 నుంచి ఇంటర్మీడియట్ వరకూ 800 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడి పిల్లలంతా సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. ఇది గమనించిన స్థానికులు కొమ్మా సీతారామయ్య ముని మనవడు కొమ్మా తులసీరామ్, రావిపాటి పరంధామయ్యలు పాఠశాలలో భౌతిక వనరుల కోసం ఏటా రూ.2 లక్షలు వెచ్చించి అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మురళీ కృష్ణారెడ్డితో పాటుగా ఉపాధ్యాయ బృందం కృషితో కంప్యూటర్ ఉపాధ్యాయిని సబీహా బేగం కంప్యూటర్ విద్యను నాణ్యతా ప్రమాణాలతో బోధిస్తున్నారు. పాఠశాల యాజమాన్యం కోరిక మేరకు చైతన్య సారథి ట్రస్ట్ ప్రతినిధులు ఈ పాఠశాలలో కంప్యూటర్, డిజిటల్ ఎడ్యుకేషన్‌లో ఉచితంగా శిక్షణా తరగతులను అందిస్తున్నారు. ట్రస్ట్ ఫౌండర్ బిక్కసాని పూర్ణచంద్రరావు, సిఇఒ బాలమోహన్ నేమాని, కోఆర్డినేటర్ జి.నాగరాజు తదితరులు శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. చెరుకూరి వెంకట వజ్రమ్మ జ్ఞాపకార్థం డాక్టర్ బాపూజీ, కమల నర్రా దాతల సహాయ సహకారాలతో ఈ శిక్షణను అందిస్తున్నారు. పాఠశాల రెగ్యులర్ సమయంలో ప్రతిరోజూ ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బ్యాచ్‌ల వారీగా తరగతులు జరిగేవి.

ప్రస్తుతం ఏప్రిల్ 25 నుంచి సమ్మర్ కంప్యూటర్ ఉచిత తరగతులు కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ 100 మందికిపైగా విద్యార్థులు ఈ తరగతులకు హాజరవుతున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ జరిగే ఈ తరగతుల్లో కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇంటర్నెట్, మానిటర్, కీబోర్డ్, మౌస్, సిపియూ, మౌస్, ప్రింటర్, స్పీకర్, ఎంఎస్ వర్డ్, ఎక్సెల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వంటి విషయాల గురించి తెలియజేస్తున్నారు. కంప్యూటర్ టైపింగ్, చిత్రాలు గీయటం, మెయిల్స్ తయారు చేయటం వంటివి తెలియజేసి స్వయంగా ప్రాక్టీస్ చేయిస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు



రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రోత్సాహం

వైద్యవృత్తిలో ఉంటూ నేను అమెరికాలో స్థిరపడ్డాను. విద్యాదానం కన్నా గొప్పది మరొకటి లేదని భావించి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 45 (ఆంధ్రా 33, తెలంగాణా 12) ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చి సాంకేతిక విద్యను అందిస్తున్నాం. పేద విద్యార్థులు చాలా చక్కగా కంప్యూటర్ విద్యను అందిపుచ్చుకుంటున్నారు. కంప్యూటర్ ఉపాధ్యాయులకు కూడా మేమే వేతనాలు చెల్లిస్తున్నాం. టెక్నీషియన్‌ను నియమించాం. నిరంతర పర్యవేక్షణలో మరమ్మతులు లేకుండా వర్కింగ్‌లో ఉండేలా చేయిస్తున్నాం. గడిచిన ఎనిదేళ్లలో వేలాదిమంది ఈ శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు.

**- బిక్కసాని పూర్ణచంద్రరావు,
చైతన్య సారథి ట్రస్ట్ వ్యవస్థాపకులు,
బాలమోహన్ నేమాని, ట్రస్ట్ సిఇఒ**

సమ్మర్ స్పోర్ట్స్‌కు ఆదరణ



ఏప్రిల్ 25 నుంచి మా పాఠశాలలో సమ్మర్ కోచింగ్ మొదలైంది. చెస్, అథ్లెటిక్స్ వంటి అంశాల్లో ఇస్తున్న శిక్షణకు బాలికలు హాజరవుతున్నారు. రోజూ ఉదయం 6 - 7 గంటలు, సాయంత్రం 5 - 6 గంటల మధ్య నేర్పిస్తున్నాం. క్రియేటివ్ స్కిల్స్, లైఫ్‌స్కిల్స్, సింపిల్ మ్యాథ్స్ వంటి అంశాల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పాలిటెక్నికల్ ఎంట్రెన్స్‌కు కూడా ఉచితంగా శిక్షణ ఇచ్చాం. పది, ఇంటర్‌లో చదువులో మంచి ఫలితాల సాధన కోసం చదువులో వెనుకబడిన వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. కంప్యూటర్ శిక్షణకు మంచి ఆదరణ లభిస్తోంది.

- కె.మురళీకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు

టెక్నాలజీ అంశాలపై సమగ్ర అవగాహన

కంప్యూటర్ కోర్సులు బయట నేర్చుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చు చేయాలి. ఇక్కడ కంప్యూటర్ సబ్జెక్టు అంశాలపై సమగ్రంగా బోధిస్తున్నాం. ఇంటర్నెట్ వినియోగం, ఎంఎస్ వర్డ్, ఎక్సెల్, పెయింటింగ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వంటివి కూడా నేర్పించాం. సబ్జెక్టు అంశాలపై ప్రాజెక్టు వర్కులు పిల్లలే చేయగలుగుతున్నారు. లైఫ్‌స్కిల్స్, గోల్స్ సెట్టింగ్, అచీవ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. డిజిటల్ ఎడ్యుకేషన్, ఏఐ, ఎంఎల్ వంటి అంశాలు కూడా నేర్పిస్తున్నాం.

- ఎం.సబీహాబేగం, కంప్యూటర్ ఉపాధ్యాయిని



హరి హర వీరమల్లు' షూటింగ్ పూర్తి

పవన్ కల్యాణ్ ఇప్పటికే ప్రకటించిన 'హరిహర వీరమల్లు' పార్ట్ 1 సినిమా చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే పాటలు, ట్రైలర్ విడుదల చేస్తామని నిర్మాత ఎఎం రత్నం తెలిపారు. ఆఖరి షెడ్యూల్‌లో.. రెండు రోజులపాటు పవన్ కల్యాణ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. "చిత్రీకరణ పూర్తయింది. ఇక థియేటర్లలో విడుదల కావడమే తరువాయి. బ్లాక్‌బస్టర్ సాంగ్స్, అదిరిపోయే ట్రైలర్ త్వరలో విడుదలవుతాయి" అని నిర్మాత సోషల్ మీడియాలో తెలిపారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేస్తున్నామంటూ కొన్ని రోజుల క్రితం టీమ్ ప్రకటించింది. కొంత షూటింగ్ మిగిలి ఉండడంతో మరోసారి వాయిదా వేసింది. కొత్త విడుదల తేదీ వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. ఇప్పటికే రీ రికార్డింగ్, డబ్బింగ్, విఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాని క్రిష్ కొంత భాగం తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రొడ్యూసర్ రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు.

'తెరచాప' టీజర్ విడుదల



అనన్య క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న చిత్రం 'తెరచాప'. కైలాష్ దుర్గం నిర్మాతగా దీనిని నిర్మిస్తున్నారు. జోయల్ జార్జ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో విడుదల కానుంది. నవీన్‌రాజ్ శంకరపు, పూజ సుహాసిని, స్త్రీలు ముఖ్య పాత్రల్లో నటించారు. రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, ఫిష్ వెంకట్, అశోక్, నాగి, అప్పారావు, రాజేష్ భూపతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. అజీమ్, వెంకట్ సినిమాటోగ్రాఫర్లుగాను, ప్రజల క్రిష్; ఎంఎల్ రాజా సంగీతాన్ని అందించారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో కథానాయకుడు కార్తీక్‌రత్నం, హరికథ దర్శకుడు మ్యాగి ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మ్యాగి మాట్లాడుతూ తెరచాప సినిమాలో మంచి కంటెంట్ ఉందన్నారు. ఖచ్చితంగా ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తుందన్నారు. టీజర్ చాలా బాగా వచ్చిందన్నారు. ప్రొడ్యూసర్ కళ్యాణ్‌దుర్గం మాట్లాడుతూ ఈ సినిమాతో మంచి హిట్ కొడతామన్నారు.

నా అభిప్రాయం చెప్పటానికి భయపడను : ప్రకాశ్‌రాజ్



'హిందీ పరిశ్రమలోని చాలామంది ప్రభుత్వానికి అమ్ముడు పోయారు. అందుకే వారు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మాట్లాడరు. నేను ఏదైనా సూటిగానే మాట్లాడతా. రాజకీయ విషయాలపై నా అభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు బయటపెడుతుంటా. ఒకవేళ నాతో వర్క్ చేస్తే..భవిష్యత్తులో మాకు సమస్యలు వస్తాయని కొందరు భావించి ఉండొచ్చు. అందుకేనేమో నాకు బాలీవుడ్‌లో అవకాశాలు తగ్గాయి. అయినా తగ్గేదేమీ లేదు. ఇలాంటివి చాలా పరిస్థితులు చూశా. విషయం ఏదైనా స్పష్టంగా నా గళం విప్పాలనే భావనతో ఉన్నా. ప్రభుత్వం ఏదైనా సరే...చర్చలను అణచివేస్తోంది. మరో విషయం ఏమిటంటే...ఒక విషయంపై మాట్లాడాలా? లేదా? అనేది నటీనటులపై ఆధారపడివుంటుంది. సినిమాల మేకింగ్ విషయంలో వారి కంటూ ఒక అవగాహన ఉండాలి. ఆ సినిమాను విడుదల చేయటానికి కూడా పోరాటం చేయాల్సి వుంటుంది. నిజం చెప్పాలంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు ఎందుకు మాట్లాడరంటే...ఇండస్ట్రీలోని సగంమంది నటీనటులు అమ్ముడుపోయారు. మరికొంతమందికి మాట్లాడే ధైర్యం లేదు. నా మిత్రుడు ఒకరు ఇదే విషయాన్ని చెప్పారు. నీకు ధైర్యం ఉంది. అందుకే నువ్వు మాట్లాడుతున్నావ్..నాకు అంత ధైర్యం లేదు' అన్నాడు. అతడి పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. నేరాలు చేసిన వారినైనా చరిత్ర వదిలేస్తుందేమో కానీ, మౌనంగా కూర్చున్న వారిని మాత్రం విడిచిపెట్టదు.' అని ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. విషయం ఏదైనా ఆయన దేశ రాజకీయాలపై తరచూ తన అభిప్రాయాలను విస్పష్టంగా ప్రకటిస్తుంటారు. పాలకుల అప్రజాస్వామిక విధానాలపై తన ఎక్స్ వేదికగా తన గళాన్ని వినిపిస్తుంటారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో పై విధంగా మాట్లాడారు.

'శుభం' సినిమాను ఆదరించండి : సమంత



'గతంలో నేను నటించిన అన్ని సినిమాలను ప్రేక్షకులు ఆదరించారు. 'శుభం' సినిమాను కూడా అదేరీతిన ఆదరించాలని కోరుతున్నా. గతం నుంచి నాకొక సెంటిమెంట్ ఉంది. నేను నటించిన సినిమా కోసం వైజాగ్ వచ్చి వెళ్తే బ్లాక్‌బస్టర్ అవ్వాల్సిందే. ఎందుకంటే గతంలో ఓ మజిలీ, ఓ బేబీ, రంగస్థలం సినిమాల్లాగానే నాకు మళ్లీ బ్లాక్ బస్టర్ ఇస్తారని అనుకుంటున్నా. సినిమా ఇండస్ట్రీలో కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలనేదే నా లక్ష్యం. భవిష్యత్తులో అందరినీ ఆకట్టుకునే కథలను మీ ముందుకు తీసుకురావాలని ఆశిస్తున్నా. మీ ప్రేమ నాకు మరింత కావాలి. 'శుభం' సినిమాను బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలపి నన్ను దీవించండి' అని టాలీవుడ్ కథానాయిక సమంత కోరారు. ఆమె నిర్మాతగా నిర్మించిన చిత్రం 'శుభం' ఈనెల 9న విడుదల కానుంది. ఇటీవల విశాఖలో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడారు. చిత్ర యూనిట్‌తో కలిసి ఆమె సందడి చేశారు. స్టేజ్‌మీద డ్యాన్స్‌లతో అదరగొట్టారు. ఈ చిత్రంలో హర్షిత్‌రెడ్డి, సి.మల్లిరెడ్డి, శ్రియకొంతం, చరణ్ పెరి, షాలినీ కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి ప్రధాన పాత్రల్లో నటించారు. బండి మూవీ ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖతో తనకున్న అనుబంధాన్ని సమంత గుర్తుచేసుకున్నారు. అభిమానులతో ఉత్సాహంగా సెల్ఫీలు దిగారు.

ఉత్కంఠ పోరులో గుజరాత్ గెలుపు

- ఛేదనలో పలుమార్లు వర్షం అడ్డంకి
- మూడు వికెట్ల తేడాతో ఓడిన ముంబయి ఇండియన్స్



ముంబయి: ముంబయి-గుజరాత్ జట్ల మధ్య వాంఖడే స్టేడియంలో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌కు పలుమార్లు వర్షం అడ్డంకిగా నిలిచింది. ముంబయి నిర్దేశించిన 156పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించే దిశగా వెళ్తున్న గుజరాత్ విజయావకాశాలపై వరణుడు పలుమార్లు నీళ్లు చల్లాడు. తొలిసారి వర్షంతో నిలిచే సమయానికి గుజరాత్ డిఎల్‌ఎస్‌లో ముందుండగా.. రెండోసారి వర్షం అడ్డంకిగా నిలిచే సమయానికి గుజరాత్ 5పరుగులు వెనుకబడింది. ఆ సమయానికి గుజరాత్ 12బంతుల్లో 24 పరుగులు చేయాల్సి ఉంది. అర్ధరాత్రి 12.30గంటలకు మ్యాచ్ తిరిగి ప్రారంభం కాగా.. డిఎల్‌ఎస్ పద్ధతిపై 6బంతుల్లో 15పరుగులు చేయాల్సిందిగా అంపైరన్లు నిర్ణయించారు. ఆ దశలో తెవాటియా తొలి బంతికి ఫోర్ కొట్టగా.. మూడో బంతికి కోర్జే మూడో బంతికి సిక్సర్ కొట్టాడు. ఆ తర్వాత కోర్జే ఔటైనా.. చివరిబంతికి ఆర్షాద్ ఖాన్ సింగిల్ తీసి మ్యాచ్‌ను ముగించాడు. దీంతో గుజరాత్ డిఎల్‌ఎస్ పద్ధతిపై 19ఓవర్లు ముగిసేసరికి 7వికెట్ల నష్టానికి 147పరుగులు చేసి విజయం సాధించింది. అంతకుముందు ముంబయి ఆటగాడు విల్ జాక్స్(53) అర్ధ శతకానికి తోడు సూర్యకుమార్ యాదవ్(35) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. చివర్లో బోష్(27) చెలరేగడంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 155పరుగులు చేసింది. ముంబయి ఒక దశలో 3వికెట్ల నష్టానికి 97 పరుగులతో పటిష్టంగా ఉన్నా.. మిడిల్ ఓవర్లలో సాయి కిశోర్(2/34), రషీద్ ఖాన్(1/21)ల విజృంభణతో వరుసగా వికెట్లు కోల్పోయింది. దాంతో, ఆ జట్టు స్కోర్ 130 దాటడమే గగనం అనిపించింది. కానీ, ఆల్‌రౌండర్ కార్బిన్ బోష్ డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడాడు. ప్రసిధ్ కృష్ణ వేసిన 20వ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. ఆఖరి బంతికి దీపక్ చాహర్ బౌండరీ కొట్టడంతో ముంబయి గౌరవప్రద స్కోర్ చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయిని ఓపెనర్లు ఆదుకోలేకపోయారు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ రియాన్ రికెల్టన్(2)ను సిరాజ్ ఔట్ చేశాడు. అయితే..ఆ తర్వాత బంతికే విల్ జాక్స్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను సుదర్శన్ నేలపాలు చేశాడు. లైఫ్ లభించడంతో జాక్స్ బౌండరీలతో రెచ్చిపోయాడు. అయితే.. డేంజరస్ రోహిత్ శర్మ(7)ను అర్షద్ పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్(35)తో కలిసి జాక్స్ దంచేయగా ముంబయి 2 వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. గుజరాత్ స్పిన్నర్లను బాదేసిన ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 69 పరుగులు జోడించి ముంబయిని ఆదుకున్నారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
బెంగళూరు	11	8	3	0	16	+0.48
పంజాబ్	11	7	3	1	15	+0.37
ముంబయి	11	7	4	0	14	+1.27
గుజరాత్	10	7	3	0	14	+0.86
ఢిల్లీ	11	6	4	1	13	+0.36
కోల్‌కతా	11	5	5	1	11	+0.24
లక్నో	11	5	6	0	10	-0.46
సన్‌రైజర్స్	11	3	7	1	7	-1.19
రాజస్తాన్	12	3	9	0	6	-0.71
చెన్నై	11	2	9	0	4	-1.11

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు..

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి)సాయి సుదర్శన్ (బి)సిరాజ్ 2, రోహిత్ శర్మ (సి)ప్రసిధ్ (బి)ఆర్షాద్ ఖాన్ 7, విల్ జాక్స్ (సి)సాయి సుదర్శన్ (బి)రషీద్ ఖాన్ 53, సూర్యకుమార్ యాదవ్ (సి)షారుక్ ఖాన్ (బి)సాయి కిషోర్ 35, తిలక్ వర్మ (సి)శుభ్‌మన్ గిల్ (బి)కోర్జే 7, హార్దిక్ పాండ్యా (సి)శుభ్‌మన్ గిల్ (బి)సాయి కిషోర్ 1, నమన్ ధీర్ (సి)శుభ్‌మన్ గిల్ (బి)ప్రసిధ్ 7, కార్బిన్ బోష్ (రనౌట్) రషీద్ ఖాన్/బట్లర్ 27, దీపక్ చాహర్ (నాటౌట్) 8, కరణ్ శర్మ (నాటౌట్) 1, అదనం 7. (20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 155పరుగులు. **వికెట్ల పతనం:** 1/2, 2/26, 3/97, 4/103, 5/106, 6/113, 7/123, 8/150 **బౌలింగ్:** సిరాజ్ 3-0-29-1, ఆర్షాద్ ఖాన్ 3-0-18-1, ప్రసిధ్ కృష్ణ 4-0-37-1, సాయి కిషోర్ 4-0-34-2, రషీద్ ఖాన్ 4-0-21-1, కోర్జే 2-0-10-1.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)రికెల్టన్ (బి)బౌల్ట్ 5, శుభ్‌మన్ (బి)బుమ్రా 43, బట్లర్ (సి)రికెల్టన్ (బి)అశ్విని కుమార్ 30, రూథర్‌ఫోర్డ్ (ఎల్‌బి)బౌల్ట్ 28, షారుక్ ఖాన్ (బి)బుమ్రా 6, తెవాటియా (నాటౌట్) 11, రషీద్ ఖాన్ (ఎల్‌బి)అశ్విని కుమార్ 2, కోర్జే (సి)నమన్ ధీర్ (బి)దీపక్ చాహర్ 12, అర్షాద్ ఖాన్ (నాటౌట్) 1, అదనం 9. (19ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 147పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/78, 3/113, 4/115, 5/123, 6/126, 7/146 **బౌలింగ్:** దీపక్ చాహర్ 3-0-32-1, బౌల్ట్ 4-0-22-2, బుమ్రా 4-0-19-2, హార్దిక్ పాండ్యా 1-0-18-0, కరణ్ శర్మ 2-0-13-0, అశ్విని కుమార్ 4-0-28-2, జాక్స్ 1-0-15-0

ఐపిఎల్‌లో నేడు

కోల్‌కతా నైట్‌రైడర్స్ X చెన్నై సూపర్‌కింగ్స్
వేదిక: కోల్‌కతా; రాత్రి 7.30గం॥లకు

కరణ్‌వీర్, కిర్పాల్‌కు ఊరట

- నాలుగేళ్ల నిషేధం రెండేళ్లకు తగ్గింపు



న్యూఢిల్లీ: భారత షాట్‌పుటర్ కరణ్‌వీర్, డిస్కస్ త్రోయర్ కిర్పాల్‌లపై ఉన్న నాలుగేళ్ల నిషేధాన్ని జాతీయ డోపింగ్ ఏజెన్సీ(నాడా) తగ్గించింది. వీరిపై ఉన్న నాలుగేళ్ల నిషేధాన్ని రెండేళ్లకు తగ్గిస్తున్నట్లు నాడా మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 2023, డిసెంబర్ 29న డోప్ పరీక్షల్లో విఫలమైన వీరిద్దరిపై నాడా అప్పుడే నాలుగేళ్ల నిషేధం విధించింది. దీంతో వీరు మరో రెండు నెలల్లో తిరిగి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించనున్నారు. 2023 ఫెడరేషన్ కప్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన 25ఏళ్ల కరణ్‌వీర్.. ఆ సందర్భంగా ఇచ్చిన డోప్ పరీక్షల్లో పాజిటివ్‌గా వచ్చాయి. దీంతో జులై 2023లో బ్యాంకాక్‌లో జరిగే ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు భారతజట్టుకు ఎంపికైన అతడిని అర్థాంతరంగా తొలగించారు. ఇక కిర్పాల్ 2023 జాతీయ అంతర్రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం చేజిక్కించుకొని డోప్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. తాజా ప్రకటనతో వీరు మార్చి 28, 2025నుంచి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68